VELTHURU TELUGU DAILY

# వెలుతురు

తెలుగు దిన పత్రిక

రంగారెడ్డి, నల్గొండ : బుధవారం 29.07.2026

సంపుటి : 09 సంచిక : 50 , పేజీలు : 12 , వెలరూ . 5/-

SRI SHANTHI PUBLICATIONS PUBLISHED FROM TELANGANA | ANDHRAPRADESH

www.velthuru.com



2

## నీట్ నిరసనల్లో హింసపై సుప్రీం సంచలన వ్యాఖ్యలు

- పోలీసుల చర్యలపై సిటి దర్యాప్తునకు యోచన
- సిట్ దర్యాప్తుపై సుప్రీం కోర్టు ప్రశ్న

## ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ లక్ష్యం



- ప్రజావాణిని తనిఖీ చేసిన మంత్రి పొన్నం ప్రభాకర్
- అర్జీదారులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్న మంత్రి
- అధికారులతో ఫోన్లలో మాట్లాడి తక్షణ ఆదేశాలు
- భూ సమస్యలు, ఇందిరమ్మ ఇళ్ల ఫిర్యాదులపై సమీక్ష
- ప్రవాసి ప్రజావాణిపై ప్రత్యేక దృష్టి

2

# తెలంగాణకు 11.56 లక్షల ఇళ్ల వినతి

కేంద్రానికి సీఎం రేవంత్ విజ్ఞప్తి



2

- పీఎంఏవై-జీ కింద ఇళ్ల కేటాయింపు కోరారు
- 11.56 లక్షల అర్హ కుటుంబాల గుర్తింపు
- ఆవాస్ ప్లస్ సర్వే వివరాలు సమర్పణ
- వీబీజీఆర్ఏఎంజీలో కొత్త పనుల ప్రతిపాదన
- ఎల్‌నినోతో రైతు కూలీలకు ఇబ్బందులు
- ఇందిరమ్మ ఇళ్లకు 90 రోజుల ఉపాధి కోరారు
- వ్యవసాయ అనుబంధ పనులకు అవకాశం విజ్ఞప్తి


తెలంగాణ పర్యటనకు కేంద్ర మంత్రికి ఆహ్వానం

- సానుకూలంగా స్పందించిన శివరాజ్ సింగ్ చౌహాన్

**న్యూఢిల్లీ, వెలుతురు, జూలై 28:**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఢిల్లీలో కేంద్ర గ్రామీణాభివృద్ధి, వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌తో సమావేశమై తెలంగాణకు ప్రధానమంత్రి ఆవాస్ యోజన–గ్రామీణ్ (పీఎంఏవై–జీ) కింద 11,56,915 ఇళ్లను కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పేదలకు సొంత ఇళ్లు నిర్మించి ఇవ్వడాన్ని అత్యంత ప్రాధాన్యంగా తీసుకున్నామని ఆయన తెలిపారు.గత ప్రభుత్వం పీఎంఏవై–జీ పథకాన్ని సమర్థంగా వినియోగించుకోకపోవడంతో గత పదేళ్లలో గ్రామీణ ప్రాంతాల్లో పేదలకు ఇళ్లు అందలేదని, ప్రస్తుతం భారీ డిమాండ్ ఏర్పడిందని సీఎం వివరించారు.

## మోదీ వీడియో తొలగింపుపై మెటా క్షమాపణ



2

- సాంకేతిక పొరపాటేనని స్పష్టత
- కేంద్రం సమన్లతో క్షమాపణలు
- నీట్ అక్రమాలపై ప్రధాని సందేశం
- ఫేస్‌బుక్ వేదికగా యువతకు హామీ
- పేపర్ లీకేజీలపై కఠిన చట్టాలు
- మోదీ ప్రసంగంలో కీలక అంశాలు
- జులై 28న కొద్దిసేపు నిలిచిపోయిన వీడియో
- తీవ్రంగా పరిగణించిన కేంద్ర ప్రభుత్వం

**న్యూఢిల్లీ, వెలుతురు, జూలై 28:**

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఫేస్‌బుక్ ఖాతాలో పోస్ట్ చేసిన ఒక వీడియోను కొద్దిసేపు తొలగించిన వివాదంపై ప్రముఖ సోషల్ మీడియా దిగ్గజం మెటా సంస్థ కేంద్ర ప్రభుత్వానికి క్షమాపణలు తెలిపింది. ప్రధాని వీడియోను తాము ఉద్దేశపూర్వకంగా తొలగించలేదని, కేవలం సాంకేతిక లోపం వల్లే ఈ పొరపాటు జరిగిందని మెటా ప్రతినిధి స్పష్టం చేశారు. ఐటీ మంత్రిత్వ శాఖ నుంచి వచ్చిన తీవ్ర ఆదేశాల అనంతరం సదరు వీడియోను పునరుద్ధరించి, మళ్లీ అందరికీ కనిపించేలా అందుబాటులోకి తీసుకొచ్చినట్లు వెల్లడించారు.

## టెలివిజన్ అవార్డుల్లో తెలంగాణ ఆత్మ ప్రతిబింబించాలి



- మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి కీలక సూచన
- టీవీ అవార్డుల రూపకల్పనపై మంత్రి సమీక్ష
- కమిటీ సభ్యులతో కోమటిరెడ్డి ఉన్నత స్థాయి సమావేశం

▶ మిగతా 11లో

## రైతు నేస్తంతో రైతుల చెంతకు సాంకేతికత

- సచివాలయంలో 100వ ఎపిసోడ్ సంబరాలు
- మంత్రులు, అధికారుల సమక్షంలో వేడుకలు
- దేశంలోనే తొలి డిజిటల్ వేదిక
- 1600 రైతు వేదికల ద్వారా లక్షలాది మందికి అనుసంధానం
- ఎల్-నినో సవాళ్లకు కంటింజెన్సీ ప్రణాళిక
- రైతులకు నిరంతరం తోడ్పాటునంది





స్వామన్న సీఎస్

- ప్రతి మంగళవారం ప్రత్యక్ష సంభాషణ

▶ మిగతా 3లో

## ఆదిలాబాద్ ఎయిర్‌పోర్ట్‌తో ఉత్తర తెలంగాణకు కొత్త ఊపు

- ఉమ్మడి జిల్లాల అభివృద్ధికి కీలక మలుపు: పాయల్ శంకర్
- రూ.5,500 కోట్లతో జాయింట్ యూజర్ ఎయిర్‌పోర్ట్ రక్షణ శాఖ, ఏఏఐ భాగస్వామ్యంతో నిర్మాణం
- 2,200 ఎకరాల భూసేకరణకు జీవో జారీ మరో 6 వేల ఎకరాల సేకరణ కొనసాగుతోంది



10

## అదిలాబాద్ విమానాశ్రయ నిర్మాణాన్ని వేగవంతం చేయాలి



- కేంద్ర రక్షణ శాఖ జాయింట్ సెక్రెటరీ మహంతి గారిని కలిసిన ఎంపీ గోడం నగేష్, ఎమ్మెల్యేలు పాయల్ శంకర్, రాకేష్ రెడ్డి మరియు భాజపా రాష్ట్ర అధికార ప్రతినిధి అశోక్ ముస్తాపూరే.

2

## చారిత్రక వారసత్వ పరిరక్షణ అందరి బాధ్యత

- మంత్రి వాకిటి శ్రీహరి కీలక సూచనలు
- ముడుమాల్ పార్కు అభివృద్ధి పనులకు శంకుస్థాపన
- పర్యాటక శోభతో పెరగనున్న స్థానిక ఉపాధి
- మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వ ప్రాధాన్యం
- యునెస్కో తాత్కాలిక



జాబితాలో ముడుమాల్‌కి చోటు

- తెలంగాణకు గర్వకారణమన్న వేద కుమార్
- శాశ్వత గుర్తింపు కోసం కేంద్రానికి ప్రతిపాదనలు

**నారాయణపేట, వెలుతురు జూలై 28:**

మన చారిత్రక, సాంస్కృతిక వారసత్వాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత సమాజంలో ప్రతి ఒక్కరిపై ఉందని రాష్ట్ర క్రీడా, పాడి పరిశ్రమాభివృద్ధి, పశుసంవర్ధక శాఖ మంత్రి వాకిటి శ్రీహరి స్పష్టం చేశారు. ▶ మిగతా 11లో

## భూ వివాదాల్లేని తెలంగాణ నిర్మాణంలో రీ-సర్వే కీలక ఘట్టం



- ప్రజలకు పూర్తి అవగాహన కల్పిస్తూ గ్రామసభలు నిర్వహించాలి

2

- రీసర్వేకు కలెక్టర్లు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలి
- నిర్దేశించిన గడువులోగా రీసర్వే పూర్తి చేయాలి
- అధికారులకు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆదేశం

**హైదరాబాద్ వెలుతురు జూలై 28:**

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన భూముల రీ–సర్వే కార్యక్రమాన్ని అత్యంత ప్రాధాన్యతతో అమలు చేసి, నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార & పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులను ఆదేశించారు. భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపడంతో పాటు ప్రతి భూమికి స్పష్టమైన హద్దులు, ప్రతి సర్వే నంబర్‌కు భూదార్ గుర్తింపు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు.

## జూరాలకు కృష్ణమ్మ ఊరట

- సాగర్ ఆయకట్టు రైతుల్లో ఆందోళన
- బీఆర్ఎస్ నాటకాలపై మంత్రి వాకిటి ఫైర్



- ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు జలకళ
- ఎగువ ప్రాజెక్టుల నుంచి భారీగా వరద ప్రవాహం
- శ్రీశైలానికి నీటి విడుదల, ఎత్తిపోతల ప్రారంభం
- పెరుగుతున్న నీటి నిల్వలతో హర్షం

2

## యాంటీ పేపర్ లీక్ బిల్లు చరిత్రాత్మకం

- లోక్‌సభలో కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ వ్యాఖ్యలు
- పార్లమెంట్ చరిత్రలోనే చారిత్రక బిల్లు
- యువత భవిష్యత్తుపై కేంద్రం చిత్తశుద్ధికి నిదర్శనం
- లోక్‌సభలో యాంటీ-పేపర్ లీక్ బిల్లుపై ముమ్మర చర్చ



12

- గత ప్రభుత్వాల హయాంలో జరిగిన లీకేజీల లెక్కింపు
- వ్యవస్థాగత నేరాలుగా మారిన లీకేజీలు
- గతంలో జరిగిన అరకొర ప్రయత్నాలపై కేంద్ర మంత్రి నిలదీత
- నిందితులను కఠినంగా శిక్షించేలా కొత్త నిబంధనల రూపకల్పన

# మోదీ వీడియో తొలగింపుపై మెటా క్షమాపణ

(మొదటి పేజీ తరువాయి)

నీట్–యూజీ 2026 పరీక్షల్లో జరిగిన అక్రమాలపై కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) నేతృత్వంలో విద్యార్థులు దేశవ్యాప్తంగా సుదీర్ఘ నిరసనలు చేపట్టిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో జులై 23న ప్రధాని మోదీ ఫేస్‌బుక్ వేదికగా మొదటిసారిగా నేరుగా యువతను (జెన్–జీ) ఉద్దేశించి ప్రసంగించారు. ఈ వీడియో సందేశంలో పరీక్ష పేపర్ లీకేజీలకు పాల్పడే నేరస్థులపై ప్రభుత్వం అత్యంత కఠినమైన చర్యలు తీసుకుంటుందని విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు బలమైన హామీ ఇచ్చారు.తన ప్రసంగంలో ప్రధాని మాట్లాడుతూ, పేపర్ లీక్ కేసుల విచారణను వేగవంతం చేసేందుకు ప్రత్యేక ఫాస్ట్ ట్రాక్ కోర్టులను ఏర్పాటు చేయాలని సంబంధిత శాఖలను ఆదేశించినట్లు తెలిపారు. ఇందుకు సంబంధించిన కఠిన నిబంధనలతో కూడిన ముసాయిదా చట్టాన్ని పార్లమెంట్‌లో ప్రవేశపెట్టే ముందు కేబినెట్‌లో చర్చిస్తామన్నారు. దేశంలోని 22 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తు, విద్యా సంవత్సరం వృథా కాకుండా చూడడమే తమ ప్రభుత్వ ప్రథమ ప్రాధాన్యమని మోదీ ఆ వీడియోలో పేర్కొన్నారు.అయితే జులై 28న తెల్లవారుజామున ఈ వీడియో యాక్సెస్ కొద్దిసేపు నిలిచిపోవడంతో ఫేస్‌బుక్‌లో ప్రధాని పోస్ట్ కనిపించకుండా పోయింది. దేశ ప్రధాని అధికారిక వేదికగా చేసిన పోస్ట్ మాయమవ్వడాన్ని కేంద్ర ప్రభుత్వం తీవ్రంగా పరిగణించింది. వీడియోను ఎందుకు తొలగించారో వివరణ ఇవ్వాలంటూ మెటా గ్లోబల్ పబ్లిక్ పాలసీ హెడ్‌కు కేంద్ర ఐటీ మంత్రిత్వ శాఖ తక్షణమే సమన్లు జారీ చేసింది. దీంతో దిగివచ్చిన మెటా ప్రతినిధి స్పందిస్తూ, ప్రధాని వీడియో తొలగింపు పొరపాటున జరిగిందని, దానిని వెంటనే పునరుద్ధరించామని ప్రకటన విడుదల చేశారు.జంతర్ మంతర్ వద్ద విద్యార్థులు చేపట్టిన ఆందోళనల నేపథ్యంలో వారి డిమాండ్లను నెరవేర్చేందుకు ప్రభుత్వం వేగంగా అడుగులు వేసింది. ఇందులో భాగంగానే సోమవారం పార్లమెంట్‌లో 'పబ్లిక్ ఎగ్జామినేషన్స్ (ప్రివెన్షన్ ఆఫ్ అన్‌ఫెయిర్ మీన్స్) అమెండ్‌మెంట్ బిల్లు, 2026'ను ప్రవేశపెట్టింది. ఈ ప్రతిపాదిత కొత్త చట్టం ప్రకారం పరీక్షల అక్రమాలకు పాల్పడే నిందితులకు 10 ఏళ్ల వరకు జైలు శిక్షతో పాటు భారీ జరిమానాలు విధిస్తారు. కేసుల వేగవంతమైన విచారణకు ప్రత్యేక కోర్టులు పనిచేస్తాయి.మరోవైపు 'నీట్' ఆందోళనల సమయంలో విద్యార్థులకు ఇచ్చిన హామీలను కేంద్ర ప్రభుత్వం ఉల్లంఘించిందని కాక్రోచ్ జనతా పార్టీ తీవ్ర ఆరోపణలు చేసింది. సోమవారం సీజేపీ ప్రతినిధి ఆశుతోష్ రాంకా సోషల్ మీడియా వేదికగా స్పందిస్తూ, బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్‌లను ప్రశ్నించారు. నిరసనలు తెలిపిన విద్యార్థులపై ఎలాంటి పోలీసు చర్యలు తీసుకోమని చెప్పిన ప్రభుత్వం, ఇప్పుడు ఆ మాట తప్పిందని విమర్శించారు.ఆందోళనల్లో పాల్గొన్న విద్యార్థులపై నమోదు చేసిన కేసులను తక్షణమే ఉపసంహరించుకోవాలని, అరెస్టు చేసిన వారందరినీ వెంటనే విడుదల చేయాలని ఆశుతోష్ రాంకా డిమాండ్ చేశారు. బెంగాల్, బిహార్ వంటి రాష్ట్రాల్లో వందలాది మంది విద్యార్థులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారని, ఢిల్లీ సహా ఇతర ప్రాంతాల్లో ఆందోళనలకు మద్దతు ఇచ్చిన వాలంటీర్లను వేధిస్తున్నారని ఆయన ఆరోపించారు. ప్రభుత్వం ఇలాగే వ్యవహరిస్తే మళ్లీ దేశవ్యాప్తంగా పెద్ద ఎత్తున నిరసనలు చేపడతామని హెచ్చరించారు.ప్రశాంతంగా ఆందోళనలు చేసిన యువతపై నమోదు చేసిన అన్ని ఎఫ్ఐఆర్‌లను ప్రభుత్వం తక్షణమే రద్దు చేయాలని సీజేపీ డిమాండ్ చేసింది. భవిష్యత్తులో కూడా నిరసనకారులపై ఎలాంటి కొత్త కేసులు నమోదు చేయబోమని కేంద్ర ప్రభుత్వం అధికారికంగా లిఖితపూర్వక హామీ ఇవ్వాలని స్పష్టం చేసింది. ప్రభుత్వ తీరును ఎండగడుతూ, విద్యార్థుల హక్కుల కోసం తమ పోరాటం కొనసాగుతుందని సీజేపీ నాయకులు పునరుద్ఘాటించారు.

# జూరాలకు కృష్ణమ్మ ఊరట

- సాగర్ ఆయకట్టు రైతుల్లో ఆందోళన
- బీఆర్ఎస్ నాటకాలపై మంత్రి వాకిటి ఫైర్
- ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు జలకళ
- ఎగువ ప్రాజెక్టుల నుంచి భారీగా వరద ప్రవాహం
- శ్రీశైలానికి నీటి విడుదల, ఎత్తిపోతల ప్రారంభం
- పెరుగుతున్న నీటి నిల్వలతో హర్షం

**జోగులాంబ గద్వాల, వెలుతురు, జూలై 28:**

జోగులాంబ గద్వాల జిల్లాలోని ప్రముఖ నీటిపారుదల ప్రాజెక్టు అయిన ప్రియదర్శిని జూరాల జలాశయం కృష్ణా నదీ ప్రవాహంతో సంతరించుకుంది. పొరుగు రాష్ట్రమైన కర్ణాటకలోని ఆలమట్టి, నారాయణపూర్ ప్రాజెక్టుల నుంచి ఎగువన నీటిని కిందకు విడుదల చేయడంతో జూరాల ప్రాజెక్టులోకి వరద నీరు వేగంగా వచ్చి చేరుతోంది. దీంతో జలాశయంలో నీటి మట్టం క్రమంగా పెరుగుతూ నిండు కుండలా మారుతోంది. జూరాల ప్రాజెక్టు పూర్తి నీటి నిల్వ సామర్థ్యం 9.66 టీఎంసీలు కాగా, ప్రస్తుతం నీటి మట్టం 8.989 టీఎంసీలకు చేరుకుందని నీటిపారుదల శాఖ అధికారులు వెల్లడించారు.ప్రస్తుతం ఎగువన ఉన్న ప్రాజెక్టుల నుంచి జూరాల జలాశయానికి సుమారు 29,668 క్యూసెక్కుల నీటి ఇన్‌ఫ్లో వస్తోందని అధికారులు తెలిపారు. జలాశయంలో నీటి మట్టం గరిష్ఠ స్థాయికి చేరువకావడంతో, వచ్చిన నీటిలో 27,210 క్యూసెక్కుల నీటిని దిగువన ఉన్న శ్రీశైలం ప్రాజెక్టుకు విడుదల చేస్తున్నారు. అంతేకాకుండా, పరివాహక ప్రాంతాల సాగు, తాగునీటి అవసరాల కోసం నెట్టెంపాడు మరియు కోయిల్‌సాగర్ రిజర్వాయర్లకు ఎత్తిపోతల పథకాల (లిఫ్ట్ ఇరిగేషన్) ద్వారా నీటిని తోడే ప్రక్రియను అధికారులు ప్రారంభించారు.మరోవైపు, ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన బీఆర్ఎస్ మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు ఇటీవల కర్ణాటకలోని గూడూరు ప్రాంతాన్ని సందర్శించి కాంగ్రెస్ ప్రభుత్వంపై చేసిన విమర్శలను రాష్ట్ర క్రీడలు, పశుసంవర్ధక శాఖల మంత్రి వాకిటి శ్రీహరి తీవ్రంగా ఖండించారు. కృష్ణా నది జలాల నిర్వహణ మరియు పరిరక్షణపై మాట్లాడే నైతిక హక్కు బీఆర్ఎస్ పార్టీకి లేదని ఆయన మండిపడ్డారు. గత పదేళ్ల తమ పాలనా కాలంలో కర్ణాటక ప్రభుత్వం అక్రమంగా డ్యాంలు నిర్మిస్తుంటే ఎందుకు ప్రశ్నించలేదని సభ వేదికగా నిలదీశారు.ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు పరిధిలోని రైతుల ప్రయోజనాలను గత బీఆర్ఎస్ ప్రభుత్వం పూర్తిగా గాలికి వదిలేసిందని మంత్రి వాకిటి శ్రీహరి ఆగ్రహం వ్యక్తం చేశారు. కృష్ణా, భీమా నదుల నీటిని సమర్థవంతంగా నిల్వ చేసి రైతులకు సాగునీరు, ప్రజలకు తాగునీరు అందించాలనే కనీస ఆలోచన కూడా గత పాలకులకు లేదన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం పక్కా ప్రణాళికతో ముందుకు సాగుతోందని, కర్ణాటక ప్రభుత్వంతో చర్చించి కృష్ణా, భీమా నదులపై బ్యారేజీ–కమ్–బ్రిడ్జిల నిర్మాణానికి అవసరమైన నివేదికలను సిద్ధం చేశామని తెలిపారు.జూరాల ప్రాజెక్టు పరిధిలోని భూత్పూర్, అంకెనపల్లి, దాదంపల్లి, నేడుగం, అనుగొండ వంటి ముంపు గ్రామాల ప్రజల సమస్యలను గత ప్రభుత్వం దశాబ్ద కాలంగా పట్టించుకోలేదని మంత్రి విమర్శించారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆయా గ్రామాల అభివృద్ధి, పునరావాస ప్యాకేజీలు మరియు భూత్పూర్ డ్యాం విస్తరణ పనులపై ప్రత్యేక దృష్టి పెట్టిందని వివరించారు. పాలమూరు ప్రజల భవిష్యత్తు కోసం ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుంటే, బీఆర్ఎస్ నేతలు ప్లకార్డులు పట్టుకుని డ్రామాలు చేస్తున్నారని, వారిని ప్రజలు ఇక నమ్మరని స్పష్టం చేశారు.జూరాల పరిధిలో జలకళ కనిపిస్తున్నప్పటికీ, మరోవైపు నాగార్జున సాగర్ ఆయకట్టు రైతులు మాత్రం తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నాగార్జునసాగర్ జలాశయం పూర్తి నీటి మట్టం 590 అడుగులు కాగా, ప్రస్తుతం కేవలం 513.10 అడుగులు మాత్రమే ఉంది. ఇది దాదాపు డెడ్ స్టోరేజ్ (నీటిని వాడుకోలేని కనిష్ఠ స్థాయి)కి చేరువలో ఉందని నీటిపారుదల శాఖ అధికారులు చెబుతున్నారు. నాగార్జునసాగర్ జలాశయం మొత్తం నీటి నిల్వ సామర్థ్యం 312.04 టీఎంసీలు కాగా, ప్రస్తుతం ప్రాజెక్టులో కేవలం 136 టీఎంసీల నీరు మాత్రమే అందుబాటులో ఉంది.ప్రస్తుతం సాగర్ ప్రాజెక్టుకు ఎగువ ప్రాంతాల నుంచి కేవలం 900 క్యూసెక్కుల నీరు మాత్రమే ఇన్‌ఫ్లోగా వచ్చి చేరుతోంది. అంతే మొత్తంలో అంటే 900 క్యూసెక్కుల నీటిని హైదరాబాద్ మహానగర తాగునీటి అవసరాల కోసం ఔట్‌ఫ్లోగా విడుదల చేస్తున్నారు. జలాశయంలో నీటి నిల్వలు అట్టడుగుకు చేరడం మరియు ఇన్‌ఫ్లో కూడా నామమాత్రంగా ఉండటంతో పంటలకు నీరు విడుదల చేసే పరిస్థితి కనిపించడం లేదని ఆయకట్టు రైతులు కలవరపడుతున్నారు.ఈ ఏడాది ఏర్పడిన ఎల్–నినో ప్రభావం వల్ల ఆశించిన స్థాయిలో వర్షాలు కురవకపోవడంతో నాగార్జునసాగర్ ఆయకట్టు కింద పంటలకు సాగునీరు అందుతుందో లేదోనని రైతులు దిగులు చెందుతున్నారు. గతేడాది జూలై చివరి నాటికి ఎగువన వర్షాలు సమృద్ధిగా కురిసి నాగార్జునసాగర్ ఎడమ కాలువకు నీటిని విడుదల చేసిన విషయాన్ని ఈ సందర్భంగా రైతులు గుర్తుచేసుకుంటున్నారు. కాగా, ఎగువన వర్షాలు పడి ఆయకట్టును ఆదుకునేలా కృష్ణమ్మ శాంతించాలని సాగుదారులు దేవుడిని వేడుకుంటున్నారు.

# తెలంగాణకు 11.56 లక్షల ఇళ్ల వినతి

(మొదటి పేజీ తరువాయి)

కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ రూపొందించిన ఆవాస్ ప్లస్ యాప్ ద్వారా రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన సర్వేలో 11,56,915 అర్హులైన గ్రామీణ కుటుంబాలను గుర్తించినట్లు పేర్కొంటూ, వీలైనంత త్వరగా ఇళ్లను మంజూరు చేయాలని కోరారు.ఎల్‌నినో, తీవ్ర వర్షాభావ పరిస్థితుల కారణంగా గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ పనులు లేక ఎస్సీ, ఎస్టీ, చిన్న, సన్నకారు రైతులు, రైతు కూలీలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఈ నేపథ్యంలో వికసిత్ భారత్ గ్యారెంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ ఆజీవికా మిషన్ (గ్రామీణ్)లో రాష్ట్రం ప్రతిపాదించే అదనపు పనులను చేర్చాలని కేంద్ర మంత్రిని కోరారు.రైతులు తమ భూముల్లో కూరగాయల పందిళ్లు, పశుగ్రాస ప్లాట్ల అభివృద్ధి, మల్బరీ తోటలు, పట్టు పురుగుల పెంపకం, వెదురు వనాల పెంపకం వంటి పనులను కూడా ఈ పథకంలో చేర్చాలని ప్రతిపాదించారు. అలాగే కొండ ప్రాంతాల్లో నీటి నిల్వ కందకాలు, తేమ సంరక్షణ, దెబ్బతిన్న భూముల పునరుద్ధరణ పనులకు కూడా అనుమతి ఇవ్వాలని కోరారు.ఉపాధి హామీ పథకం కింద గతంలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ఇళ్ల నిర్మాణ సమయంలో 90 రోజుల ఉపాధి అవకాశం ఉండేదని గుర్తుచేసిన ముఖ్యమంత్రి, అదే విధానాన్ని వికసిత్ భారత్ గ్యారెంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ ఆజీవికా మిషన్ (గ్రామీణ్)లోనూ అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఇందిరమ్మ ఇళ్లు, ఉపాధి పనుల అంశాలపై కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ సానుకూలంగా స్పందించారని, తెలంగాణ పర్యటనకు రావాలని ఆయనను ఆహ్వానించినట్లు తెలిపారు.

# నీట్ నిరసనల్లో హింసపై సుప్రీం సంచలన వ్యాఖ్యలు

**న్యూఢిల్లీ, వెలుతురు, జూలై 28:**

నీట్ పేపర్ లీక్, పరీక్షల అక్రమాలకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా జరిగిన విద్యార్థుల నిరసనల సమయంలో చోటు చేసుకున్న హింసాత్మక ఘటనలపై భారత అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు తీవ్రంగా స్పందించింది. ఆందోళనల సమయంలో పోలీసుల అత్యుత్సాహం, బలప్రయోగంపై నిష్పాక్షిక విచారణ జరిపేందుకు ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని (సిట్) ఎందుకు ఏర్పాటు చేయకూడదని ప్రశ్నించింది. చట్టాన్ని ఎవరు చేతుల్లోకి తీసుకున్నా సరే సహించేది లేదని స్పష్టం చేసింది. నిర్దేశిత ప్రొటోకాల్స్ ఉల్లంఘిస్తే చట్టం తన పని తాను చేసుకుపోతుందని ధర్మాసనం హెచ్చరించింది.దేశవ్యాప్తంగా జరిగిన నిరసనల సమయంలో పోలీసులచే అరెస్టు లేదా అదుపులోకి తీసుకోబడిన 18 ఏళ్లలోపు వయస్సు ఉన్న విద్యార్థులకు ఎలాంటి నేర చరిత్ర లేకపోతే, వారిని వెంటనే విడుదల చేయాలని అన్ని రాష్ట్ర ప్రభుత్వాలను సుప్రీంకోర్టు ఆదేశించింది. మైనర్ల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ఈ ఆదేశాలు ఇస్తున్నట్లు తెలిపింది. అయితే కేసులకు సంబంధించిన సాధారణ దర్యాప్తును మాత్రం చట్టప్రకారం కొనసాగించవచ్చని న్యాయస్థానం స్పష్టం చేసింది.విద్యార్థుల ఆందోళనల్లో పోలీసుల చర్యలపై దాఖలైన పిటిషన్లపై సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జాయ్ మాల్యాబాగ్చి, జస్టిస్ వి.మోహనలతో కూడిన త్రిసభ్య ధర్మాసనం విచారణ చేపట్టింది. నిరసనల సమయంలో సుమారు 250 మంది పోలీసులపై దాడికి పాల్పడింది నిజమైన విద్యార్థులా లేక ఆందోళనల ముసుగులో చొరబడిన క్రిమినల్సా అనే కోణంలో స్వతంత్ర దర్యాప్తు జరగాలని ధర్మాసనం అభిప్రాయపడింది. దీనిపై ఒక నిష్పాక్షిక కమిటీని ఏర్పాటు చేస్తామని వెల్లడించింది.విచారణ సందర్భంగా సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదనలు వినిపిస్తూ, పోలీసులపై విద్యార్థులు దాడులు చేయలేదని, నిరసనల ముసుగులో నేరస్థులు ప్రవేశించి హింసను ప్రేరేపించారని కోర్టుకు తెలిపారు. దీనిపై స్పందించిన సుప్రీంకోర్టు.. ప్రజాస్వామ్యంలో శాంతియుతంగా నిరసన తెలిపే హక్కు ప్రతి ఒక్క పౌరుడికి ఉంటుందని పునరుద్ఘాటించింది. అదే సమయంలో ఆందోళనల పేరుతో జరిగే హింసను గానీ, దానికి ప్రతిగా పోలీసులు జరిపే తీవ్ర లాఠీఛార్జ్‌ను గానీ సమర్థించలేమని తేల్చిచెప్పింది.విద్యార్థుల నిరసనలకు సంబంధించి నమోదైన ఎఫ్ఐఆర్‌లపై ఢిల్లీ సహా ఇతర ప్రభుత్వాలు చట్టపరమైన దర్యాప్తును కొనసాగించుకోవచ్చని ధర్మాసనం తెలిపింది. కానీ, సాధారణ విద్యార్థులపై ప్రస్తుతం ఎలాంటి కఠినమైన లేదా బలవంతపు చర్యలు తీసుకోవద్దని అన్ని రాష్ట్రాలకు సూచించింది. అయితే, ఇప్పటికే తీవ్రమైన నేరాభియోగాలు ఉన్న ఆందోళనకారులకు ఈ ముందస్తు రక్షణ ఉత్తర్వులు వర్తించవని ధర్మాసనం స్పష్టం చేస్తూ నోటీసులు జారీ చేసింది.ఆందోళనల సమయానికి సంబంధించిన అన్ని ఎలక్ట్రానిక్ ఆధారాలను అత్యంత భద్రంగా ఉంచాలని అధికారులను సుప్రీంకోర్టు ఆదేశించింది. నిరసనలకు సంబంధించిన వీడియో రికార్డింగ్‌లు, సీసీటీవీ ఫుటేజ్‌లు, మొబైల్ వీడియోలు సహా ప్రతి డిజిటల్ ఆధారాన్ని భద్రపరచాలంది.

# ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ లక్ష్యం

**హైదరాబాద్, వెలుతురు, జూలై 28:**



రాష్ట్రంలోని ప్రజల సమస్యలకు అత్యంత వేగవంతంగా మరియు పారదర్శకంగా పరిష్కారం అందించడమే ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని హైదరాబాద్ జిల్లా ఇంచార్జి, బీసీ సంక్షేమం మరియు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. హైదరాబాద్‌లోని ప్రజా భవన్‌లో మంగళవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమాన్ని ఆయన స్వయంగా సందర్శించి, క్షేత్రస్థాయిలో అందుతున్న సేవల తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన బాధితుల నుంచి వినతిపత్రాలను మంత్రి స్వయంగా స్వీకరించి వారి సమస్యలను ఓపికగా విన్నారు.ప్రజావాణికి వచ్చిన వినతులను పరిశీలించిన అనంతరం మంత్రి పొన్నం ప్రభాకర్ అక్కడికక్కడే సంబంధిత శాఖల ఉన్నతాధికారులతో ఫోన్లలో నేరుగా మాట్లాడి, సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. ముఖ్యంగా భూ సంబంధిత వివాదాలు, ఇందిరమ్మ ఇళ్ల మంజూరు, 2బీహెచ్‌కే గృహాలు, రెవెన్యూ, మున్సిపల్ మరియు సంక్షేమ శాఖలకు సంబంధించిన దరఖాస్తులపై సుదీర్ఘంగా సమీక్ష నిర్వహించారు. అర్హులైన ప్రతి పేద దరఖాస్తుదారుడికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశాలిచ్చారు.విదేశాల్లో ఉపాధి, ఉద్యోగాలు లేదా ఇతర కారణాల వల్ల రకరకాల కష్టాలు, సమస్యలు ఎదుర్కొంటున్న తెలంగాణ నివాసితుల కోసం ప్రత్యేకంగా నిర్వహిస్తున్న 'ప్రవాసి ప్రజావాణి' అర్జీలను కూడా మంత్రి ప్రత్యేకంగా పరిశీలించారు. విదేశాల్లో ఇబ్బందులు పడుతున్న మన వారి దరఖాస్తులను విదేశాంగ మరియు ఇతర సంబంధిత శాఖల సమన్వయంతో వీలైనంత వేగంగా పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని నోడల్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.ప్రజావాణి వేదికగా ప్రజల నుంచి ప్రతిరోజూ అందుతున్న అర్జీల సంఖ్య, వాటి పరిష్కార నిష్పత్తి, శాఖల వారీగా అధికారులు తీసుకుంటున్న చర్యలపై మంత్రి సమగ్ర విచారణ జరిపారు. ప్రజా భవన్‌కు వచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూసుకోవాలని, ప్రతి వినతిని ఎంతో బాధ్యతాయుతంగా పరిశీలించి, నిర్ణీత గడువులోగానే సమస్యను పరిష్కరించి బాధితులకు సమాచారం అందించాలని కఠినంగా ఆదేశించారు.ఈ తనిఖీ కార్యక్రమంలో భాగంలో తెలంగాణ రాష్ట్ర ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మన్ చిన్నారెడ్డి, ప్రజావాణి నోడల్ అధికారి విద్యాసాగర్‌లతో మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ప్రజావాణి నిర్వహణ పద్ధతులు, ప్రజల నుంచి వస్తున్న స్పందన మరియు ఫిర్యాదుల పరిష్కార ప్రక్రియలో ఎదురవుతున్న సాంకేతిక, పరిపాలనాపరమైన అంశాలపై చర్చించి, అవసరమైన సూచనలు అందించారు.ప్రజల అర్జీలను ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతా అంశంగా భావిస్తోందని మంత్రి ఈ సందర్భంగా తెలిపారు. ప్రజావాణి ద్వారా దాఖలయ్యే ప్రతి వినతిపత్రానికి ఎలాంటి అవినీతి, జాప్యం లేకుండా పారదర్శకంగా, త్వరితగతిన పరిష్కారం అందేలా చూడటానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని పునరుద్ఘాటించారు. ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వహించే అధికారులపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.జిల్లాల్లోని క్షేత్రస్థాయి అధికారులు ప్రజావాణికి వచ్చే వినతులపై త్వరితగతిన స్పందించాలని మంత్రి ఆదేశించారు. కేవలం వినతులు స్వీకరించడమే కాకుండా, సమస్యల తీవ్రతను బట్టి వెంటనే విచారణ చేపట్టి పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి శాఖలో ప్రజావాణి అర్జీల పురోగతిని సమీక్షించడానికి ప్రత్యేక పర్యవేక్షణ వ్యవస్థను ఏర్పాటు చేయాలని సూచించారు.రాష్ట్రవ్యాప్తంగా ప్రజావాణి కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందని మంత్రి పేర్కొన్నారు. ప్రభుత్వం తీసుకుంటున్న పారదర్శక చర్యల వల్ల ప్రజల్లో నమ్మకం పెరిగిందని, సమస్యలు త్వరితగతిన పరిష్కారమవుతున్నాయని తెలిపారు. భవిష్యత్తులో కూడా ఇదే రీతిలో బాధితులకు అండగా నిలుస్తూ ప్రజా సమక్షంలోనే పాలన సాగిస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు.

# అదిలాబాద్ విమానాశ్రయ నిర్మాణాన్ని వేగవంతం చేయాలి

**న్యూఢిల్లీ వెలుతురు జూలై 28:**



అదిలాబాద్ ప్రజల దశాబ్దాల కల అయిన ఎయిర్‌పోర్ట్ నిర్మాణాన్ని మరింత వేగవంతం చేయాలని కోరుతూ ఈరోజు న్యూఢిల్లీలో కేంద్ర రక్షణ శాఖ జాయింట్ సెక్రెటరీ (Defense Ministry Joint Secretary) శ్రీ మహంతి గారిని బృందంగా కలవడం జరిగింది. ఈ సమావేశంలో ఆదిలాబాద్ పార్లమెంట్ సభ్యులు గోడం నగేష్, గౌరవ ఆదిలాబాద్ శాసనసభ్యులు పాయల్ శంకర్, గౌరవ ఆర్మూర్ శాసనసభ్యులు పైడి రాకేష్ రెడ్డి మరియు తెలంగాణ బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి అశోక్ ముస్తాపూరే పాల్గొన్నారు.ఈ సందర్భంగా డిఫెన్స్ జాయింట్ సెక్రెటరీ శ్రీ మహంతి గారు అత్యంత సానుకూలంగా స్పందించారు. ఆయన మాట్లాడుతూ "అదిలాబాద్ ఎయిర్‌పోర్ట్ పనులను మేము అత్యంత వేగవంతంగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం. నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా ఎంపీ, ఎమ్మెల్యే రోజు విడిచి రోజు నన్ను కలిసి దీని పురోగతిపై నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. దేశంలోనే ఒక ప్రాజెక్ట్ సాధన కోసం ప్రజాప్రతినిధులు ఇంత పట్టుదలతో, శ్రమతో పని చేయడం నేను మొదటిసారి చూస్తున్నాను" అని కొనియాడారు.అదిలాబాద్ ప్రజాప్రతినిధులు చూపుతున్న ఈ నిరంతర కృషి, అంకితభావం వల్లే నేడు ఎయిర్‌పోర్ట్ కల సాకారమవుతోంది. అతి త్వరలోనే అన్ని పనులూ పూర్తయి అదిలాబాద్ నేలపై విమానాలు ల్యాండ్ కాబోతున్నాయని, జిల్లా ప్రజల కల నెరవేరబోతుండటం ఎంతో సంతోషదాయకమని ఈ సందర్భంగా అశోక్ ముస్తాపూరే తెలిపారు.

# భూ వివాదాల్లేని తెలంగాణ నిర్మాణంలో రీ-సర్వే కీలక ఘట్టం



"మంగళవారం సచివాలయంలోని తన కార్యాలయంలో రీ–సర్వే జరుగుతున్న గ్రామాల్లో పురోగతి, ప్రజల స్పందన, ఎదురవుతున్న సమస్యలు, వాటి పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై రెవెన్యూ, సర్వే అధికారులతో సమీక్షించారు.ఈ సందర్భంగా మంత్రి గారు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా తొలి దశలో జిల్లాకు 70 గ్రామాల చొప్పున ఎంపిక చేసిన 2,240 గ్రామాల్లో రీ–సర్వే కార్యక్రమం కొనసాగుతోందన్నారు. ఈ రీసర్వేపై ప్రజల్లో పూర్తి అవగాహన కల్పించేందుకు ప్రతి గ్రామంలో గ్రామసభలు నిర్వహించాలని, రీ–సర్వే వల్ల కలిగే ప్రయోజనాలను రైతులకు, భూయజమానులకు వివరించాలని అధికారులకు సూచించారు. ప్రజల సహకారంతోనే ఈ కార్యక్రమం విజయవంతమవుతుందని తెలిపారు.రీ–సర్వే జరుగుతున్న ప్రతి గ్రామంలో అధికారులు క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండాలని, ప్రజలు వ్యక్తం చేసే సందేహాలను వెంటనే నివృత్తి చేయాలని మంత్రి గారు ఆదేశించారు. భూముల హద్దుల నిర్ధారణలో పారదర్శకత పాటిస్తూ ప్రతి దశలో ప్రజలను భాగస్వాములుగా చేయాలని సూచించారు.రీ–సర్వే పనులను కలెక్టర్లు స్వయంగా పర్యవేక్షించాలని, వారానికోసారి పురోగతిని సమీక్షించాలని ఆదేశించారు. రెవెన్యూ, సర్వే శాఖ అధికారులు పూర్తి సమన్వయంతో పనిచేసి నిర్ణీత లక్ష్యాలను సాధించాలని చెప్పారు. ఎక్కడైనా సమస్యలు తలెత్తితే వెంటనే ప్రభుత్వ దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలని సూచించారు.భూమి రైతుకు కేవలం ఆస్తి మాత్రమే కాదని, అది కుటుంబ జీవనాధారమని పేర్కొన్న మంత్రి, దశాబ్దాలుగా కొనసాగుతున్న భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపేందుకే ప్రభుత్వం అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో రీ–సర్వే చేపట్టిందన్నారు. డీజీపీఎస్, రోవర్స్, జీఐఎస్ వంటి ఆధునిక సాంకేతికతతో శాస్త్రీయ పద్ధతిలో సర్వే నిర్వహించడం వల్ల ప్రతి కమతానికి ఖచ్చితమైన హద్దులు నిర్ణయించబడతాయని తెలిపారు.రీ–సర్వే పూర్తయిన అనంతరం ప్రతి సర్వే నంబర్‌కు ప్రత్యేక భూదార్ నంబర్ కేటాయించి, భూ భారతి పోర్టల్‌లో నమోదు చేయడం ద్వారా భూముల యాజమాన్యంపై శాశ్వత స్పష్టత ఏర్పడుతుందని మంత్రి తెలిపారు. దీనివల్ల భూ రిజిస్ట్రేషన్లు, మ్యుటేషన్లు మరింత పారదర్శకంగా, వేగవంతంగా జరుగుతాయని చెప్పారు.ఈ కార్యక్రమాన్ని అధికారులు కేవలం ప్రభుత్వ విధిగా కాకుండా ప్రజల జీవితాలను ప్రభావితం చేసే కీలక బాధ్యతగా భావించి అంకితభావంతో పనిచేయాలని మంత్రి పొంగులేటి సూచించారు. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాల మేరకు రీ–సర్వేను విజయవంతంగా పూర్తి చేసి, భూ వివాదాల్లేని తెలంగాణ నిర్మాణానికి తోడ్పడాలని పిలుపునిచ్చారు.నక్షా లేని 373 గ్రామాల్లో కూడా రీసర్వే చురుకుగా సాగుతోందని వీలైనంత త్వరితగతిన సర్వేను పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఆయా గ్రామాల్లో అధికారులు సర్వేకు వెళ్లినప్పుడు ముందుగానే పట్టాదారులకు విధిగా నోటీసులు ఇవ్వాలని అదేవిధంగా ఆ గ్రామంలో ప్రభుత్వ భూములకు మార్కింగ్ చేయాలని గ్రామకంఠం హద్దులను నిర్ణయించిన తర్వాతే సర్వే చేపట్టాలని సూచించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా వారు సంతృప్తి చెందేలా సర్వే చేపట్టాలని ఏది చేసినా ప్రజా కోణంలోనే చేయాలని అన్నారు.

# బిహార్‌లో విద్యార్థులపై బలప్రయోగం అమానుషం

- **యువత భవిష్యత్తుతో బీజేపీ ప్రభుత్వం చెలగాటం ఆడుతోంది**
- **టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పి. ప్రసన్న కుమార్ శర్మ...**
- **విద్యార్థుల పై AK 47 తో కాల్చి చంపాలి అని ఆదేశాలు ఎవరు ఇచ్చారో తెలుసు కొని వారిని వెంటనే అరెస్ట్ చేసి శిక్షించాలి అని డిమాండ్ చేశారు.**

**హైదరాబాద్ వెలుతురు జూలై 28:**

బిహార్ రాష్ట్రంలో పరీక్షల్లో అవకతవకలు, ఉద్యోగ నియామకాలలో పారదర్శకత, నిరుద్యోగ యువత సమస్యల పరిష్కారం కోరుతూ శాంతియుతంగా ఆందోళన చేపట్టిన విద్యార్థులపై పోలీసులు లాఠీచార్జ్ చేయడం, అనంతరం చోటుచేసుకున్న కాల్పుల ఘటనలు దేశ ప్రజాస్వామ్యానికి ఆందోళన కలిగించే పరిణామాలని తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శి పి. ప్రసన్న కుమార్ శర్మ తీవ్రంగా ఖండించారు.దేశ భవిష్యత్తైన యువత తమ హక్కుల కోసం, ఉద్యోగాల కోసం, నిష్పాక్షిక పరీక్షా వ్యవస్థ కోసం పోరాడుతుంటే, వారి సమస్యలను వినాల్సిన ప్రభుత్వాలు పోలీసు బలప్రయోగంతో సమాధానం చెప్పడం అత్యంత దురదృష్టకరమని ఆయన అన్నారు. ప్రజాస్వామ్యంలో శాంతియుతంగా నిరసన తెలిపే హక్కు ప్రతి పౌరుడికి రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కు అని గుర్తు చేశారు.గత పదేళ్లుగా భారతీయ జనతా పార్టీ పాలనలో దేశవ్యాప్తంగా ప్రశ్నాపత్రాల లీకులు, పరీక్షల రద్దులు, నియామకాలలో జాప్యం, ఖాళీ ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేయడంలో వైఫల్యం వంటి పరిణామాలు లక్షలాది మంది యువత జీవితాలను అనిశ్చితిలోకి నెట్టాయని శర్మ విమర్శించారు. చదువుకుని ఉద్యోగాల కోసం సంవత్సరాల తరబడి సిద్ధమవుతున్న యువతకు అవకాశాలు కల్పించాల్సిన కేంద్ర ప్రభుత్వం, వారి ఆశలను పదేపదే దెబ్బతీస్తోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.బిహార్‌లో జరిగిన ఘటనలు కేవలం ఒక రాష్ట్రానికి పరిమితమైన సమస్య కాదని, దేశవ్యాప్తంగా యువత ఎదుర్కొంటున్న నిరుద్యోగం, పరీక్షల నిర్వహణలో లోపాలు, అవకాశాల కొరతకు ప్రతిబింబమని ఆయన పేర్కొన్నారు. యువత ప్రశ్నిస్తే లాఠీలు, నిరసన తెలుపితే కేసులు, న్యాయం కోరితే బలప్రయోగం అనే ధోరణి ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని అన్నారు.కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం యువత సమస్యలను రాజకీయ కోణంలో కాకుండా జాతీయ బాధ్యతగా పరిగణించి వెంటనే చర్యలు తీసుకోవాలని పి. ప్రసన్న కుమార్ శర్మ డిమాండ్ చేశారు.

**ఈ సందర్భంగా ఆయన కేంద్ర ప్రభుత్వాన్ని ఈ క్రింది అంశాలపై వెంటనే స్పందించాలని కోరారు:**

- బిహార్‌లో విద్యార్థులపై జరిగిన లాఠీచార్జ్, కాల్పుల ఘటనపై స్వతంత్ర, నిష్పాక్షిక విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి.
- దేశవ్యాప్తంగా పోటీ పరీక్షల నిర్వహణలో పూర్తి పారదర్శకతను తీసుకురావాలి.



**టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పి. ప్రసన్న కుమార్ శర్మ...**

- ప్రశ్నాపత్రాల లీకులను పూర్తిగా అరికట్టేందుకు కఠిన చట్టాలను సమర్థవంతంగా అమలు చేయాలి.
- పెండింగ్‌లో ఉన్న అన్ని ప్రభుత్వ ఉద్యోగాలను నిర్ణీత కాలపట్టిక ప్రకారం భర్తీ చేయాలి.
- నిరుద్యోగ యువతతో చర్చలు జరిపి వారి సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలి.

ప్రజాస్వామ్యంలో యువత గొంతును అణచి వేయడం ద్వారా సమస్యలు పరిష్కారం కావని, వారికి న్యాయం చేయడం ద్వారానే దేశ భవిష్యత్తు బలోపేతం అవుతుందని పి. ప్రసన్న కుమార్ శర్మ పేర్కొన్నారు. యువత చేతుల్లో ఉద్యోగ నియామక పత్రాలు ఉండాల్సిన చోట లాఠీలు కనిపించడం దేశానికి శోచనీయమని, భారతీయ జనతా పార్టీ ప్రజావ్యతిరేక, యువత వ్యతిరేక విధానాలను దేశ ప్రజలు గమనిస్తున్నారని ఆయన అన్నారు.

# సంత్ రవిదాస్ మహారాజ్ జయంతి సందర్భంగా సమరసత సంకల్ప అభియాన్

- **పెద్దిరెడ్డి రవికిరణ్, బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి, ఆంధ్రప్రదేశ్**

**ఆంధ్రప్రదేశ్ వెలుతురు జూలై 28:**

శ్రీ గురు రవిదాస్ మహారాజ్ గారి 650వ జయంతిని పురస్కరించుకొని భారతీయ జనతా పార్టీ దేశవ్యాప్తంగా "సమరసత సంకల్ప అభియాన్" కి శ్రీకరం చుట్టింది. 15వ శతాబ్దంలో వారణాసిలో జన్మించిన శ్రీ గురు రవిదాస్ గారు వారి యొక్క రచనలు కీర్తనలు భజనలు ద్వారా భక్తిని ప్రేమని సమసమానత్వాన్ని ప్రబోధిస్తూ అస్పృశ్యతకి అంటరానితనానికి వ్యతిరేకంగా ప్రజల్లో సామాజిక చైతన్యం తీసుకొచ్చిన గురు శిరోమణి. వారి యొక్క ఆలోచనలని భారతీయ జనతా పార్టీ గ్రామ గ్రామాన తీసుకువెళ్ళటానికి జూలై 29 అనగా గురు పౌర్ణమి రోజు నుంచి ఫిబ్రవరి 20, 2027 వరకు దేశవ్యాప్తంగా అనేక కార్యక్రమాలకి శ్రీకరం చుట్టింది. దీనిలో భాగంగా సమరసత దీప ప్రజ్వలన, కలశ వందనం, సమరసత యాత్ర, సాధువులతో సమాలోచన, విద్యార్థులతో చర్చ వంటి వివిధ కార్యక్రమాలకు యువజన చేయటం జరిగింది. ఈ కార్యక్రమాల్లో ప్రజలందరూ స్వచ్ఛందంగా పాల్గొనాలని బిజెపి విజ్ఞప్తి చేస్తుంది – పెద్దిరెడ్డి రవికిరణ్, బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి, ఆంధ్రప్రదేశ్



# నగరంలో భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి – హైదరాబాద్ ఇంచార్జి మంత్రి పొన్నం ప్రభాకర్

**హైదరాబాద్ వెలుతురు జూలై 28:**

హైదరాబాద్ నగరంలో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హైదరాబాద్ జిల్లా ఇంచార్జి మంత్రి, బీసీ సంక్షేమం మరియు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సూచించారు.నగరంలో నెలకొన్న పరిస్థితులను మంత్రి ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ, జీహెచ్ఎంసీ కమిషనర్, హైదరాబాద్ జిల్లా కలెక్టర్, హైదరాబాద్ సిటీ పోలీస్ కమిషనర్‌లతో ఫోన్‌లో మాట్లాడారు. భారీ వర్షాల కారణంగా ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని, అవసరమైన సహాయక చర్యలను వెంటనే చేపట్టాలని ఆదేశించారు.ఆకస్మికంగా కురిసిన భారీ వర్షంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా చర్యలు తీసుకోవాలని ట్రాఫిక్ పోలీసులకు సూచించారు. ముఖ్యంగా రాజ్‌భవన్ రోడ్, సోమాజిగూడ, ప్రజాభవన్ పరిసర ప్రాంతాల్లో ఏర్పడిన వాటర్ లాగింగ్‌ను సిబ్బంది వేగంగా తొలగించారని తెలిపారు.కృష్ణానగర్ ప్రాంతంలో ఎత్తైన ప్రాంతాల నుంచి భారీగా వర్షపు నీరు రోడ్లపైకి రావడంతో కొంతమేర ఇబ్బందులు తలెత్తినట్లు అధికారులు మంత్రికి వివరించారు. ప్రస్తుతం రాజేంద్రనగర్, శంషాబాద్ పరిసర ప్రాంతాల్లో వర్షం కొనసాగుతోందని, మరో రెండు గంటల పాటు వర్షం కురిసే అవకాశం ఉన్న నేపథ్యంలో జీహెచ్ఎంసీ, పోలీస్, ట్రాఫిక్, హైడ్రా బృందాలు పూర్తి అప్రమత్తతతో



సమన్వయం చేసుకుని పనిచేయాలని మంత్రి ఆదేశించారు.నీరు నిల్వ ఉన్న ప్రాంతాల్లో మ్యాన్‌హోల్‌ల వద్ద ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని, జీహెచ్ఎంసీ మరియు హైడ్రా మాన్సూన్ ఎమర్జెన్సీ బృందాలు నిరంతరం పర్యవేక్షిస్తూ ప్రజల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు.అత్యవసర పరిస్థితులు మినహా ప్రజలు వీలైనంత వరకు బయటకు రావద్దని, లోతట్టు ప్రాంతాల ప్రజలు మరింత అప్రమత్తంగా ఉండాలని మంత్రి విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం అన్ని శాఖల సమన్వయంతో పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తూ, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపడుతోందని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు.

# యశోద ఆసుపత్రిలో పెద్ది సుదర్శన్ రెడ్డిని పరామర్శించిన మంత్రి పొంగులేటి





- **కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి, వైద్యులతో చికిత్స వివరాలపై ఆరా**

**హైదరాబాద్ వెలుతురు జూలై 28:**

మాజీ ఎమ్మెల్యే, తెలంగాణ రాష్ట్ర సివిల్ సప్లైస్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పెద్ది సుదర్శన్ రెడ్డి సికింద్రాబాద్ యశోద ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న నేపథ్యంలో రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార & పౌర సంబంధాల శాఖ మంత్రి శ్రీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి మంగళవారం ఆసుపత్రికి వెళ్లి ఆయన ఆరోగ్య పరిస్థితిని పరామర్శించారు.ఈ సందర్భంగా పెద్ది సుదర్శన్ రెడ్డిని ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్న మంత్రి అనంతరం వైద్యులతో మాట్లాడి అందిస్తున్న చికిత్స, ఆరోగ్య పురోగతిపై వివరాలు తెలుసుకున్నారు.అనంతరం పెద్ది సుదర్శన్ రెడ్డి కుటుంబ సభ్యులను కలిసి వారికి ధైర్యం చెప్పారు. అత్యుత్తమ వైద్య సేవలు అందుతున్నాయని, ఆయన త్వరగా కోలుకుని సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగి ప్రజల మధ్యకు రావాలని ఆకాంక్షిస్తున్నట్లు మంత్రి పొంగులేటి తెలిపారు. కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని, రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందని ఆయన భరోసా ఇచ్చారు.

# మాజీ కేంద్ర మంత్రి అత్యుత్తమ పార్లమెంటేరియన్ అవార్డు గ్రహీత జైపాల్ రెడ్డి గారి 7 వ వర్ధంతి సందర్భంగా స్ఫూర్తి స్థల్ లో ఆయన స్మారకానికి నివాళులు అర్పించిన మంత్రి పొన్నం ప్రభాకర్

- **మంత్రి పొన్నం ప్రభాకర్ కేంద్ర మాజీ మంత్రి, ఉత్తమ పార్లమెంటేరియన్ జైపాల్ రెడ్డి గారి వర్ధంతి సందర్భంగా నివాళులు..**

**హైదరాబాద్ వెలుతురు జూలై 28:**

దేశంలోనే ఎంతో ఆదరణ పొందిన నాయకుడిగా, లోక్‌సభ మరియు రాజ్యసభల్లో ప్రజా సమస్యలపై స్పష్టమైన అవగాహనతో, పదునైన ప్రసంగాలతో గళమెత్తిన మేధావి అత్యుత్తమ పార్లమెంటేరియన్.15 వ లోక్ సభ లో తో పార్లమెంట్ సభ్యుడిగా మేము కొత్తగా పార్లమెంట్ లో అడుగుపెట్టినపుడు ఆయన మాకు ఎంతో స్ఫూర్తి కలిగించారు.తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధన ప్రక్రియలో మరియు




పార్లమెంటులో తెలంగాణ బిల్లు ఆమోదం పొందడంలో జైపాల్ రెడ్డి గారు ఎంతో కృషి చేశారు.జైపాల్ రెడ్డి గారు తమ సుదీర్ఘ రాజకీయ జీవితంలో ఎల్లప్పుడూ సిద్ధాంతాలు, నైతిక విలువలు, మచ్చలేని నిబద్ధతతో పనిచేశారు.<

ఆయన రాజకీయ ప్రస్థానం నేటి తరానికి స్ఫూర్తిదాయకం..

# రైతు నేస్తంతో రైతుల చెంతకు సాంకేతికత

- **రైతు-శాస్త్రవేత్తల అనుసంధానంతో సమస్యలకు పరిష్కారం**

**హైదరాబాద్, వెలుతురు, జూలై 28:**

రైతు చెంతకు నూతన వ్యవసాయ సాంకేతిక పరిజ్ఞానాన్ని చేరవేయడమే ధ్యేయంగా ప్రారంభమైన 'రైతు నేస్తం' కార్యక్రమం విజయవంతంగా 100వ ఎపిసోడ్‌కు చేరుకుంది. ఈ సందర్భంగా హైదరాబాద్ సచివాలయంలో మంగళవారం నిర్వహించిన శతావధి ఎపిసోడ్ వేడుకలు అత్యంత ఘనంగా సాగాయి. ఈ ప్రత్యేక కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్యేలు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, వ్యవసాయ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె. సురేంద్ర మోహన్, వ్యవసాయ విశ్వవిద్యాలయాల వైస్ ఛాన్సలర్లు, ఉన్నతాధికారులు మరియు పలు జిల్లాలకు చెందిన ఆదర్శ రైతులు పాల్గొన్నారు.రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 1600 రైతు వేదికలలో డిజిటల్ వీడియో కాన్ఫరెన్స్ సదుపాయం కల్పించి, రైతులను నేరుగా వ్యవసాయ శాస్త్రవేత్తలతో అనుసంధానించిన కార్యక్రమం దేశంలోనే ఇది మొదటిదని మంత్రి తుమ్మల వెల్లడించారు. 2024 మార్చి 6న ప్రారంభమైన ఈ వేదిక ద్వారా ఇప్పటివరకు 27.30 లక్షలకు పైగా రైతులు ప్రయోజనం పొందారని చెప్పారు. ప్రత్యక్షంగా పాల్గొన్న రైతులలో 5.26 లక్షలకు పైగా మహిళా రైతులు ఉండడం విశేషం. గతంలో నిరుపయోగంగా మారిన రైతు వేదికలను నాలెడ్జ్ హబ్‌లుగా మార్చడంలో ఈ కార్యక్రమం విజయం సాధించిందన్నారు.కార్యక్రమంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు మాట్లాడుతూ.. రైతు నేస్తం శతావధి ఎపిసోడ్ మైలురాయిని చేరుకోవడంలో కీలక పాత్ర పోషించిన రైతులు, శాస్త్రవేత్తలు మరియు అధికారులను అభినందించారు. ప్రస్తుత ఎల్–నినో పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని వ్యవసాయ శాఖ సిద్ధం చేసిన కంటింజెన్సీ ప్రణాళిక ప్రకారం రైతులకు అవసరమైన నాణ్యమైన విత్తనాలు, సాంకేతిక సలహాలు, తదితర మద్దతును అందించేందుకు ప్రభుత్వం ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటుందని హామీ ఇచ్చారు.ప్రతి వారంలో మంగళవారం ఉదయం 10 గంటల నుంచి 11.30 గంటల వరకు నిర్వహించే రైతు నేస్తం లైవ్ కార్యక్రమంలో రైతులు అడిగే ప్రశ్నలకు శాస్త్రవేత్తలు వెంటనే సమాధానాలు అందిస్తున్నారు. పంటలు తెగుళ్ల బారిన పడకముందే తగిన నివారణ చర్యలు తీసుకునేందుకు ఈ వేదిక ఎంతో ఉపయోగపడుతోందని అధికారులు తెలిపారు. క్షేత్రస్థాయిలో సమస్య ఎదురైన వెంటనే నిపుణుల సలహా అందడం వల్ల రైతులకు నష్టాలు తగ్గుతున్నాయని మంత్రులు వివరించారు.వాతావరణ శాఖ నివేదికల ప్రకారం జూలై నెలలో 218 మిమీ వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా, కేవలం 150 మిమీ మాత్రమే కురిసి 27 శాతం వర్షపాత లోటు ఏర్పడిందని మంత్రి తుమ్మల వెల్లడించారు. రానున్న రోజుల్లో ఉత్తర తెలంగాణలో అల్పపీడన వర్షాలు కురిసినప్పటికీ, ఇవి ప్రాజెక్టులు నిండటానికి లేదా భూగర్భ జలాలు పెరగడానికి సరిపోవని స్పష్టం చేశారు. కాబట్టి రైతులు కేవలం వర్షాలను చూసి ఎక్కువ నీరు అవసరమయ్యే వరి పంటపైనే ఆధారపడకుండా, ఆయిల్ పామ్, ఉద్యాన పంటలు, ఆరుతడి పంటలను సాగు చేయాలని కోరారు.ప్రపంచవ్యాప్తంగా వాతావరణ మార్పులు మరియు యుద్ధ పరిస్థితులు వ్యవసాయ రంగంపై ప్రభావం చూపుతున్న తరుణంలో, రైతు సాంకేతికంగా మారాల్సిన అవసరం ఉందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అభిప్రాయపడ్డారు. భూగర్భ జలాల పరిస్థితిని బట్టి ప్రాంతాల వారీగా ఏ పంటలు అనుకూలమో శాస్త్రవేత్తల సూచనల మేరకు మాత్రమే నిర్ణయించుకోవాలని పిలుపునిచ్చారు.

రైతును ఆర్థికంగా బలోపేతం చేసి రాజుగా మార్చడమే ప్రభుత్వం మరియు రైతు నేస్తం యొక్క అంతిమ లక్ష్యమని ఆయన పేర్కొన్నారు.ఈ 100వ ఎపిసోడ్ సందర్భంగా పలు జిల్లాల నుంచి వచ్చిన ఆదర్శ రైతులు తమ సాగు అనుభవాలను సభతో పంచుకున్నారు. ఖమ్మం, జగిత్యాల, నల్గొండ, నాగర్‌కర్నూల్, మహబూబాబాద్ జిల్లాల రైతులు మాట్లాడుతూ.. రైతు నేస్తం ద్వారా లభించే సూచనలు తమకు ఎంతగానో ఉపకరిస్తున్నాయని తెలిపారు. బోర్ల కింద ఆయిల్ పామ్, బోడ కాకర, ప్రకృతి వ్యవసాయం చేస్తూ తక్కువ నీటితో అధిక దిగుబడి, లక్షల్లో ఆదాయం పొందుతున్న విధానాలను ఇతర రైతులకు వివరించారు.కార్యక్రమం ముగింపు ఘట్టంలో, రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి వచ్చిన ఆదర్శ రైతులకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మరియు అధికారులు వేదికపై శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. ప్రతి జిల్లా నుంచి ఐదుగురు చొప్పున ఎంపిక చేసిన ప్రతిభావంతులైన రైతులకు గుర్తింపు అందించారు. రైతులు, శాస్త్రవేత్తలు మరియు అధికారుల సమిష్టి భాగస్వామ్యంతో రైతు నేస్తం భవిష్యత్తులో మరిన్ని మైలురాళ్లను అధిగమిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

# కాలం మారుతోంది... మనిషి మారుతున్నాడా?



నిత్యనూతనమైన కాలచక్రం తన సహజ సిద్ధమైన వేగంతో అప్రతిహతంగా ముందుకు సాగిపోతూనే ఉంది. నిన్నటి జ్ఞాపకాల నుంచి నేటి వాస్తవికత లోకి, నేటి అనుభవాల నుంచి రేపటి సుదూర స్వప్నాల వైపుకు ప్రతిక్షణం పరివర్తన చెందడం ప్రకృతి యొక్క నైసర్గిక సూత్రం. ఈ పరిణామ క్రమంలో మానవ సమాజం సాధించిన సాంకేతిక పురోగతి మునుపెన్నడూ లేని రీతిలో ఊహకందని స్థాయికి చేరుకుంది. అరచేతిలో ఇమిడిపోయే ఒక చిన్న స్మార్ట్‌ఫోన్ పరికరంలో ఇవాళ ప్రపంచ సమాచారమంతా బందీ అయిపోయింది. కాలానుగుణంగా వికసిస్తున్న కృత్రిమ మేధస్సు (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) నేడు మనిషి యొక్క సృజనాత్మక ఆలోచనా ధోరణినే నేరుగా సవాలు చేస్తోంది. రవాణా శ్రేణి, వైద్య సహాయక రంగాలు, విద్యా బోధన, వ్యాపార లావాదేవీలు వంటి ప్రతి ప్రాథమిక రంగంలోనూ విప్లవాత్మక మార్పులు ముమ్మరంగా చోటుచేసుకుంటున్నాయి. అయితే, ఈ అనివార్య ఆధునిక పరిణామాల మధ్య ఒక్కక్షణం నిలబడి లోతుగా ఆలోచిస్తే ఒక సంక్లిష్టమైన ప్రశ్న మదిని నిరంతరం తొలిచేస్తోంది. సాంకేతికంగా పురోగమిస్తున్న ఈ కాలంలో నిజంగా మనిషి అంతరంగం మారుతుందా? లేక కాలంతోపాటు కేవలం అతని బాహ్య జీవన విధానం, అలవాట్లు మాత్రమే మార్పునకు లోనవుతున్నాయా? అనే సంశయం విజ్ఞులైన మేధావుల్లో తీవ్రంగా రేకెత్తుతోంది.

ఒకప్పుడు సమాచార మార్పిడికి సుదూర ప్రాంతాలకు పంపే కాగితపు ఉత్తరాలే ఏకైక ఆధారంగా ఉండేవి. కన్నవారు, కట్టుకున్నవారు పంపిన అక్షర రూప సందేశం కోసం వారాల తరబడి, నెలల తరబడి నిరీక్షించేవారు. ఆ దీర్ఘకాలపు ఎదురుచూపుల్లో వర్ణించలేని ఒక మధురమైన ఆత్మీయత, అనురాగం దాగి ఉండేవి. వర్తమాన డిజిటల్ యుగంలో సంభాషణలు లేదా వర్తమానాలు క్షణాల వ్యవధిలోనే నిర్దేశిత ప్రాంతాలకు చేరుతున్నాయి. కానీ ఆ శీఘ్ర సమాచార ప్రసారాల్లో ప్రాచీన కాలపు అనుబంధాలు, సాన్నిహిత్యాలు మాత్రం క్రమక్రమంగా కనుమరుగవుతున్నాయి. వివిధ సామాజిక మాధ్యమాల సమూహాలలో (వాట్సాప్ గ్రూపులలో) వందలాది మంది సభ్యులు నిత్యం అనుసంధానమై ఉన్నప్పటికీ, క్లిష్ట సమయంలో పక్కన నిలిచే నిజమైన ఆప్తమిత్రులు మాత్రం వేళ్ల మీద లెక్కపెట్టే స్థాయికి దిగజారిపోయారు. ఆధునిక సాంకేతిక విప్లవం మనుషులను హృదయపూర్వకంగా దగ్గర చేసిందా లేక మానసికంగా మరింత దూరం నెట్టివేసిందా అనేది నేటి యువతరం ముందున్న అత్యంత ప్రాధాన్యత కలిగిన ప్రధాన ప్రశ్న.కుటుంబ వ్యవస్థ పరిణామాన్ని పరిశీలిస్తే, పూర్వపు ఉమ్మడి కుటుంబ వ్యవస్థలు పూర్తిగా విచ్ఛిన్నమై, నేడు పరిమిత కుటుంబాలు (న్యూక్లియర్ ఫ్యామిలీస్) విరివిగా వెలసాయి. అంతులేని ఆర్థిక అవసరాలు, ఉద్యోగ అవకాశాల దృష్ట్యా ఇది కాలక్రమేణా సంభవించిన అనివార్య మార్పు కావచ్చు. కానీ కన్న తల్లిదండ్రుల పట్ల భక్తిప్రపత్తులు, వయోవృద్ధుల మాటలకు ఇవ్వాల్సిన సముచిత గౌరవం, ప్రాచీన సాంప్రదాయాల పట్ల నిలపాల్సిన సంస్కారం క్రమేణా సన్నగిల్లుతున్నాయని సామాజిక విశ్లేషకులు స్పష్టం చేస్తున్నారు. విచ్చలవిడిగా ప్రధాన నగరాల్లో, పట్టణాల్లో వృద్ధాశ్రమాలు పుట్టగొడుగుల్లా వెలుస్తుండటం ఈ సాంస్కృతిక పతనానికి ఒక ప్రత్యక్ష నిదర్శనం. భౌతిక సంపద, నగర హోదా, నిరంతర పోటీతత్వం అనే అంశాలు మనిషియొక్క నైతిక విలువలను పూర్తిగా వెనక్కి నెట్టేస్తున్నాయా అనే అనుమానం ప్రతి ఒక్కరిలో కలుగక మానదు.అయితే, ప్రస్తుత సామాజిక పరిస్థితులను కేవలం ప్రతికూల కోణంలోనే చూడటం సమంజసం కాదు. నాణేనికి మరోవైపు నుంచి పరిశీలిస్తే, మానవ ప్రవర్తనలో కొన్ని సానుకూల విప్లవాత్మక మార్పులు కూడా విస్పష్టంగా గోచరిస్తున్నాయి. విద్యాభ్యాసంలోనూ, ఉద్యోగ అవకాశాల్లోనూ మహిళలు పురుషులతో సమానంగా అద్భుత ప్రగతి సాధిస్తున్నారు. కాలంచెల్లిన కుల, మత వైషమ్యాలను, పాతకాలపు పట్టింపులను పక్కనబెట్టి నేటి యువత సమభావంతో స్నేహ హస్తాలు చాచుతోంది. పర్యావరణ పరిరక్షణ, ప్రకృతి సమతుల్యత పట్ల నవసమాజంలో అవగాహన గణనీయంగా పెరిగింది. సామాజిక మాధ్యమాలు కొన్ని సందర్భాల్లో దుర్వినియోగానికి గురవుతున్నప్పటికీ, బాధితులకు సమయానుకూలంగా న్యాయం చేకూర్చడంలో, సామాజిక స్పృహను పెంపొందించడంలో అవి మహత్తర పాత్ర పోషిస్తున్నాయి. విశ్వవ్యాప్తం చేసే శక్తివంతమైన వేదికగా రూపాంతరం చెందుతుంది.వర్తమాన పాఠశాలల్లో విద్యా ప్రణాళికలు (సిలబస్) రూపురేఖలు మారాయి, అధునాతనమైన బోధనా పద్ధతులు అందుబాటులోకి వచ్చాయి. కానీ, నైతిక విలువల బోధన, జీవన నైపుణ్యాల శిక్షణ మాత్రం విద్యాసంస్థల్లో తీవ్రంగా వెనుకబడుతున్నాయి. కేవలం మార్కుల వేట, ర్యాంకుల పోటీలో పడి చిన్నారుల మానసిక ఆరోగ్యం, వారి భావోద్వేగాల పరిపక్వత తీవ్ర నిర్లక్ష్యానికి గురవుతున్నాయి. అనేకమంది తల్లిదండ్రులు తమ పిల్లలతో నాణ్యమైన సమయాన్ని గడపడం కంటే, వారి భౌతిక కోరికలను డబ్బుతో కొనివ్వడానికే ప్రాధాన్యత ఇస్తున్నారు. ఫలితంగా, భౌతికంగా, సాంకేతికంగా ఎంతో తెలివైన తరంగా ఎదుగుతున్నప్పటికి, మానసికంగా, భావోద్వేగపరంగా అత్యంత బలహీనమైన సమాజంగా తయారవుతున్నారా అనే ఆందోళన విద్యావేత్తల్లో వ్యక్తమవుతోంది.అదే సమయంలో, పల్లెసీమల్లో నేటికీ పరస్పర సహకార ధోరణి, ప్రాచీన జీవన సౌందర్యం, పండుగ పబ్బాల్లో కలసిమెలిసి జీవించే ఉమ్మడి సంస్కృతి ఇంకా సజీవంగానే ఉంది.

అనూహ్యంగా వచ్చే ప్రళయకర వరదలు, ప్రకృతి వైపరీత్యాలు సంభవించిన క్షణాల్లో వేలాదిమంది సామాన్య పౌరులు తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా ఆపన్నహస్తం అందించడం మనమందరం నిత్యం చూస్తున్నదే. కాబట్టి మానవాళిలో నైతికత పూర్తిగా నశించిపోయిందని తీర్పు చెప్పడం సత్యదూరమే అవుతుంది.కాల మార్పును శాసించడం మానవ మాత్రుల వశం కాదు. అది ప్రకృతి యొక్క నిరంతర సూత్రం. అయితే ఆ మార్పును మానవుడు ఏ కోణంలో స్వీకరిస్తున్నాడు, దానికి అనుగుణంగా తన అంతరంగ ఆలోచనా ధోరణిని ఎలా మలచుకుంటున్నాడు అనేదే ఇక్కడ ప్రధానంగా గుర్తించాల్సిన విషయం. సాంకేతిక పరిజ్ఞానం అనేది కేవలం సాధనం మాత్రమే. దానిని వినియోగించే మనిషి మనస్తత్వం, సంస్కారం మెరుగుపడకపోతే, ఆ సాధనమే అతని మానసిక బలహీనతలను లోకానికి బహిర్గతం చేస్తుంది. దానికి భిన్నంగా, మనిషి తన హృదయ కోశంలో మానవత్వాన్ని పదిలంగా కాపాడుకుంటే, అదే సాంకేతికత అతని విశాల దృక్పథాన్ని, మంచితనాన్ని నగర ప్రాంతాల్లో రోజురోజుకు మృగ్యమవుతున్న మానవీయ అనుబంధాలను గ్రామీణ వాతావరణం నేటికీ నిలబెట్టుకుంటోంది. ఇది వర్తమాన సమాజానికి ఎంతో ఆశాజనకమైన పరిణామం.కాలం తన అనంతమైన ప్రయాణాన్ని కొనసాగిస్తూనే ఉంటుంది. దాని వేగాన్ని నిరోధించడం ఎవరికీ సాధ్యం కాదు. అయితే ఆ మార్పుల ప్రభావాన కొట్టుకుపోకుండా, మానవుడిగా మన మౌలిక విలువలైన ప్రేమ, కరుణ, సహనం, పరస్పర గౌరవ భావాలను కాపాడుకోవడం అత్యంత ఆవశ్యకం. నూతన సాంకేతికతను సాదరంగా ఆహ్వానిద్దాం, ఆధునిక భావాలను నిరభ్యంతరంగా స్వీకరిద్దాం. కానీ మనలోని మానవీయ కోణాన్ని మాత్రం ఎట్టి పరిస్థితుల్లోనూ విస్మరించకూడదు. కాలంతో పాటు వేగంగా మారడం ఎంత అవసరమో, ప్రాచీన మంచితనాన్ని కాపాడుకుంటూ పరివర్తన చెందడమే అంతటి నిజమైన సామాజిక పురోగతి. మానవీయ దృక్పథంతో కూడిన మార్పే భవిష్యత్తు తరాలకు సువర్ణ బాటలు వేస్తుంది.భావితరాలకు సత్సంప్రదాయాలను అందించడం మనందరి ప్రాథమిక బాధ్యత. సాంకేతికంగా ఎంత ఎదిగినా, మానవత్వం లోపిస్తే ఆ పురోగతికి విలువా అర్థం ఉండవు. అందుకే ప్రతి ఒక్కరూ తమ అంతరంగంలో నైతిక నిధులను పదిలపరుచుకుంటూ చైతన్యంతో ముందుకు సాగాలి. అప్పుడే భావి సమాజంలో శాంతి, సౌభాగ్యాలు పరిపూర్ణంగా వికసించి సార్థకత చేకూరుతుంది.



డా. సూర్యదేవర రామకృష్ణ ,
Moral Philosopher, 9490754169

# హైడ్రా ఆగదు... అక్రమార్కుల అంతం ఆగదు!

వెయ్యి శుభములు జరిగేటప్పుడు... ఒక్కటి రెండు ఆటంకాలు రావడం సహజం. ఒక మంచి పనికి మధ్యలో కొన్ని చట్టపరమైన, సాంకేతిక సమస్యలు ఎదురవుతాయి. అంత మాత్రాన ఆ పని వెనక్కి తగ్గదు. ప్రజల ప్రయోజనం కోసం ప్రారంభమైన సంస్కరణలు మధ్యలో ఎదురయ్యే ఆటంకాలను అధిగమిస్తూ ముందుకు సాగుతాయి. హైడ్రా విషయంలో ఇప్పుడు తెలంగాణ సమాజం కూడా ఇదే ప్రశ్నను ఎదుర్కొంటోంది. తెలంగాణ హైకోర్టు ఇటీవల హైడ్రా వ్యవహారంపై కొన్ని చట్టపరమైన అంశాలపై తన అభిప్రాయాన్ని వ్యక్తం చేసింది. ప్రజాస్వామ్యంలో న్యాయవ్యవస్థ తన రాజ్యాంగబద్ధమైన బాధ్యతను నిర్వర్తించడం ఎంత ముఖ్యమో, ప్రజా ఆస్తులను పరిరక్షించడం కూడా అంతే ముఖ్యమైన బాధ్యత. ఈ రెండు వ్యవస్థలు పరస్పర విరోధాలు కావు. రెండింటి లక్ష్యం కూడా ప్రజా ప్రయోజనమే. అందుకే న్యాయస్థానం సూచించిన అంశాలను ప్రభుత్వం గౌరవిస్తూ, చట్టబద్ధమైన విధానాలతో ప్రజా ఆస్తుల పరిరక్షణను మరింత బలంగా కొనసాగించాల్సిన అవసరం ఉంది.





హైదరాబాద్ ఒకప్పుడు చెరువుల నగరం. ప్రపంచ వ్యాప్తంగా "సిటీ ఆఫ్ లేక్స్ అండ్ రాక్స్"గా గుర్తింపు పొందిన ఈ నగరం సహజ సంపదతో కళకళలాడేది. ప్రతి చెరువు ఒక జీవనాధారం. ప్రతి నాలా ఒక సహజ డ్రైనేజీ వ్యవస్థ. ప్రతి ప్రభుత్వ భూమి భవిష్యత్ తరాల ఆస్తి. కానీ అభివృద్ధి పేరుతో దశాబ్దాలుగా జరిగిన నిర్లక్ష్యం ఈ నగర సహజ స్వరూపాన్ని దెబ్బతీసింది. చెరువులు పూడ్చబడ్డాయి. వాగులు మాయమయ్యాయి. నాలాలపై భవనాలు వెలిశాయి. ప్రభుత్వ భూములు కబ్జాలకు గురయ్యాయి. కోట్ల రూపాయల విలువైన ప్రజా ఆస్తులు కొద్దిమంది చేతుల్లోకి వెళ్లిపోయాయి. ఈ రోజు హైదరాబాద్ ఎదుర్కొంటున్న ముంపు సమస్యలకు, ట్రాఫిక్ సమస్యలకు, పర్యావరణ అసమతుల్యతకు ఇవే ప్రధాన కారణాలుగా నిపుణులు చాలాకాలంగా హెచ్చరిస్తున్నారు. 2020లో హైదరాబాద్‌ను అతలాకుతలం చేసిన వరదలు ఒక ప్రకృతి విపత్తు మాత్రమే కాదు... మన నిర్లక్ష్యానికి ప్రకృతి ఇచ్చిన హెచ్చరిక. నీరు వెళ్లే దారులను మనమే మూసివేస్తే, వర్షం వచ్చినప్పుడు నీరు తన దారిని తానే వెతుక్కుంటుంది. అది రోడ్లపైకి వస్తుంది. కాలనీల్లోకి చేరుతుంది. ఇళ్లను ముంచేస్తుంది. చివరకు ప్రాణనష్టానికి కూడా కారణమవుతుంది. ఇలాంటి పరిస్థితులు మళ్లీ రాకూడదనే ఉద్దేశంతో తెలంగాణ ప్రభుత్వం హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీ (హైడ్రా)ను ఏర్పాటు చేసింది. పేరులోనే లక్ష్యం కనిపిస్తోంది. విపత్తులను సమర్థంగా ఎదుర్కోవడం... ప్రభుత్వ ఆస్తులను కాపాడడం. ఈ రెండు బాధ్యతలను ఒకే వేదికపైకి తీసుకురావాలన్న ఆలోచనతో హైడ్రా ఏర్పడింది. హైడ్రా కేవలం అక్రమ నిర్మాణాలు కూల్చే సంస్థ కాదు. దాని వెనుక ఒక పెద్ద ఆలోచన ఉంది. ప్రభుత్వ భూములను రక్షించడం. చెరువులను కాపాడటం. నాలాలను పునరుద్ధరించడం. ప్రజా అవసరాలకు ఉపయోగపడాల్సిన భూములను తిరిగి ప్రజలకే అందించడం. భవిష్యత్ తరాలకు సురక్షితమైన నగరాన్ని అందించడం. ప్రభుత్వ భూమి అంటే ప్రభుత్వ అధికారుల ఆస్తి కాదు. అది ప్రజల ఆస్తి. అక్కడ రేపు ఒక ప్రభుత్వ పాఠశాల రావచ్చు. ఒక ఆసుపత్రి రావచ్చు. ఒక పార్కు రావచ్చు. ఒక రహదారి నిర్మించవచ్చు. అందుకే ప్రభుత్వ భూములను కాపాడటం అంటే ప్రజల హక్కులను కాపాడటమే. హైడ్రా చర్యల్లో మరో ముఖ్యమైన అంశం చెరువుల పరిరక్షణ. చెరువు అనేది కేవలం నీటి నిల్వ కేంద్రం కాదు. అది ప్రకృతి నిర్మించిన వరద నియంత్రణ వ్యవస్థ. భూగర్భ జలాలను నింపే జీవనాడి. పర్యావరణ సమతుల్యతకు ఆధారం. అలాంటి చెరువులను ఆక్రమిస్తే నష్టపోయేది ప్రకృతి మాత్రమే కాదు... మొత్తం నగరం. అలాగే నాలాలు. వర్షపు నీరు వెళ్లే సహజ మార్గాలను మూసేస్తే, వరదలను ఎవరూ అడ్డుకోలేరు. అందుకే నాలాల పునరుద్ధరణ అనేది అభివృద్ధికి వ్యతిరేకం కాదు. అది నగర రక్షణకు అవసరమైన చర్య. హైడ్రా బాధ్యతలను నిర్వహించే క్రమంలో సీనియర్ ఐపీఎస్ అధికారి ఏవీ రంగనాథ్ పేరు ప్రజల్లో విస్తృతంగా చర్చకు వచ్చింది. ఆయన మంచి పేరున్న ఆఫీసర్. కింది స్థాయిలో ఉండే సిబ్బంది చేసిన చిన్న చిన్న సాంకేతిక కారణాల వల్ల ఇదంతా జరిగిందని కనిపిస్తోంది. పోలీసు శాఖలో ఆయనకు క్రమశిక్షణ, నిజాయితీ, చట్టం పట్ల నిబద్ధత కలిగిన అధికారిగా గుర్తింపు ఉంది. హైడ్రా ద్వారా ప్రజా ఆస్తుల పరిరక్షణలో ఆయన చూపిన చొరవను ప్రభుత్వం పలుమార్లు ప్రశంసించింది. ఇక్కడ వ్యక్తులు ముఖ్యం కాదు... వ్యవస్థ ముఖ్యం. ఒక అధికారి వస్తారు. మరొక అధికారి వెళ్తారు. ప్రభుత్వాలు మారుతాయి. పదవులు మారుతాయి. కానీ ప్రభుత్వ భూములు మాత్రం ప్రజలవే. చెరువులు ప్రజలవే. నాలాలు ప్రజలవే. వాటిని కాపాడాల్సిన బాధ్యత కూడా ఎప్పటికీ మారదు.

హైడ్రాపై రాజకీయాలు చేయడం సులభం. కానీ ఒక్కసారి మన మనసును మనమే ప్రశ్నించుకోవాలి. చెరువులు ఆక్రమించబడకూడదా? ప్రభుత్వ భూములు కబ్జా కాకూడదా? నాలాలపై అక్రమ నిర్మాణాలు కొనసాగాలా? ప్రతి వర్షానికి హైదరాబాద్ మళ్లీ మునిగిపోవాలా? ఈ ప్రశ్నలకు సమాధానం "కాదు" అయితే, ప్రజా ఆస్తుల పరిరక్షణ కోసం ఒక బలమైన వ్యవస్థ తప్పనిసరిగా ఉండాలి. అయితే అదే సమయంలో ఆ వ్యవస్థ చట్టబద్ధంగా, పారదర్శకంగా, ప్రజల హక్కులను గౌరవిస్తూ పనిచేయాలి. ఇదే ప్రజాస్వామ్య స్ఫూర్తి. ఇదే రాజ్యాంగం చెప్పే మార్గం. ప్రభుత్వం కూడా ఈ సూత్రాన్నే అనుసరిస్తూ హైడ్రాను మరింత పటిష్ఠంగా తీర్చిదిద్దాలి. హైదరాబాద్‌ను కాపాడాలంటే చెరువులను కాపాడాలి. చెరువులను కాపాడాలంటే ఆక్రమణలను అడ్డుకోవాలి. ప్రభుత్వ భూములను రక్షించాలి. నాలాలను స్వేచ్ఛగా ప్రవహించేలా చేయాలి. ఇదే హైడ్రా వెనుక ఉన్న అసలు ఆలోచన. చట్టపరమైన సవాళ్లు వస్తాయి. కోర్టులు తమ మార్గదర్శకాలు ఇస్తాయి. ప్రభుత్వం వాటిని పాటిస్తూ అవసరమైన మార్పులు చేసుకోవచ్చు. కానీ ప్రజా ఆస్తుల పరిరక్షణ అనే లక్ష్యం మాత్రం ఎప్పటికీ బలహీనపడకూడదు. ఎందుకంటే... ఒక చెరువును కాపాడటం అంటే ఒక నగరాన్ని కాపాడటమే. ఒక ప్రభుత్వ భూమిని రక్షించడం అంటే రేపటి తరాల హక్కులను రక్షించడమే. హైడ్రా కొనసాగాలి... చట్టబద్ధంగా, పారదర్శకంగా, మరింత సమర్థంగా కొనసాగాలి. అదే హైదరాబాద్ భవిష్యత్తుకు నిజమైన రక్షణ కవచం.



సత్తు మల్లేష్,
కరీంనగర్ గ్రంథాలయ కమిటీ చైర్మన్

# బాలికల పాఠశాల అభివృద్ధికి బాబు నాయక్ చేయూత

- మెయిన్ గేటు నిర్మాణానికి శంకుస్థాపన
- పాత భవనం తొలగింపు, ఫ్లోరింగ్, 200 మొక్కల నాటేందుకు హామీ

**శంకర్‌పల్లి, వెలుతురు జులై 28 :**




శంకర్‌పల్లి మున్సిపల్ కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల అభివృద్ధికి మోకిలా తండా సర్పంచ్ వి. శాంతమ్మ కుమారుడు, యువ నాయకుడు బాబు నాయక్ ముందుకొచ్చారు. మంగళవారం పాఠశాలను సందర్శించిన ఆయన ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులతో కలిసి పాఠశాల ఆవరణను పరిశీలించి, విద్యార్థినులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు.ఈ సందర్భంగా పాఠశాలకు ప్రధాన ప్రవేశ ద్వారం (మెయిన్ గేటు) లేకపోవడంతో కుక్కలు, పందులు పాఠశాల ఆవరణలోకి వస్తుండటంతో భయాందోళనలకు గురవుతున్నామని, పరిశుభ్రత సమస్యలు ఎదురవుతున్నాయని విద్యార్థినులు బాబు నాయక్ దృష్టికి తీసుకువచ్చారు. విద్యార్థినుల సమస్యలను విన్న ఆయన వెంటనే స్పందించి, తన స్వంత ఖర్చుతో నూతన మెయిన్ గేటు నిర్మించాలని నిర్ణయించి పనులకు శంకుస్థాపన చేశారు.అంతేకాకుండా పాఠశాల అభివృద్ధి కోసం పాత భవనాన్ని తొలగించడం, తరగతి గదుల్లో ఫ్లోరింగ్ పనులు చేపట్టడం, పాఠశాల ఆవరణలో 200 మొక్కలు నాటించడం, అవసరమైన మరమ్మతులు నిర్వహించడం వంటి పలు అభివృద్ధి కార్యక్రమాలను త్వరలోనే పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు.ఈ సందర్భంగా బాబు నాయక్ మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణం కల్పించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. విద్యార్థినుల సమస్యలు విన్న తర్వాత తన హృదయం చలించిపోయిందని పేర్కొన్నారు. బాలికల భద్రత, పరిశుభ్రమైన వాతావరణం, మెరుగైన మౌలిక సదుపాయాల కల్పనకు తన వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని తెలిపారు. విద్యార్థినులు కష్టపడి చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలని, తమ తల్లిదండ్రులకు, గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.పాఠశాల ప్రిన్సిపాల్ మాట్లాడుతూ, సమాజంలో ఎంతో మంది ఉన్నప్పటికీ ప్రభుత్వ పాఠశాల అభివృద్ధికి స్వచ్ఛందంగా ముందుకు వచ్చి సేవాభావంతో సహకరించడం అభినందనీయమని అన్నారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని బాబు నాయక్ చేపడుతున్న కార్యక్రమాలు ఆదర్శప్రాయమని కొనియాడారు. పాఠశాల తరఫున ఆయనకు హృదయ పూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తూ, ఆయురారోగ్యాలతో ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.

# భవన నిర్మాణ కార్మికులకు ఈ శ్రమ్ కార్డుల పంపిణీ

- కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రతి కార్మికుడు వినియోగించుకోవాలి: జనసేన నేత ముమ్మారెడ్డి ప్రేమ కుమార్

**కూకట్ పల్లి, జూలై 28 వెలుతురు:**



భవన నిర్మాణ కార్మికులు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకుని ఆర్థిక భద్రతను పొందాలని కూకట్ పల్లి నియోజకవర్గం జనసేన పార్టీ కంటెస్ట్ ఎమ్మెల్యే, పార్టీ జాయినింగ్ కమిటీ సభ్యులు ముమ్మారెడ్డి ప్రేమ కుమార్ అన్నారు. ఏ.వి.బి.పురంలో గత రెండు వారాలుగా జనసేన పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక నమోదు కార్యక్రమంలో లేబర్ కార్డులు, ఈ-శ్రమ్ కార్డులకు నమోదు చేసుకున్న భవన నిర్మాణ కార్మికులు, ఇతర కార్మికులకు ప్రేమ కుమార్ చేతుల మీదుగా ఈ-శ్రమ్ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్మికుల సంక్షేమం కోసం అమలు చేస్తున్న పథకాలు కార్మిక కుటుంబాలకు ఆర్థిక రక్షణ కల్పిస్తాయని పేర్కొన్నారు. ప్రతి అర్హత కలిగిన కార్మికుడు ఈ-శ్రమ్ కార్డు పొందాలని, కార్మికుల సంక్షేమం కోసం జనసేన పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ జనసేన నాయకులు కొల్లా శంకర్, వేముల మహేష్, ఏ.వి.బి.పురం జనసైనికులు టి. ప్రసాద్ రావు, వై. దనుజయ్, బి. రాము, జి. దుర్యోదన, డి. కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యలు పరిష్కరించే వరకు ప్రశ్నిస్తూనే ఉంటాం

- బీఆర్ఎస్ నాయకుల హెచ్చరిక

**శంకర్‌పల్లి, వెలుతురు జులై 28:**




ప్రజా సమస్యలను లేవనెత్తడం ప్రజాస్వామ్యంలో ప్రతి ఒక్కరి హక్కు అని, ప్రజల తరఫున ప్రశ్నించడం తమ బాధ్యతేనని బీఆర్ఎస్ నాయకులు స్పష్టం చేశారు.ఇటీవల స్థానిక రహదారుల దుస్థితిపై నిర్వహించిన కార్యక్రమాన్ని కొందరు రాజకీయ నాయకులు వ్యక్తిగత అంశాలతో ముడిపెట్టి వ్యాఖ్యానించడం సరికాదన్నారు. తాము ఎవరిపైనా వ్యక్తిగత విమర్శలు చేయలేదని, కేవలం ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను మాత్రమే ప్రస్తావించామని తెలిపారు.ఎమ్మెల్యేను గౌరవంగానే సంబోధిస్తూ, ప్రజా సమస్యలు వారి దృష్టికి వెళ్లాలనే ఉద్దేశంతోనే ప్రశ్నించామని పేర్కొన్నారు. ప్రజల ఓట్లతో ఎన్నికైన ప్రజాప్రతినిధులను ప్రజా సమస్యలపై నిలదీయడం ప్రజాస్వామ్య హక్కు అని, దానికి స్థాయిలు, హోదాలు అడ్డుకావని అన్నారు.గత ప్రభుత్వ హయాంలో జరిగిన అభివృద్ధిని ప్రత్యర్థి నాయకులే అంగీకరిస్తున్నారని, అందుకు సంతోషం వ్యక్తం చేశారు. ప్రస్తుతం అధికారంలో ఉన్న ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ముఖ్యంగా మహిళలకు ప్రకటించిన ఆర్థిక సహాయం, పెన్షన్ల పెంపు, రైతులకు ఇచ్చిన హామీలు, కళ్యాణలక్ష్మి , తులం బంగారం వంటి సంక్షేమ పథకాల అమలుపై స్పష్టత ఇవ్వాలని కోరారు.శంకర్‌పల్లి ప్రాంతంలో రహదారుల దుస్థితి, గుంతలు, ఇతర మౌలిక సదుపాయాల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ప్రజల ప్రాణాలకు ప్రమాదం కలిగించే పరిస్థితులను నిర్లక్ష్యం చేయడం సరికాదన్నారు.ప్రజల సమస్యలు పరిష్కరించే వరకు ప్రతి వేదికపై ప్రశ్నిస్తూనే ఉంటామని, అవసరమైతే సంబంధిత అధికారులను, ప్రజాప్రతినిధులను ప్రజాస్వామ్య పద్ధతుల్లో నిలదీస్తామని హెచ్చరించారు. వ్యక్తిగత విమర్శలు తమ లక్ష్యం కాదని, ప్రజా ప్రయోజనాలే తమ ప్రధాన అజెండా అని స్పష్టం చేశారు."ప్రజల సమస్యలు పరిష్కరించే వరకు మా పోరాటం ఆగదు. ప్రజాస్వామ్యంలో ప్రశ్నించడం మా హక్కు, ప్రజలకు సేవ చేయడం పాలకుల బాధ్యత" అని వారు పేర్కొన్నారు.

# ఆరుట్ల గ్రామంలో ఎస్ఐఆర్ ఓటర్ సవరణ ప్రక్రియను పరిశీలించిన బీజేపీ పార్టీ బృందం

- అర్హులైన ప్రతి ఒక్కరు ఓటు కోల్పోకుండా బిఎల్ఓ అధికారులు చర్యలు తీసుకోవాలి
- ముంచాల మండలం బిజెపి పార్టీ మండల అధ్యక్షుడు నూకం రాజు ముదిరాజ్



**మంచాల వెలుతురు జులై 28:**

మంచాల మండలం ఆరుట్ల గ్రామం గ్రామ పంచాయతీ కార్యాలయంలో జరుగుతున్న ఎస్ఐ ఆ ర్ ఓటర్ సవరణ ప్రక్రియను మంచాల మండలం బీజేపీ పార్టీ అధ్యక్షుడు నూకంరాజు ముదిరా జ్ ఆధ్వర్యంలో బిజెపి నాయకులతో కలిసి పరిశీలించారు ఈసందర్భంగా మాట్లాడుతూ ఎస్ ఐఆర్ ఓటర్ నమోదు సవరణ ప్రక్రియ సమయం దగ్గర పడుతుందికాబట్టి గ్రామాల్లోని బిజెపి పార్టీ నాయకులు కార్యకర్తలు చొరవ తీసుకొని అర్హులైన ఓట్లు ఏఒక్కరివి తొలగిపోకుండా కృషి చేయాలి అనిఅన్నారు బీఎల్ఓ అధికారులు ప్రజలు ఇచ్చే ఎస్ఐఆర్ ఫారం క్షుణ్ణంగా పరిశీలిం చి తప్పులు లేకుండా సరిచేసి అర్హులైన వారి ఓట్లు తొలగిపోకుండా చర్యలు తీసుకొని ఓటర్ సవరణ ప్రక్రియ వేగవంతం చేయాలి అనిఅన్నారు ఈకార్యక్రమంలో మంచాల సహకారసంఘం డైరెక్టర్ కొంగర జనార్ధన్ రెడ్డి బిజెపి పార్టీ నాయకులు మెండు వెంకట్ రెడ్డి దండు భగవంత్ రెడ్డి బి ఎల్ ఓ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# వర్షపు నీటిని భూమిలోకి పంపి భూగర్భ జలాలు పెంచాలి

**జిల్లా పంచాయతీ రాజ్ ఇంజనీర్ చంద్ర శేఖర్**

**శంకర్పల్లి, జులై 28 :**




శంకర్పల్లి మండల పరిషత్ కార్యాలయాన్ని గౌరవ జిల్లా పంచాయతీ రాజ్ ఇంజనీర్ (ఈఈ) చంద్రశేఖర్ సందర్శించారు. ఈ సందర్భంగా మండలంలోని పంచాయతీ కార్యదర్శులు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లతో ఆయన ఒక ప్రత్యేక సమీక్షా సమావేశాన్ని ఏర్పాటు చేశారు.ఈ సమావేశంలో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'జలసిరి' కార్యక్రమ ప్రగతిపై ఆయన సుదీర్ఘంగా చర్చించారు. వర్షపు నీటిని వృధా పోనివ్వకుండా ప్రతి చుక్కనూ భూమిలోకి పంపేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. తద్వారా భూగర్భ జలమట్టాన్ని గణనీయంగా పెంచవచ్చని ఆయన సూచించారు. ఈ సందర్భంగా క్షేత్రస్థాయి సిబ్బందికి పలు సాంకేతిక సలహాలను, సూచనలను అందజేశారు.అదేవిధంగా గ్రామీణ ప్రాంతాల్లోని కూలీలకు ఉపాధి హామీ పథకం ద్వారా పెద్ద ఎత్తున పని కల్పించాలని అధికారులను కోరారు. నిర్దేశిత లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలని స్పష్టం చేశారు.ఈ సమీక్షా కార్యక్రమంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపీడీవో) వి. ప్రవీణ్ కుమార్, డీఈ, మండల పరిషత్ అధికారి (ఎంపీవో) గిరిరాజ్, అసిస్టెంట్ ఇంజనీర్ (ఏఈ) నందకిషోర్, సహాయ ప్రోగ్రాం అధికారి (ఏపీఓ) నాగభూషణం, ఇంజనీరింగ్ కన్సల్టెంట్ (ఈసీ) జనార్దన్ రెడ్డి, టెక్నికల్ అసిస్టెంట్లు, వివిధ గ్రామాల పంచాయతీ కార్యదర్శులు మరియు ఫీల్డ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ఆర్ఐ ప్రక్రియను 100 శాతం పూర్తి చేయాలి

- మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బొల్లారం వెంకట్ రెడ్డి, మునిసిపల్ కాంగ్రెస్ ప్రెసిడెంట్ మడపతి చంద్రమౌళి

**శంకర్‌పల్లి, వెలుతురు జులై 28:**



శంకర్‌పల్లిలోని మణి గార్డెన్‌లో మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షుడు మడపతి చంద్రమౌళి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బొల్లారం వెంకట్ రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ బీఎల్ఏలు, ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులతో ఎస్ఐఆర్ ఎస్ ఆర్ ఐ ప్రక్రియపై సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, ప్రతి బూత్‌లో ఎస్ఐఆర్ ప్రక్రియను 100 శాతం పూర్తి చేసేలా బీఎల్ఏలు, పార్టీ నాయకులు సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. ఓటరు నమోదు, సవరణ ప్రక్రియలో ఎలాంటి లోపాలు లేకుండా ప్రతి అర్హుడి వివరాలు నమోదు అయ్యేలా ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.ఈ సమావేశంలో మొయినాబాద్ మాజీ జడ్పీటీసీ కాలే శ్రీకాంత్, శంకర్‌పల్లి మున్సిపల్ చైర్మన్ సాత ప్రవీణ్ కుమార్, డీసీసీ ఉపాధ్యక్షుడు చేకూర్తి గోపాల్ రెడ్డి, కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి కలిసిన టీజీఎస్పీ 3 వ బెటాలియన్ అధికారులు

- ఆగస్టు 3న అప్రోచ్ రోడ్డుతో పాటు స్పోర్ట్స్ మీట్ ప్రారంభోత్సవాలకు ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి కు ఆహ్వానం

**ఇబ్రహీంపట్నం వెలుతురు జులై 28:**



ఇబ్రహీంపట్నం నియోజకవర్గం తొర్రూర్ ఎమ్మెల్యేక్యాంప్ కార్యాలయంలోతెలంగాణస్పెషల్ పోలీ స్ మూడో బెటాలియన్ అధికారులు సిబ్బంది ఇబ్రహీంపట్నం శాసన సభ్యులు మల్ రెడ్డి రంగారె డ్డి గారిని కలిశారు బెటాలియన్ కమాండెంట్ సయ్యద్ జమీల్ బాష అసిస్టెంట్ కమాండెంట్లు ఎం వీరయ్య పాండులు వివిధ కార్యక్రమాల ప్రారంభో త్సవాల కోసం ఆగస్టు 3న బెటాలియనకు రావాలని వారు ఆహ్వానించారు నాగన్ పల్లి రోడ్డు నుంచి బెటాలియన్ గేటు వరకు హెచ్ఎండీ ఏ నిధులతో ఎమ్మెల్యే ప్రత్యేక చొరవతో నిర్మించిన అప్రోచ్ రోడ్డు పూర్తికాగా ఈమేరకువారు తొ ర్రూర్ లోని క్యాంపు కార్యాలయంలో మల్ రెడ్డి రంగారెడ్డి గారిని కలిసి తమసంతోషం వ్యక్తంచేసి ప్రత్యేకకృతజ్ఞతలు తెలిపారు ఇందులో భాగంగానే 3వ తేదీన అప్రోచ్ రోడ్డు ప్రారంభోత్సవానికి రావాలని ఎమ్మెల్యేను కోరారు అలాగే అదే రోజు నుంచి ఇంట ర్నల్ బెటాలియన్ స్పోర్ట్స్ మీట్ జర గనున్నందున ఎమ్మెల్యే చేతు ల మీదుగా ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు ఈ సందర్భంగా హెచ్ఆర్ఏ ఫైల్ అంశాన్ని వారు ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు గత డిసెంబర్ లో గ్రే టర్ హైదరాబాద్ పరిధి విస్తరణ నేపథ్యంలో పెరిఫరీ 8 కిలోమీటర్లలోపు తమ బెటాలియన్ ఉ న్నందున కలెక్టర్ గారి వద్ద ఉన్న ఇంటి అద్దె పెంపు ఫైల్ ను త్వరగా నోటిఫై చేయించాల్సిందిగా కోరారు వెంటనే స్పందించిన మల్ రెడ్డి ఫోన్లో కలెక్ట ర్ తో చర్చించారు ఎమ్మెల్యే చొరవ పట్ల బె టాలియన్ అధికారులు సిబ్బంది కృతజ్ఞతలు తెలిపారు మల్ రెడ్డిని కలిసిన వారిలో రిజర్వ్ ఇ న్ స్పెక్టర్లు రవీందర్ యుగేందర్ శేఖర్ యూనిట్ వైద్యాధికారి రవి ఇతర సిబ్బంది పాల్గొన్నారు .



# వెంకటేశ్వర ఎన్‌క్లేవ్‌లో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శ్రీకారం




**కుత్బుల్లాపూర్ (వెలుతురు ప్రతినిధి) జూలై 28:**

జీడిమెట్ల 132వ డివిజన్ పరిధిలోని వెంకటేశ్వర ఎన్‌క్లేవ్ కాలనీలో చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు నేడు శ్రీకారం చుట్టారు. ఈ పనులు కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే శ్రీ కె.పీ. వివేకానంద్ గౌడ్ ప్రత్యేక చొరవ, నిరంతర కృషి ఫలితంగా ప్రారంభం కావడం పట్ల స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.సుచిత్ర మెయిన్ రోడ్డులోని మహేష్ బ్యాంక్ నుంచి ప్లాట్ నెం.81 వరకు, అలాగే కాలనీ పార్క్ రోడ్ నుంచి ఉషా రెసిడెన్సీ మీదుగా సెయింట్ అల్ఫోన్సా హైస్కూల్ వరకు 35 లక్ష ల సీసీ రోడ్డు నిర్మాణ పనులు చేపట్టబడ్డాయి ఈ పనులు పూర్తయిన అనంతరం కాలనీవాసులకు మెరుగైన రవాణా సౌకర్యం అందుబాటులోకి రానుంది.ఈ అభివృద్ధి కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు వీరారెడ్డి నరేందర్ రెడ్డి, స్థానిక బీఆర్ఎస్ నాయకులు ఎల్లా గౌడ్, సీనియర్ నాయకులు, కాలనీ పెద్దలు, స్థానిక ప్రజలు పాల్గొని పనులను ప్రారంభించారు ఈ సందర్భంగా బీఆర్ఎస్ సీనియర్ నాయకులు వీరారెడ్డి నరేందర్ రెడ్డి మాట్లాడుతూ, వెంకటేశ్వర ఎన్‌క్లేవ్ కాలనీ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్న కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కె.పీ. వివేకానంద్ గౌడ్ కి హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. అలాగే సీసీ రోడ్డు నిర్మాణ పనులను అత్యున్నత నాణ్యతతో, నిర్ణీత గడువులో పూర్తి చేసి ప్రజలకు త్వరితగతిన అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత కాంట్రాక్టర్‌ను కోరారు.

# ప్రభుత్వ పాఠశాలల్లో సమస్యలను పరిష్కరించాలి:సిపిఎం

**మోత్కూర్, జులై 28,వెలుతురు న్యూస్ :**




ప్రభుత్వ పాఠశాలల్లో సమస్యలను పరిష్కరిచడంతో పాటు, విద్యార్థులకు యూనిఫాం వెంటనే అందించాలని సిపిఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యులు బొల్లు యాదగిరి, ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం రోజున పార్టీ పిలుపు మేరకు మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని, మండల విద్యాధికారి (meo) కార్యాలయం ముందు నిరసన చేసి, వివిధ సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని ఎం ఐ ఎస్ కోఆర్డినేటర్ ఉమారాణి, మోహనాచారి గార్లకు ఇవ్వడం జరిగింది. అనంతరం వారు మాట్లాడుతూ పాఠశాలలు ప్రారంభమై నెల దాటిన ఇప్పటికి విద్యార్థులకు యూనిఫామ్ అందించ లేదని, ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయ ఖాళీలు భర్తీ చేయకపోవడం వల్ల విద్యార్థుల భవిష్యత్తు ప్రమాదంలో పడుతుందని అన్నారు. పాఠశాలల్లో తరగతిగదులు, మరుగుదొడ్లు, త్రాగునీరు, విద్యుత్, ఫర్నిచర్, గ్రంథాలయాలు, సైన్స్ కఫ్యూటర్ ల్యాబ్ వంటి కనీస సౌకర్యాలు కూడ లేవని పేర్కొన్నారు. విద్యార్థులకు అవసరమైన పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్స్, యూనిఫామ్ విద్యా సంవత్సరం ప్రారంభంలోనే అందించాలని, పేద విద్యార్థులకు ఉచ్చిత కోచింగ్ సదుపాయం కల్పించాలని కోరారు. మధ్యాహ్న భోజన పథకాన్ని మరింత నాణ్యతగా అమలు చేసి విద్యార్థులకు పోషకాహారం అందించాలని డిమాండ్ చేశారు. లేనిచో విద్యాశాఖను వేరే ఎవరైనా విద్యా వంతులకు అప్పచెప్పాలని కోరారు.ఒక వైపు ప్రభుత్వం విద్యారంగాన్ని బలోపేతం చేస్తామని చెపుతూనే మరోవైపు విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉందన్న పేరుతో ప్రభుత్వ పాఠశాలలను మూసివేసే ఆలోచన మానుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ మండల కార్యదర్శి గుండు వెంకటనర్సు, టౌన్ కార్యదర్శి రాచకొండ రాములమ్మ, రైతు సంఘం జిల్లా నాయకులు పైళ్ల యాదిరెడ్డి, టౌన్ కమిటీ సభ్యులు కందుకూరి నర్సింహా, పిట్టల చంద్రయ్య, గుండు లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

# కేంద్ర మాజీ మంత్రివర్యులు ఎస్ జైపాల్ రెడ్డి కి శృతి వనం ఘాట్లో నివాళులు అర్పించిన రాష్ట్ర దివ్యాంగుల కమిటీ

**రామన్నపేట వెలుతురు న్యూస్ జూలై 28:**




భారతదేశంలో అత్యున్నత స్థానంలో సేవలందించి ఉత్తమ పార్లమెంటేరియన్ గా గుర్తింపు పొంది కేంద్రంలో మంత్రి పదవులకు వన్నె తెచ్చి కోట్ల మంది హృదయాలలో నిలిచిన మహనీయుడు జైపాల్ రెడ్డిని భారతదేశ సమాజమంతా వారు చేసిన సేవను గుర్తుపెట్టుకున్నదని. అంగవైకల్యం శరీరానికే కానీ జ్ఞానానికి కాదని నిరూపించి మహనీయుడు నిస్వార్థ తో చరిత్రలో నిలిచిన మహనీయునిగా రాజకీయాల్లో గుర్తింపు తెచ్చారని డాక్టర్ ఎన్. అశోక్ గుర్తు చేసుకున్నారు. ఏడవ వర్ధంతి సందర్భంగా శృతి వనంలో ఘాటులో రాష్ట్ర దివ్యాంగుల సంఘాలు నివాళులు అర్పించాయి. డాక్టర్ అశోక్ మాట్లాడుతూ జైపాల్ రెడ్డి బాటలో దివ్యాంగులందరూ రాజకీయాలలో చైతన్యమై వారి బాటలో నడిచి హక్కులను ఆత్మ గౌరవాన్ని సాధించుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో దివ్యాంగుల ఫోరం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మారవేణి చంద్రశేఖర్ యాదవ్. మహిళ సాధికారిక రాష్ట్ర అధ్యక్షురాలు కోళ్ల రాజ్యలక్ష్మి.విశ్వవిద్యాలయాల దివ్యాంగుల పురం రాష్ట్ర అధ్యక్షురాలు ధోరపల్లి దానమ్మ. విశ్వ విద్యాలయాల ఫోరం సహాయ కార్యదర్శి మోదల సైదులు యాదవ్. మహిళా సాధికారిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి .పి. స్వప్న తదితరులు పాల్గొన్నారు.

# ఓటరు నమోదు ప్రక్రియను పరిశీలించిన బీజేపీ జిల్లా అధ్యక్షుడు, పట్టణ అధ్యక్షురాలు

**చౌటుప్పల్, వెలుతురు జూలై 28:**



భారతీయ జనతా పార్టీ చౌటుప్పల్ మున్సిపల్ అధ్యక్షురాలు కడారి కల్పన ఐలయ్య యాదవ్ ఆధ్వర్యంలో మంగళవారం ఎస్ఐఆర్ ఓటరు నమోదు ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా చౌటుప్పల్ మున్సిపల్ పరిధిలోని 19వ వార్డు, 39వ బూత్‌కు సంబంధించిన స్థానిక బీఎల్‌వో బుచ్చి రాములను నల్లగొండ జిల్లా బీజేపీ అధ్యక్షుడు డాక్టర్ నాగం వర్షిత్ రెడ్డి కలిసి ఓటరు నమోదు ప్రక్రియ గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా డాక్టర్ నాగం వర్షిత్ రెడ్డి మాట్లాడుతూ, నిజమైన ఓటర్లను గుర్తిస్తూ నిబంధనల ప్రకారం ఓటరు నమోదు ప్రక్రియను కొనసాగించాలని సూచించారు. స్థానికంగా నివసించని వారి పేర్లు, అలాగే రోహింగ్యాలకు సంబంధించిన వివరాలను నిబంధనల మేరకు పరిశీలించి, తమకు అప్పగించిన బాధ్యతలను నిజాయితీగా, నిబద్ధతతో నిర్వర్తించాలని బీఎల్‌వోకు సూచించారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధ్యక్షురాలు కడారి కల్పన ఐలయ్య యాదవ్, జిల్లా కమిటీ మాజీ ఉపాధ్యక్షుడు రమణ గోని శంకరయ్య, ఫ్లోర్ లీడర్ బుద్ధ సురేష్, సీనియర్ నాయకులు గుజ్జుల సురేందర్ రెడ్డి, కంచర్ల గోవర్ధన్ రెడ్డి, మున్సిపల్ ఇంచార్జ్ అనపర్తి యాదగిరి, ఆలే చిరంజీవి, పోలపల్లి ముత్తయ్య, కడవేరు పాండు, ధర్మోజిగూడెం ఉపసర్పంచ్ ఫకీర్ శ్రీనివాస్ రెడ్డి, మున్సిపల్ ఉపాధ్యక్షుడు గుండెబోయిన వేణు, బీఎల్ఏ-2 మారగోని గణేష్, అన్నమోని రాజేష్, బూత్ అధ్యక్షులు పాశం భరత్, దండం సత్తిరెడ్డి, ఇటికాల దామోదర్ రెడ్డి, గుండపల్లి వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికల్లో గెలుపొందిన చేనేత సహకార సంఘ సభ్యులకు సత్కారం

**మోత్కూర్, జులై 28,వెలుతురు న్యూస్ :**



మోత్కూర్ చేనేత సహకార సంఘం ఎన్నికల్లో గెలుపొందిన సభ్యులకు బి. ఆర్. ఎస్. పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా పట్టణ అధ్యక్షులు జంగ శ్రీను మాట్లాడుతు కొత్తగా గెలిచిన సభ్యులు క్రితం సభ్యులకంటే ఇంకా బాగా పని చేసి బాగా పేరు తెచ్చుకోవాలని కోరారు. ఎన్నికల్లో గెలుపొందిన సంఘ ఉపాధ్యక్షురాలు మంచే పద్మ గోవర్ధన్,కార్యదర్శి మహేశ్వరం మధుసూదన్ మరియు డైరెక్టర్స్ ఎలగందుల సుజాత,పెండెం రాజారాం,జోగు మచ్చ గిరి, జల్ది రవి గార్లను శాలువతో ఘనంగా సత్కరించారు.ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు పోన్నెబోయిన రమేష్, పట్టణ పార్టీ అధ్యక్షులు జంగ శ్రీను, మాజీ మార్కెట్ చైర్మన్లు కొణతం యాకుబ్ రెడ్డి, చిప్పలపల్లి మహేంద్రనాథ్, మున్సిపల్ ప్రధాన కార్యదర్శి గజ్జి మల్లేష్,సీనియర్ నాయకులు మర్రి అనిల్ కుమార్, దాసరి తిరుమలేష్, కూరెళ్ల పరమేష్, దబ్బెటి శైలజ, మంచే గోవర్ధన్,బయ్యని పిచ్చయ్య, సామ పద్మా రెడ్డి, చేతరాశి వెంకన్న, అన్నందాస్ విద్యాసాగర్, కంచర్ల క్రాంతి కుమార్ రెడ్డి, మొరిగాల వెంకన్న, ఎలగందుల అమరేందర్, బందెల శ్రీను,మొరిగాల శీను, కొణతం మహేందర్ రెడ్డి,పోన్నె బోయిన మచ్చగిరి, చుక్క అశోక్ తదితరులు పాల్గొన్నారు.

# జలసిరి కార్యక్రమాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలి

- **డిఆర్డిఏ పీడీ సన్యాసయ్య**

**నూతనకల్ జూలై28 ( వెలుతురు )**



మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఎల్ నీనో ప్రభావంతో కరువు పరిస్థితులు వచ్చిన వేళ భూగర్భ జలాలను కాపాడడం కోసం జలసిరి కార్యక్రమాన్ని విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని, మండలం లోని అధికారులు,సర్పంచులకు జలసిరి కార్యక్రమంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా డిఆర్డిఏ పిడి సన్యాసయ్య హాజరై మాట్లాడారు. మంగళవారం ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అడుగంటి పోతున్న భూగర్భ జలాలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి పౌరునిపై ఉన్నదని, వి బి జి రామ్ జి పథకంలో ఇంకుడు కుంట,ఊట కుంట,పంట కుంటలు, బోర్ రీఛార్జ్ నిర్మాణాలు విస్తృతంగా చేపట్టి భూగర్భ జలాలను పెంచాలని వారు అన్నారు. ఏఎంసీ చైర్మన్ గిరిధర్ రెడ్డి మాట్లాడుతూ రైతులు ఎక్కువ నీటి వినియోగంతో పండే పంటలను తగ్గించి ఆరుతడి పంటలు వేసుకోవాలని సూచించారు ప్రభుత్వం అందిస్తున్న ఆరుతడి పంట విత్తనాలను సద్వినియోగించుకోవాలని వారు అన్నారు. గ్రామాలలో సర్పంచ్లు,పంచాయతీ కార్యదర్శులు భూగర్భ జలాలను పెంచే కార్యక్రమాల గురించి గ్రామ సభలు పెట్టి ప్రజలకు, రైతులకు అవగాహన కల్పించాలని మండల ప్రత్యేక అధికారి భారతి అన్నారు.ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ చైర్మన్ నాగం జయసుధ సుధాకర్ రెడ్డి, మండల ప్రత్యేక అధికారి ఎంఏ భారతి,ఎంపీడీవో సునీత, తహసిల్దార్ శ్రీనివాస రావు ఎంపీఓ హరిసింగ్ సర్పంచ్ లు వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# తిరుమల తిరుపతి వెంకటేశ్వర స్వామి సమక్షంలో గంగుల రాజిరెడ్డి జన్మదిన వేడుకలు

**రామన్నపేట వెలుతురు న్యూస్ జూలై 28:**



కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు ప్రభుత్వ విప్ నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం ప్రధాన అనుచరుడు రామన్నపేట మండల ప్రజల ఆశ కిరణం నమ్ముకున్న కార్యకర్తలకు చేదోడు, వాదోడుగా ఉండే నాయకుడు పల్లివాడ గ్రామ మాజీ సర్పంచ్ గంగుల వెంకట రాజిరెడ్డి జన్మదిన వేడుకలు తిరుమల తిరుపతి వెంకటేశ్వర స్వామి సమక్షంలో ఘనంగా జరిగినవి. తిరుమల తిరుపతి వెంకటేశ్వరుని ఆశీస్సులు రామన్నపేట మండల ప్రజలకు ఎల్లప్పుడూ ఉండాలని ఆయన కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు పున్న. జగన్మోహన్ మాజీ ఎంపీటీసీ తిమ్మాపురం మహేందర్ రెడ్డి వెంకట్ రెడ్డి శంబాల వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

# వెదిరె మేఘా రెడ్డికి ఎడ్యుకేషన్ ఎక్సలెన్స్ అవార్డు

**మునుగోడు,జూలై 28(వెలుతురు):**




విద్యా రంగంలో విశిష్ట సేవలకు గుర్తింపుగా వెదిరె ఫౌండేషన్ వ్యవస్థాపకుడు,చైర్మన్ వెదిరె మేఘా రెడ్డికి ప్రతిష్టాత్మక ఎడ్యుకేషన్ ఎక్సలెన్స్ అవార్డు–2026 లభించింది. న్యూఢిల్లీలోని ఇండియా హ్యాబిటాట్ సెంటర్లో నిర్వహించిన ఎడ్యుకేషన్ ఎక్సలెన్స్ కాన్ఫరెన్స్ అండ్ అవార్డ్స్–2026 కార్యక్రమంలో కేంద్ర విద్యాశాఖ సహాయ మంత్రి డా. సుకాంత మజుందార్ చేతుల మీదుగా ఆయన అవార్డును అందుకున్నారు.ఈ సందర్భంగా మేఘా రెడ్డి మాట్లాడుతూ.. ఈ అవార్డు తన వ్యక్తిగత విజయమే కాకుండా వెదిరె ఫౌండేషన్ విద్యా రంగంలో చేస్తున్న సేవలకు దక్కిన గుర్తింపని తెలిపారు.ఈ స్ఫూర్తితో విద్యాభివృద్ధి, సమాజ సేవ కోసం మరింత అంకితభావంతో పనిచేస్తానని చెప్పారు. తనను విశ్వసించి, ప్రోత్సహించిన ప్రతి ఒక్కరికీ ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

# సమన్వయంతో జలసిరి విజయవంతం చేయాలి






- **ఎంపీడీఓ పి. వెంకటేశ్వర్ రెడ్డి.**

**మునుగోడు, జూలై 28 (వెలుతురు):**

తెలంగాణ జలసిరి–వీబీజీ రామ్‌జీ కార్యక్రమాన్ని గ్రామస్థాయిలో సమర్థవంతంగా అమలు చేసి ఆశించిన ఫలితాలు సాధించాలంటే అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని మునుగోడు ఎంపీడీఓ పి. వెంకటేశ్వర్ రెడ్డి సూచించారు.మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో తెలంగాణ జలసిరి–వీబీజీ రామ్‌జీ కార్యక్రమంపై మండలస్థాయి ఓరియంటేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ కార్యక్రమం లక్ష్యాలు, అమలు విధానం, గ్రామాల్లో చేపట్టాల్సిన చర్యలపై సర్పంచులు, మండలస్థాయి అధికారులకు సమగ్ర అవగాహన కల్పించారు. గ్రామాల్లో నీటి వనరుల సంరక్షణ,అభివృద్ధితో పాటు వర్షపు నీటిని నిల్వ చేసే చర్యలకు ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు.జల వనరుల పరిరక్షణలో ప్రజల భాగస్వామ్యాన్ని పెంపొందించి,ప్రతి గ్రామంలో కార్యాచరణ ప్రణాళిక రూపొందించి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. గ్రామీణాభివృద్ధి,నీటి వనరుల సుస్థిర నిర్వహణలో తెలంగాణ జలసిరి కార్యక్రమం కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఎంపీఓ, ఏపీఓ, ఏపీఎం, మండల స్థాయి అధికారులు, అన్ని గ్రామాల సర్పంచులు, గ్రామ కార్యదర్శులు, వీఓఏలు, వీబీజీ రామ్‌జీ సిబ్బంది పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా గంగుల రాజన్న జన్మదినం వేడుకలు

- **రామన్నపేట మండల కేంద్రంలో ఘనంగా గంగుల రాజిరెడ్డి జన్మదిన వేడుకలు**

**రామన్నపేట వెలుతురు న్యూస్ జులై 28:**

నకిరేకల్ ఎమ్మెల్యే ప్రధాన అనుచరుడు కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు రామన్నపేట ముద్దుబిడ్డ యువ నాయకులు రామన్నపేట ఆశా కిరణం పల్లివాడ గ్రామ మాజీ సర్పంచ్ గంగుల వెంకట రాజిరెడ్డి జన్మదిన వేడుకలు రామన్నపేట కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో స్థానిక సుభాష్ సెంటర్ వద్ద పెద్ద ఎత్తున వివిధ గ్రామాల సర్పంచుల ఆధ్వర్యంలో పార్టీ వివిధ హోదాలో ఉన్న నాయకుల సమక్షంలో కార్యకర్తల సమక్షంలో ఘనంగా జరిగినవి. అనంతరం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ హాస్పిటల్ నందు పండ్ల పంపిణీ కార్యక్రమం చేయడం జరిగినది.




# పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

- **బీజేపీ మండల ప్రభారి చిన వెంకట నారాయణ రెడ్డి.**

**మునుగోడు,జూలై 28(వెలుతురు):**

భారతీయ జనతా పార్టీ కార్మిక విభాగం (లేబర్ సెల్) నల్లగొండ జిల్లా కో-కన్వీనర్‌గా నియమితులైన మాదగోని నరేందర్ గౌడ్‌ను బీజేపీ నాయకులు ఘనంగా సన్మానించారు. మునుగోడు మండల పార్టీ అధ్యక్షుడు పెంబళ్ల జానయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో కార్యవర్గ సభ్యుడు కంభంపాటి నర్సింహను కూడా సత్కరించారు.ఈ సందర్భంగా మండల పార్టీ ప్రభారి చిన వెంకట నారాయణ రెడ్డి మాట్లాడుతూ పార్టీ అప్పగించిన బాధ్యతలను సమర్థంగా నిర్వర్తిస్తూ సంస్థ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ప్రతి కార్యకర్త అంకిత భావంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. నూతన బాధ్యతలు చేపట్టిన మాదగోని నరేందర్ గౌడ్‌కు శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో బీజేపీ మండల ఉపాధ్యక్షుడు కర్నాటి శేఖర్, సీనియర్ నాయకులు నీరుడు రాజారాం, కర్నాటి లింగయ్య, మండల ప్రధాన కార్యదర్శి అక్కినపల్లి సతీష్, మల్లేష్, పోలే వెంకటేశ్వర్లు, రవి, దేశిడి వెంకన్న, వేముల శ్రీరంగం, నరేందర్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# డ్రగ్స్ కు నో చెప్పండి జీవితానికి ఎస్ చెప్పండి

- **రామన్నపేట లో పోలీసులు విస్తృత అవగాహన**
- **డ్రంక్ అండ్ డ్రైవ్ వాహనాలు తనిఖీలు**

**రామన్నపేట వెలుతురు న్యూస్ జూలై 28:**



మాదక దవ్యాలు నిర్మూలనకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని యువత డ్రగ్స్ కు దూరంగా ఉండి ఉజ్వల భవిష్యత్తు వైపు అడుగులు వేయాలని రామన్నపేట ఎస్సై గోపాతి సతీష్ పిలుపునిచ్చారు. తెలంగాణ యాంటీ నార్కో ట్రిక్స్ బ్యూరో (TGANB) ఆధ్వర్యంలో మంగళవారం రామన్నపేటలో మాదక ద్రవ్యాల నివారణపై విస్తృత అవగాహన కార్యక్రమం నిర్వహించారు. "సేవ్ నో టు డ్రగ్స్ _సేవ్ ఎస్ టూ లైఫ్" నినాదాలతో బ్యానర్లు ప్రదర్శిస్తూ ప్రజలకు డ్రగ్స్ వల్ల కలిగే దుష్పరిణామాలను వివరించారు. మాదక ద్రవ్యాలం వినియోగం కుటుంబాలను, సమాజాన్ని యువత భవిష్యత్తును నాశనం చేస్తుందని అలాంటి కార్యక్రమాలపై సమాచారం తెలిసిన వెంటనే 1908 టోల్ ఫ్రీ నెంబర్ లేదా 8712671111 వాట్సప్ నెంబర్లకు తెలియజేయాలని సూచించారు.



# జహీరాబాద్-తాండూరు రోడ్డుకు కొత్త నిర్మాణం చేయాలని సీపీఎం ధర్నా

- **వారం రోజుల్లో చర్యలు తీసుకుంటామని ఆర్&బీ ఏఈ హామీ...**
- **అమలు కాకపోతే ఆఫీస్ ముట్టడి లేదా రోడ్ దిగ్బంధం చేస్తామని సీపీఎం హెచ్చరిక...**

**జహీరాబాద్ వెలుతురు జూలై 28:**

సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ నుంచి హోతి(కే), శేఖాపూర్ మీదుగా తాండూరు వెళ్లే ప్రధాన రహదారి పూర్తిగా గుంతలమయంగా మారి వాహనదారులకు ప్రమాదకరంగా మారిందని ఆరోపిస్తూ సీపీఎం ఆధ్వర్యంలో జహీరాబాద్‌లోని ఆర్&బీ కార్యాలయం ఎదుట సోమవారం ధర్నా నిర్వహించారు. రహదారిని పూర్తిగా కొత్తగా నిర్మించాలని, అప్పటి వరకు అత్యవసర మరమ్మతులు చేపట్టి ప్రమాదాలను నివారించాలని నాయకులు డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా సీపీఎం జహీరాబాద్ ఏరియా కమిటీ సభ్యులు ఎస్. మహిపాల్ మాట్లాడుతూ, ఎన్నో నెలలుగా రహదారి దెబ్బతిన్నప్పటికీ అధికారులు, ప్రజాప్రతినిధులు నిర్లక్ష్యం చేస్తున్నారని విమర్శించారు. కనీసం గుంతలను పూడ్చే చర్యలు కూడా చేపట్టకపోవడం వల్ల ప్రతిరోజూ ప్రమాదాలు జరుగుతున్నాయని అన్నారు.జహీరాబాద్ పారిశ్రామిక ప్రాంతాలకు హోతి(కే), శేఖాపూర్, తాండూరు ప్రాంతాల నుంచి వందలాది మంది కార్మికులు, ఉద్యోగులు ఈ రహదారిపైనే ప్రయాణిస్తున్నారని తెలిపారు. ముఖ్యంగా రాత్రి పూట విధులకు వెళ్లే కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వర్షాల కారణంగా గుంతలు మరింత ప్రమాదకరంగా మారాయని పేర్కొన్నారు.ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని వెంటనే కొత్త రహదారి నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని, ఆ వరకు తాత్కాలిక మరమ్మతులు పూర్తి చేయాలని సీపీఎం డిమాండ్ చేసింది. ధర్నా అనంతరం ఆర్&బీ అధికారులకు వినతిపత్రం అందజేయగా, వారం రోజుల్లో సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఆర్&బీ ఏఈ హామీ ఇచ్చినట్లు నాయకులు తెలిపారు.వారం రోజుల్లో హామీ అమలు కాకపోతే సీపీఎం ఆధ్వర్యంలో భారీ స్థాయిలో ఆర్&బీ కార్యాలయం ముట్టడి లేదా రోడ్ దిగ్బంధం చేపడతామని ఎస్. మహిపాల్ హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో సీపీఎం, సీఐటీయూ నాయకులు సలీంమొదీన్, బాల్‌రాజ్, బక్కన్న, నరేష్, కిరణ్, సంగమేశ్వర్, బాగేశ్వర్, శ్రీకాంత్, నిర్మలతో పాటు పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు.



———

మొబైల్ యుగంలో క్రీడల ప్రాముఖ్యత

## ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి శారీరక విద్యే పునాది

**వెలుతురు నారాయణఖేడ్ జూలై 28 :**

సంగారెడ్డి జిల్లా :– ఆరోగ్యమే మహాభాగ్యం అని మన పెద్దలు చెప్పిన మాట నేటి డిజిటల్ యుగంలో మరింత సార్థకంగా కనిపిస్తోంది. ప్రపంచం సాంకేతికంగా ఎన్నడూ లేనంత వేగంగా అభివృద్ధి చెందుతున్నా, మనిషి శారీరక చలనం మాత్రం రోజురోజుకూ తగ్గిపోతోంది. ఒకప్పుడు జీవితాన్ని సులభతరం చేయడానికి రూపొందించిన మొబైల్ ఫోన్, నేడు మనిషి జీవనశైలినే మార్చివేసింది. విద్య, ఉద్యోగం, వినోదం, సమాచార మార్పిడి అన్నీ అరచేతిలోకి వచ్చాయి. అయితే ఈ సౌకర్యం మరోవైపు పిల్లలు, యువత మైదానాలకు దూరమయ్యే పరిస్థితిని సృష్టించింది.ఒకప్పుడు సాయంత్రం వేళల్లో ఆటలతో కళకళలాడిన పాఠశాల మైదానాలు, గ్రామాల ఖాళీ ప్రదేశాలు నేడు నిశ్శబ్దంగా కనిపిస్తున్నాయి. చేతిలో బ్యాట్, బంతి ఉండాల్సిన చోట మొబైల్ ఫోన్ కనిపిస్తోంది. ఈ మార్పు కేవలం జీవనశైలిలో వచ్చిన మార్పు మాత్రమే కాదు; భవిష్యత్ తరాల ఆరోగ్యానికి మోగుతున్న ప్రమాద ఘంటిక కూడా."మొబైల్ మనిషిని ప్రపంచానికి దగ్గర చేసింది... కానీ మైదానానికి మాత్రం దూరం చేసింది."

ఈ పరిస్థితిని మార్చాలంటే చిన్నప్పటి నుంచే పిల్లల్లో ఆటలపై ఆసక్తిని పెంపొందించడం, శారీరక విద్యకు ప్రాధాన్యం ఇవ్వడం అత్యంత అవసరం.

### శారీరక విద్య అంటే ఏమిటి?

ప్రఖ్యాత శారీరక విద్యావేత్త జెస్సీ ఫెయిరింగ్ విలియమ్స్ శారీరక విద్యను ఇలా నిర్వచించారు:

"శారీరక కార్యకలాపాల ద్వారా అందించే విద్యే శారీరక విద్య."

ఈ నిర్వచనం ప్రకారం శారీరక విద్య అనేది కేవలం ఆటలు నేర్పే పాఠ్యాంశం కాదు. ఇది శరీరం, మనస్సు, భావోద్వేగాలు, సామాజిక విలువలు, నాయకత్వ లక్షణాలను సమతుల్యంగా అభివృద్ధి చేసే సమగ్ర విద్యా ప్రక్రియ.

మరో ప్రముఖ శారీరక విద్యావేత్త చార్లెస్ ఎ. బుచర్ అభిప్రాయం ప్రకారం——

"శారీరక విద్య మొత్తం విద్యా ప్రక్రియలో అంతర్భాగం."

అంటే గణితం, సైన్స్, భాషలు ఎంత ముఖ్యమో, శారీరక విద్య కూడా అంతే ముఖ్యమని ఆయన భావించారు.

మొబైల్ వినియోగం – నిశ్శబ్ద ఆరోగ్య సంక్షోభం

ప్రస్తుతం చిన్నారుల నుంచి యువత వరకు ఎక్కువ సమయం మొబైల్ ఫోన్లు, ట్యాబ్లు, కంప్యూటర్ల ముందే గడుపుతున్నారు. ఫలితంగా శారీరక శ్రమ తగ్గి ఊబకాయం, మధుమేహం, రక్తపోటు, వెన్నునొప్పి, మెడనొప్పి, కంటి సమస్యలు, నిద్రలేమి, మానసిక ఒత్తిడి వంటి అనేక ఆరోగ్య సమస్యలు పెరుగుతున్నాయి.

ప్రపంచ ఆరోగ్య డబ్ల్యూ.హెచ్.ఓ సంస్థ సూచనల ప్రకారం, 5–17 సంవత్సరాల పిల్లలు మరియు యుక్తవయస్కులు ప్రతిరోజూ కనీసం 60 నిమిషాల మితమైన లేదా తీవ్రమైన శారీరక చలనం చేయాలి. ఈ అలవాటు శరీర దారుఢ్యాన్ని పెంచడమే కాకుండా గుండె ఆరోగ్యం, ఎముకల బలం, మానసిక ప్రశాంతతను కూడా మెరుగుపరుస్తుంది.

కానీ నేడు చాలా మంది పిల్లల రోజువారీ జీవితంలో ఆ 60 నిమిషాల మైదానం స్థానాన్ని 6 గంటల మొబైల్ వినియోగం ఆక్రమిస్తోంది.

"వ్యాయామం చేయడానికి కేటాయించిన ఒక గంట... ఆసుపత్రిలో గడపాల్సిన ఎన్నో గంటలను తగ్గిస్తుంది."

మైదానం నేర్పేది జీవిత పాఠాలు

క్రీడలు కేవలం పతకాలు సాధించడానికి మాత్రమే కాదు. అవి జీవితాన్ని ఎలా గెలవాలో నేర్పిస్తాయి. ఆటల ద్వారా క్రమశిక్షణ, సమయ పాలన, నాయకత్వం, సహనం, జట్టు భావన, ఆత్మవిశ్వాసం, పరస్పర గౌరవం వంటి విలువలు సహజంగానే అలవడతాయి.

ఆధునిక ఒలింపిక్ ఉద్యమ పితామహుడు పియెర్ డి కూబెర్టిన్

సందేశం సారాంశం

జీవితంలో ముఖ్యమైనది విజయం మాత్రమే కాదు; లక్ష్యం కోసం నిజాయితీగా పోరాడటమే.

ఈ భావన ప్రతి క్రీడాకారుడికి జీవితాంతం స్ఫూర్తినిస్తుంది.

ఆటలేని పాఠశాల... ఆత్మలేని శరీరం వంటిది .

"మైదానం పిల్లల మొదటి నాయకత్వ పాఠశాల."

"ఒక గంట మైదానంలో గడిపిన బాలుడు, గంటల తరబడి మొబైల్‌లో గడిపిన బాలుడికంటే ఆరోగ్యంగా, ధైర్యంగా, ఆత్మవిశ్వాసంతో ఎదుగుతాడు."

వ్యాయామం – ఆరోగ్యానికి సహజ ఔషధం

వ్యాయామం అనేది కేవలం క్రీడాకారులకు మాత్రమే కాదు. ప్రతి మనిషికి అవసరమైన జీవన విధానం. నడక, పరుగు, యోగా, సూర్య నమస్కారాలు, సైక్లింగ్, ఈత, సంప్రదాయ ఆటలు వంటి వ్యాయామాలు శరీరాన్ని చురుకుగా ఉంచుతాయి.

ప్రతిరోజూ క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం వల్ల——

గుండె ఆరోగ్యం మెరుగుపడుతుంది.

శరీర బరువు నియంత్రణలో ఉంటుంది.

రోగనిరోధక శక్తి పెరుగుతుంది.

ఒత్తిడి, ఆందోళన తగ్గుతాయి.

ఏకాగ్రత, జ్ఞాపకశక్తి పెరుగుతాయి.

మంచి నిద్ర అలవడుతుంది.

చెమట చుక్కలు మైదానంలో కారితే... కన్నీటి చుక్కలు ఆసుపత్రిలో కారవు

### భారతీయ మహనీయుల సందేశం

స్వామి వివేకానంద యువతలో శారీరక దృఢత్వానికి అత్యంత ప్రాధాన్యం ఇచ్చారు. బలమైన శరీరమే బలమైన మనస్సుకు పునాది అని ఆయన నమ్మకం.

భారత మాజీ రాష్ట్రపతి డా. ఏ.పి.జె. అబ్దుల్ కలాం యువత ఆరోగ్యంగా, క్రమశిక్షణతో ఎదిగితేనే దేశ భవిష్యత్తు బలపడుతుందని పలుమార్లు పేర్కొన్నారు.

భారత హాకీ దిగ్గజం మేజర్ ధ్యాన్ చంద్ జీవితం మనకు ఒక గొప్ప సందేశం ఇస్తుంది——ప్రతిభకు క్రమశిక్షణ, వినయం, నిరంతర సాధనతోడైతే ప్రపంచ స్థాయి విజయాలు సాధ్యమవుతాయి.

భారత బ్యాడ్మింటన్ దిగ్గజ కోచ్ పుల్లెల గోపీచంద్ తరచూ చెప్పే సందేశం——

"క్రీడలు పిల్లలకు గెలుపు మాత్రమే కాదు, ఓటమిని గౌరవంగా స్వీకరించడం కూడా నేర్పిస్తాయి."

### విశ్లేషకులు చెప్పే ముఖ్యాంశాలు

విద్యా, ఆరోగ్య, క్రీడా నిపుణుల అభిప్రాయం ప్రకారం——

ప్రతిరోజూ శారీరకంగా చురుకుగా ఉండే విద్యార్థులు చదువులో మెరుగైన ఏకాగ్రతను కనబరుస్తారు.

క్రీడలు మానసిక ఒత్తిడిని తగ్గించి సంతోషకరమైన జీవనశైలిని అలవాటు చేస్తాయి.

జట్టు క్రీడలు నాయకత్వం, సామాజిక బాధ్యత, సహకార భావనను పెంపొందిస్తాయి.

చిన్నప్పటి నుంచే వ్యాయామ అలవాటు ఉంటే భవిష్యత్తులో జీవనశైలి వ్యాధుల ప్రమాదం గణనీయంగా తగ్గుతుంది.

శారీరక విద్యపై పెట్టుబడి అంటే ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణంపై పెట్టుబడి.

ఈరోజు మైదానంలో పరుగెత్తిన పిల్లవాడే... రేపు జీవితంలో ధైర్యంగా ముందుకు నడుస్తాడు.

" పుస్తకాలు జ్ఞానాన్ని ఇస్తే... క్రీడలు జీవితాన్ని గెలిచే శక్తిని ఇస్తాయి."

### తల్లిదండ్రులు – ఉపాధ్యాయుల బాధ్యత

పిల్లలకు ఖరీదైన మొబైల్ ఫోన్ కొనివ్వడం కంటే ప్రతిరోజూ కనీసం ఒక గంట ఆటలకు అవకాశం కల్పించడం గొప్ప బహుమతి.

తల్లిదండ్రులు పిల్లలతో కలిసి నడవడం, సైక్లింగ్ చేయడం, ఆటలు ఆడడం వంటి అలవాట్లను పెంపొందించాలి. ఉపాధ్యాయులు శారీరక విద్యను కేవలం మార్కుల కోసం కాదు, జీవిత నిర్మాణం కోసం బోధించాలి.

"పిల్లలకు వారసత్వంగా ఆస్తి మాత్రమే కాకుండా... ఆరోగ్యకరమైన జీవనశైలిని కూడా అందిద్దాం."

"మొబైల్ బహుమతిగా ఇవ్వడం కంటే... ఒక ఫుట్‌బాల్, వాలీబాల్ లేదా బ్యాడ్మింటన్ రాకెట్ ఇవ్వడం వారి భవిష్యత్తుకు గొప్ప పెట్టుబడి."

యువతకు సందేశం

దేశ భవిష్యత్తు తరగతి గదుల్లోనే కాదు... మైదానాల్లో కూడా రూపుదిద్దుకుంటుంది. శరీరం దృఢంగా ఉంటేనే మనస్సు చురుకుగా ఉంటుంది. ఆరోగ్యవంతమైన యువతే అభివృద్ధి చెందిన దేశానికి బలమైన పునాది.

ప్రతి విద్యార్థి రోజూ కనీసం ఒక గంట వ్యాయామం లేదా ఏదైనా ఒక క్రీడను తన దైనందిన జీవితంలో భాగం చేసుకోవాలి. గెలుపు–ఓటములు జీవితంలో భాగమే. కానీ క్రీడలు నేర్పే క్రమశిక్షణ, పట్టుదల, సహనం జీవితాంతం మనతో ఉంటాయి.

### ముగింపు

సాంకేతికత మన జీవితాన్ని సులభతరం చేస్తుంది. కానీ ఆరోగ్యవంతమైన శరీరం, చురుకైన మనస్సు, క్రమశిక్షణతో కూడిన వ్యక్తిత్వాన్ని నిర్మించేది క్రీడలే.

నేటి పిల్లలు మొబైల్‌ను ఉపయోగించడం నేర్చుకోవాలి; అదే సమయంలో మైదానాన్ని ప్రేమించడం కూడా నేర్చుకోవాలి. ప్రతి కుటుంబం, ప్రతి పాఠశాల, ప్రతి గ్రామం, ప్రతి ప్రభుత్వం కలిసి క్రీడలకు ప్రాధాన్యం ఇస్తేనే ఆరోగ్యవంతమైన, శక్తివంతమైన భారతదేశం నిర్మాణం సాధ్యమవుతుంది.

ఈ రోజు పిల్లలకు మనం ఇచ్చే గొప్ప బహుమతి ఖరీదైన మొబైల్ కాదు... ఆరోగ్యవంతమైన బాల్యం. ఆ బాల్యాన్ని కాపాడేది ఆటలు, వ్యాయామం, శారీరక విద్య మాత్రమే.

స్ఫూర్తిదాయకమైన చివరి సూక్తులు

మొబైల్‌కు పరిమితి... మైదానానికి ప్రాధాన్యం

క్రీడలే ఆరోగ్యానికి చిరునామా... శారీరక విద్యే సమాజ పురోగతికి పునాది

నేటి మైదానాలే రేపటి మహానుభావులను తయారు చేస్తాయి.

మైత్రి శాంసన్
వ్యాయామ విద్య విభాగం
ఉస్మానియా విశ్వవిద్యాలయం, హైదరాబాద్

# SIR ప్రవాస్ యోజనలో భాగంగా పలు బూత్‌లలో బీజేపీ నాయకుల పర్యటన

- **పలు బూత్‌లను పరిశీలించిన మాజీ ఎంపీ బీబీ పాటిల్...**

**జహీరాబాద్ వెలుతురు జూలై 28:**







భారతీయ జనతా పార్టీ రాష్ట్ర పిలుపు మేరకు జహీరాబాద్ పట్టణ అధ్యక్షులు పూల సంతోష్ ఆధ్వర్యంలో SIR ప్రవాస్ యోజన కార్యక్రమంలో భాగంగా నేడు పట్టణంలోని పలు బూత్‌లను సందర్శించి విస్తృతంగా పర్యటించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ పార్లమెంట్ సభ్యులు బీబీ పాటిల్ పాల్గొని బీఎల్ఓ (BLO) అధికారులతో SIR కార్యక్రమం అమలు తీరును తెలుసుకున్నారు. అనంతరం బీఎల్ఓ అధికారులు, భారతీయ జనతా పార్టీ BLA–2లు, బూత్ అధ్యక్షులతో కలిసి బూత్‌లను పరిశీలించి ఓటర్ల నమోదు ప్రక్రియపై ప్రజలకు అవగాహన కల్పించారు.ఇంకా కేవలం ఐదు రోజుల గడువు మాత్రమే మిగిలి ఉన్నందున, అర్హులైన ప్రతి ఓటరు తమ ఎన్యుమరేషన్ ఫారాలను పూర్తిగా నింపి సంబంధిత బీఎల్ఓ అధికారులకు వెంటనే అందజేయాలని నాయకులు సూచించారు.ఈ సందర్భంగా పట్టణ అధ్యక్షులు పూల సంతోష్ మాట్లాడుతూ, ఓటరు జాబితాలో ప్రతి అర్హుడి పేరు నమోదు కావడం ప్రజాస్వామ్య వ్యవస్థ బలోపేతానికి అత్యంత ముఖ్యమని అన్నారు. ప్రజలందరూ ఎలాంటి నిర్లక్ష్యం చేయకుండా తమ వివరాలను సకాలంలో నమోదు చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.అనంతరం SIR ప్రవాస్ యోజన కార్యక్రమంలో భాగంగా BLA–2 రాయిపల్లి సునీల్ నివాసంలో ఏర్పాటు చేసిన మధ్యాహ్న భోజన కార్యక్రమంలో మాజీ ఎంపీ బీబీ పాటిల్‌తో పాటు బీజేపీ నాయకులు పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు గొల్ల భాస్కర్, రాష్ట్ర నాయకులు సుధీర్ బండారి, సుభాష్ రెడ్డి, బీజేపీ సీనియర్ నాయకురాలు అర్చన శారద, గంజి మంజుల, లావణ్య నాయక్, శ్రీనివాస్ గౌడ్, మున్సిపల్ కౌన్సిలర్లు బొగ్గుల సంతోష్, అప్పం శ్రావణ్, బీజేపీ నాయకులు సోమ అనిల్, పాలింకర్ సంతోష్, మారయ్య, మహేష్ ముదిరాజ్, అరుణ్ కుమార్, ఉప్పుని విజయ్, శివపూజ శ్రీకాంత్, వేణు, కడితే అనిరుద్ రెడ్డి, బసవరాజ్, నరేష్ పాటిల్, అప్పం రమేష్, సందీప్, మంజునాథ్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఎస్సీ బాలికల వసతి గృహ విద్యార్థినులకు స్టడీ మెటీరియల్ పంపిణీ

- **విద్యార్థినులకు నోట్‌బుక్కులు, స్టడీ మెటీరియల్ అందజేసిన 17వ వార్డు కౌన్సిలర్ మొహమ్మద్ జహంగీర్....**

**జహీరాబాద్ వెలుతురు, జూలై 28:**

సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ పట్టణంలోని 17వ వార్డులో ఉన్న ఎస్సీ బాలికల వసతి గృహ విద్యార్థినులకు 17వ వార్డు కౌన్సిలర్ మొహమ్మద్ జహంగీర్ నోట్‌బుక్కులు, ఇతర స్టడీ మెటీరియల్‌ను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తమ చిన్నతనంలో సరైన వసతులు, సౌకర్యాలు లేక ఎంతోమంది విద్యకు దూరమయ్యారని గుర్తు చేశారు. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల విద్యాభివృద్ధికి అనేక సంక్షేమ పథకాలు, మెరుగైన వసతులు కల్పిస్తోందని పేర్కొన్నారు. విద్యార్థినులు ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత విద్యను అభ్యసించి జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు.సామాజిక బాధ్యతలో భాగంగా విద్యార్థులకు అవసరమైన నోట్‌బుక్కులు, స్టడీ మెటీరియల్‌ను అందించడం ఆనందంగా ఉందని, భవిష్యత్తులో కూడా విద్యార్థుల సంక్షేమం కోసం ఇటువంటి సేవా కార్యక్రమాలను కొనసాగిస్తామని



కౌన్సిలర్ మొహమ్మద్ జహంగీర్ తెలిపారు.ఈ కార్యక్రమంలో వసతి గృహ సిబ్బంది, స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

# ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిలు వెంటనే చెల్లించాలి

- **సంగారెడ్డి జిల్లా బీజేవైఎం అధ్యక్షుడు ప్రవీణ్ యాదవ్**

**వెలుతురు నారాయణఖేడ్ జూలై 28 :**





మెదక్ జిల్లా :– నారాయణఖేడ్ నియోజకవర్గం పెద్ద శంకరంపేట్ తెలంగాణ ప్రభుత్వం వెంటనే విద్యార్థులకు ఫీజు రియంబర్స్ మెంట్ బకాయిలు వెంటనే చెల్లించాలని సంగారెడ్డి జిల్లా బిజెపి ఓబీసీ మోర్చా అధ్యక్షుడు కోణం విట్టల్. బీజేవైఎం సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు ప్రవీణ్ యాదవ్ లు పేర్కొన్నారు.. మంగళవారం పెద్ద శంకరంపేట లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బిజేవైఎం తెలంగాణ రాష్ట్ర శాఖ పిలుపుమేరకు ఫీజుల బకాయి బిజెపి లడాయి పోస్టర్ ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో 40 లక్షల మంది విద్యార్థులు భవిష్యత్తు అగమ్యగోచరంగా మారిందన్నారు. విద్యార్థులకు బకాయి ఉన్న 15వేల కోట్ల ఫీజు రియంబర్స్ మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలన్నారు. ప్రభుత్వం వెంటనే విద్యార్థులకు అత్యవసర ఆర్థిక ఉపశమనం కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో నారాయణఖేడ్ బి జె వై ఎం కన్వీనర్ సాయి పటేల్ కో కన్వీనర్ బుగుడాల కృష్ణ.. మండల బిజెపి అధ్యక్షుడు శ్రావణ్ కుమార్. నాయకులు ప్రభు గౌడ్ ప్రవీణ్ సాయిరాం ప్రవీణ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# మూడు రోజుల సమగ్ర ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయ శిక్షణ విజయవంతం

- **కోహీర్‌లో ముగింపు కార్యక్రమం.. శిక్షకులకు ఘన సన్మానం...**

**జహీరాబాద్ వెలుతురు జూలై 28:**





సంగారెడ్డి జిల్లా కోహీర్ మండలంలోని జెడ్పీహెచ్ఎస్ (బాలికల) పాఠశాలలో నిర్వహించిన రెండో విడత మూడు రోజుల సమగ్ర ఇన్–సర్వీస్ ఉపాధ్యాయ శిక్షణ కార్యక్రమం మంగళవారం విజయవంతంగా ముగిసింది.ముగింపు కార్యక్రమానికి మండల విద్యాధికారి (ఎంఈఓ) మహమ్మద్ జాకీర్ హుస్సేన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు శిక్షణలో నేర్చుకున్న వినూత్న బోధనా పద్ధతులు, విద్యార్థి కేంద్రిత బోధన, సాంకేతిక పరిజ్ఞానం వినియోగాన్ని పాఠశాలల్లో సమర్థవంతంగా అమలు చేసి విద్యార్థుల అభ్యాస ఫలితాలను మెరుగుపరచాలని సూచించారు.మూడు రోజుల పాటు శిక్షణ అందించిన డీఆర్పీ వల్లభ్ జోషి, రిసోర్స్ పర్సన్స్ రాజ్‌కుమార్, సింహాచలం, ఇబ్రహీం, గోవింద్‌రావులను ఎంఈఓ మహమ్మద్ జాకీర్ హుస్సేన్, ఉపాధ్యాయ సంఘాల నాయకులు, కోహీర్ మండల ఉపాధ్యాయులు ఘనంగా శాలువాలతో సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. శిక్షణా కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన శిక్షకుల సేవలను కొనియాడుతూ వారికి అభినందనలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు, వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. శిక్షణ ద్వారా బోధనా నైపుణ్యాలు మరింత మెరుగుపడి విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు దోహదపడుతుందని పలువురు అభిప్రాయపడ్డారు.

# ప్రపంచ హెపటైటిస్ దినోత్సవం

- **హెపటైటిస్ నిర్మూలనకు అందరము కలిసి ముందుకు సాగుదాం**
- **డా. పుట్ల శ్రీనివాస్ జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి, హైదరాబాద్**

**హైదరాబాద్ వెలుతురు జూలై 28:**

మంగళవారం రోజున ఉస్మానియా జనరల్ హాస్పిటల్ సెమినార్ హాల్లో ప్రపంచ హెపటైటిస్ దినోత్సవం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి, మాట్లాడుతూ వైరల్ హెపటైటిస్ వ్యాధిపై ప్రజల్లో అవగాహన పెంపొందించడం, ముందస్తు పరీక్షలు, చికిత్స, టికాల ప్రాముఖ్యతను తెలియజేయడం ఈ దినోత్సవం ముఖ్య ఉద్దేశమని తెలియజేశారు. హెపటైటిస్ అనేది కాలేయము (లివర్)లో వాపు కలిగించే వ్యాధి. ఇది ప్రధానంగా హెపటైటిస్ A,B,C,D,E వైరస్ వలన వస్తుంది. వీటిలో హెపటైస్ బి,సి దీర్ఘకాలిక వ్యాధులకు, కాలేయ సిరోసిస్ మరియు కాలేయ క్యాన్సర్కు దారి తీయవచ్చు అని తెలియజేశారు.

- **కలుషిత ఆహారం, నీటి ద్వారా (హెపటైటిస్ A,E)**
- **కలుషితమైన రక్తం, లేదా రక్త ఉత్పత్తుల ద్వారా**
- **కలుషిత సూదులు, సిరంజిలు, వినియోగం ద్వారా**
- **అసురక్షిత లైంగిక సంబంధాల ద్వారా**
- **గర్భిణీతల్లి నుండి శిశువుకు (ప్రత్యేకించి హెపటైటిస్ B) వ్యాపిస్తుందని తెలియజేశారు.**

ఈ సందర్భంగా మాట్లాడుతూ హెపటైటిస్ నివారించాలంటే హెపటైటిస్ బి టీకాను తప్పనిసరిగా వేయించుకోవాలని, సురక్షిత రక్త మార్పిడి మాత్రమే చేయించుకోవాలని, ఒకసారి ఉపయోగించే సూదులు , సిరంజిలనే వినియోగించాలని, గర్భిణీలు అవసరమైన పరీక్షలు వేయించుకోవాలని తెలియజేశారు. హెపటైటిస్ ముందుగానే గుర్తిస్తే సమర్థవంతమైన చికిత్స అందుబాటులో ఉన్నదని. ముఖ్యంగా హెపటైటిస్ బి మరియు సి కోసము వైద్యుల సలహా మేరకు






పరీక్షలు, చికిత్స తీసుకోవాలని సూచించారు.

తదనంతరం ఈ సెమినార్ హాల్లోని పానీపూర కస్టర్ సమీక్ష సమావేశం జరిగింది.

క్లస్టర్ పరిధిలోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల, బస్తీ దావకాన, ఆర్ బి ఎస్ కే, వైద్యాధికారులు, సూపర్వైజర్లు, హెల్త్ అసిస్టెంట్స్,ANM లు ఆశ కార్యకర్తలతో సమీక్ష సమావేశం జరిగింది, ఈ సందర్భంగా మాట్లాడుతూ బస్తీ ప్రజలకు నాణ్యమైన ఆరోగ్య సేవలు అందించాలని, క్షయ వ్యాధి, లెప్రసీ కేసులను గుర్తించి రిజిస్ట్రేషన్ చేసి నమోదు చేయించాలని వారందరికీ ఆరోగ్య సేవలు అందించాలి కోరారు. వైద్యాధికారులు, సిబ్బంది సమయపాలన పాటించాలని నాణ్యమైన ఆ రోగ్య సేవలు ప్రతి ఒక్కరికి అందించాలనీ గర్భిణీ స్త్రీల పరీక్షలు, సేవలు , వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమం సమర్థవంతంగా నిర్వహించాలనీ అన్ని రకాల మందులు పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో & బస్తీ దవాఖానాలలో అందుబాటులో ఉన్నవని తెలియజేశారు.

**అన్ని రకాల పరీక్షలు కూడా అందుబాటులో ఉన్నాయని తెలియజేశారు.**

మురికివాడాలలో (స్లమ్స్)లో నివసిస్తున్న పేద ప్రజలకు క్రమం తప్పకుండా ఆరోగ్య సేవలు అందించాలని సూచించారు.సీజనల్ వ్యాధులపై ప్రజల్లో అవగాహన కల్పించి వ్యాధులు నియంత్రణ చర్యలు తీసుకోవాలని కోరారు.ఇంకా DM&HO గారు మాట్లాడుతూ, వివిధ జాతీయ , రాష్ట్ర ఆరోగ్య కార్యక్రమాల అమలుపై సూచికల వారిగా సమగ్ర సమీక్ష నిర్వహించారు.

కార్యక్రమాల అమలులో వేగం పెంచి సత్వరమే పూర్తి చేయాలని కోరారు.ప్రజలకు నాణ్యమైన ఆరోగ్య సేవలను సమర్థవంతంగా అందించడం ప్రతి ఆరోగ్య సిబ్బంది బాధ్యత అని పేర్కొన్నారు. ప్రభుత్వ ప్రజారోగ్య కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేయాలని, గర్భిణీల సంరక్షణ,సేవలు, శిశు టీకాలు, అంటువ్యాధుల నివారణ, సీజనల్ వ్యాధుల నియంత్రణ మరియు ముందు జాగ్రత్త చర్యలలో భాగంగా కీటక జనిత వ్యాధులైన మలేరియా, డెంగీ, చికున్ గునియా పై ఇంటింటి ఆరోగ్య సర్వేలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.అలాగే, ఆరోగ్య సేవల పట్ల ప్రజల్లో మరింత అవగాహన కల్పించి, ప్రతి అర్హులైన లబ్ధిదారునికి ప్రభుత్వ ఆరోగ్య పథకాల ప్రయోజనాలు అందేలా కృషి చేయాలని ఆదేశించారు .గర్భిణి హెచ్ఐవి ఎయిడ్స్ రోగులు ART సెంటర్లకు వెళ్లి చికిత్స తీసుకునే విధంగా సిబ్బంది పనిచేయాలి సూచించారు. ఓపి సేవలు ఉదయం తొమ్మిది గంటల నుండి సాయంత్రం 4 గంటలకు నిర్వహించాలని కోరారు.

మెడికల్ ఆఫీసర్స్, సూపర్ వైజరీ సిబ్బంది తప్పకుండా అన్ని ఆరోగ్య కార్యక్రమాలను పర్యవేక్షణ చేసి ఫీల్డ్ సిబ్బందికి ఎప్పటికప్పుడు సూచనలు సలహాలు ఇస్తూ మన ఆరోగ్య కార్యక్రమాల ఇండికేటర్స్ సకాలంలో పూర్తయ్యేటట్టు, చర్యలు తీసుకోవాలని కోరారు.

ఆరోగ్య సేవలు అందించడంలో వైద్యులు, ఇబ్బంది అలసత్వము వహించకూడదు అని కోరారూ.

ఈ సమావేశంలో అదనపు జిల్లా వైద్యాధికారి డా:అనిత , అడిషనల్ డిఎంహెచ్ఓ (ఎయిడ్స్ &, లెప్రసీ) డాక్టర్ సరస్వతి , ప్రోగ్రామ్ ఆఫీసర్స్ డా. శశికళ, డా. సాయిబాబా, ఆశ్రిత రెడ్డి , సీనియర్ పబ్లిక్ హెల్త్ ఆఫీసర్స్ , జిల్లా మీడియా అధికారి జక్కుల రాములు, ఇంచార్జ్ మలేరియా అధికారి ఆంజనేయులు, పాల్గొని వివిధ ఆరోగ్య కార్యక్రమాల అమలుపై సమీక్ష నిర్వహించారు. సమావేశంలో హాజరైన వైద్యాధికారులు, సూపర్వైజర్లు, హెల్త్ అసిస్టెంట్లు, ANMలు మరియు ఆశా కార్యకర్తలకు జిల్లా వైద్య మరియు ఆరోగ్యశాఖ అధికారి అవసరమైన సూచనలు, మార్గదర్శకాలు , దిశా నిర్దేశం చేశారు.

# రోస్టర్ విధానం వల్ల మాల సామాజిక వర్గానికి తీవ్ర అన్యాయం

- **ఆగస్టు10 -11 ల్లో 'హలో మాల– చలో ఢిల్లీ' విజయవంతం చేయాలి**
- **తెలంగాణ రాష్ట్ర మాల సంఘాల జేఏసీ చైర్మన్ భాస్కర్**

**బషీర్ బాగ్ వెలుతురు 28 జులై :**




రాష్ట్రంలో అమలవుతున్న ఎస్సీ వర్గీకరణ చట్టం, రోస్టర్ విధానం వల్ల మాల సామాజిక వర్గానికి తీవ్ర అన్యాయం జరుగుతోందని,రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని బొంద పెడితేనే మాలలకు న్యాయం జరూగుతుందని తెలంగాణ రాష్ట్ర మాల సంఘాల జేఏసీ ఆరోపించింది.బషీర్బాగ్ ప్రెస్క్లబ్లో నిర్వహించిన మీడియా సమావేశంలో గౌరవాధ్యక్షుడు చెరుకు రాంచందర్, వర్కింగ్ చైర్మన్ మంత్రి నరసింహయ్య, గ్రేటర్ హైదరాబాద్ చైర్మన్ బేర బాలకిషన్లతో కలసి జేఏసీ చైర్మన్ మందాల భాస్కర్ హలో మాల–చలో ఢిల్లీ' కి సంబంధించిన గోడ పత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా భాస్కర్ మాట్లాడుతూ, సుప్రీంకోర్టు మార్గదర్శకాలను విస్మరించి ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ అమలు చేసిందని, 14 ఉద్యోగ నోటిఫికేషన్లతో మాల యువత నష్టపోయారని ఆరోపించారు. మాల ప్రజాప్రతినిధులు స్పందించాలని, లేకుంటే వారి ఇళ్ల ముందు ధర్నాలు చేపడతామని హెచ్చరించారు. రోస్టర్ విధానాన్ని నిపుణుల సూచనలతో సవరించాలని డిమాండ్ చేస్తూ ఢిల్లీ లోని జంతర్ మంతర్ వద్ద ఆగస్టు10, 11 తేదీల్లో నిర్వహించనున్న 'హలో మాల–చలో ఢిల్లీ' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని రాష్ట్రవ్యాప్తంగా మాల సంఘాలు, విద్యార్థి, యువజన, ఉద్యోగ సంఘాలకు పిలుపునిచ్చారు.

# కుష్ఠు బాధితులకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి





- **జిల్లా వైద్య మరియు ఆరోగ్యశాఖ అధికారి డా. స్వర్ణ కుమారి**

**రంగారెడ్డి జిల్లా వెలుతురు జూలై 28:**

అబ్దుల్లాపూర్మెట్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని శాంతినగర్ కుష్ఠు కాలనీని జిల్లా వైద్య మరియు ఆరోగ్యశాఖ అధికారి డా. స్వర్ణ కుమారి గారు, అదనపు జిల్లా వైద్య మరియు ఆరోగ్యశాఖ అధికారి (ADMHO) గారు సందర్శించారు.ఈ సందర్భంగా కుష్ఠు బాధితుల సంఘ సభ్యులతో సమావేశమై వారి ఆరోగ్య పరిస్థితులు, జీవన పరిస్థితులు, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు, వారికి అందుతున్న సేవల గురించి వివరాలు తెలుసుకున్నారు. ప్రస్తుతం కుష్ఠు బాధితుల గుర్తింపు, వారి అవసరాల అంచనా మరియు సంక్షేమ ప్రయోజనాల కల్పన కోసం నిర్వహిస్తున్న సర్వే పురోగతిని సమీక్షించారు.డీఎంహెచ్ఓ డా. స్వర్ణ కుమారి మాట్లాడుతూ, కుష్ఠు వ్యాధి పూర్తిగా నయం చేయగల వ్యాధి అని, ప్రారంభ దశలో గుర్తించి చికిత్స తీసుకుంటే శాశ్వత వైకల్యాలను నివారించవచ్చని తెలిపారు. కుష్ఠు బాధితులకు ప్రభుత్వం అందిస్తున్న వైద్య సేవలు, పునరావాస సదుపాయాలు, వికలాంగుల పెన్షన్, గుర్తింపు కార్డులు, ఉపాధి మరియు ఇతర సంక్షేమ పథకాల గురించి అధికారులు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించి అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.సర్వేను క్షేత్రస్థాయిలో నాణ్యతతో, పారదర్శకంగా పూర్తి చేసి, అర్హులైన ప్రతి కుష్ఠు బాధితుడికి ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందేలా చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులకు సూచించారు.ఈ కార్యక్రమంలో వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది, కుష్ఠు వ్యాధి నియంత్రణ కార్యక్రమం సిబ్బంది, కుష్ఠు బాధితుల సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు.

# ఆగస్టు 9 రామన్నపేట మండల కేంద్రంలో అమరుల యాదిలో బస్సు యాత్ర ప్రదర్శన సభను జయప్రదం చేయండి



- **భావడ్ల పెల్లి బాలరాజు, ఎర్ర రవీందర్ లు గీత కార్మిక సంఘం జిల్లా నాయకులు**

**రామన్నపేట వెలుతురు న్యూస్ జూలై 28:**

తెలంగాణ రాష్ట్రంలో కల్లుగీత వృత్తి రక్షణ కోసం. హక్కుల కోసం పనిచేసి అమరులైన కల్లుగీత కార్మిక సంఘం నాయకులను స్మరిస్తూ వారి గ్రామాలలో సభలను నిర్వహిస్తూ వారి ఆశయాలను మరొక్కసారి మననం చేస్తూ ఇప్పుడు వృత్తి రక్షణ కోసం హక్కుల సాధన కోసం పోరాటం చేయాలని ఆగస్టు 2 మానుకోట జిల్లా కేంద్రంలో ప్రారంభమై ఆగస్టు 18న హైదరాబాదులో పాపన్న జయంతిన ముగుస్తున్న ఇట్టి యాత్ర ఆగస్టు 9న రామన్నపేటపట్టణ కేంద్రం కు విచ్చేస్తున్న సందర్భంలో పెద్ద ఎత్తున ప్రదర్శన సుభాసు చౌరస్తా వద్ద సభ కార్యక్రమాన్ని. సభను. 9వ తారీకు భువనగిరి జిల్లా కేంద్రంలో జరుగు ర్యాలీని సభను కల్లుగీత కార్మిక సోదరులందరూ పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయవలసిందిగా జనం పెళ్లి, ఇస్కిల్లా, ఉత్తటూరు గ్రామాల గీత కార్మికులను కలిసి కోరారు ఇట్టి సమావేశంలో అమరులు యాది లో బస్సు యాత్ర పోస్టర్ ఆవిష్కరణ చేయడం జరిగింది. తదుపరి జరిగిన సమావేశంలో పాల్గొని వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో మూడు లక్షల మంది గీత కార్మికులు వృత్తిలో ప్రత్యక్షంగా పాల్గొంటున్నారని చేతివృత్తులలో అత్యంత ప్రమాదకరమైన వృత్తి కల్లుగీత వృత్తిని ఈ వృత్తి రక్షణకు కార్మికుల సంక్షేమానికి ఈ ప్రభుత్వం వచ్చి మూడు సంవత్సరాలు గడిచిన ఇప్పటివరకు నిధులు కేటాయించక పోవడం వృత్తిలో ప్రమాదానికి గురై ఎక్స్ గ్రేషియా మంజూరై గీత కార్మికులకు రావలసిన డబ్బులను విడుదల చేయక పోవడం గీత కార్మికులపై ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనం అని అన్నారు.

ఈ ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా తన మేనిఫెస్టోలో కల్లుగీత కార్మికులకు అనేక రకమైన వాగ్దానాలు ఇచ్చిందని ఇప్పటివరకు వాటిని అమలు చేసిన పరిస్థితి లేదని అందుకే కల్లుగీత కార్మికులు తమ సమస్యల పరిష్కారం కోసం గతంలో సంఘం నాయకత్వన జరిగిన పోరాటాల వల్ల అనేక హక్కులను సాధించుకున్న చరిత్ర కల్లు గీత కార్మికులదని ఇప్పుడు కూడా తమ సమస్యల పరిష్కారం కోసం కల్లుగీత కార్మికులందరూ పోరాటాలకు సిద్ధం కావాల్సిన అవసరం ఉన్నదని ప్రభుత్వాలను ఉద్యమాల ద్వారా ఒత్తిడి తెస్తానే తమ సమస్యల పరిష్కారం అవుతాయని అందుకు కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్రవ్యాప్తంగా కల్లుగీత కార్మికులలో చైతన్యం తీసుకురావడానికి ఈ బస్సు యాత్ర ఉపయోగపడుతుందని తెలిపారు. ఈ సమావేశంలో కల్లుగీత కార్మిక సంఘం మండల అధ్యక్షుడు కునూరు మల్లేశం మండల కోశాధికారి మునుకుంట్ల లెనిన్ మండల కమిటీ సభ్యులు బైరు రమేష్, బైరు శంకరయ్య,పబ్బు శేఖర్, గంగాధర్, పబ్బు వెంకన్న, గడ్డమీది సత్తయ్య, చెరుకు శ్రీనివాస్, మునుకుంట్ల స్వామి, గడ్డమీది రమేష్, ఉయ్యాల సైదులు, పొతాగోని స్వామి, పబ్బు వెంకన్న, కప్పల రాజయ్య, కప్పల నవీన్, పబ్బు శంకరయ్య, కాటమయ్య, శ్రీను, కృష్ణ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# ఉప్పల్ నియోజకవర్గ బీజేపీ ఓబీసీ మోర్చా కన్వీనర్ గా తాళ్ళ ఆనంద్ గౌడ్ నియామకం

**ఉప్పల్, జూలై 28 (వెలుతురు):**



భారతీయ జనతా పార్టీ ఉప్పల్ నియోజకవర్గ ఓబీసీ మోర్చా కన్వీనర్ గా తాళ్ళ ఆనంద్ గౌడ్ నియమితులయ్యారు. గత మూడు దశాబ్దాలుగా పార్టీకి విస్తృత సేవలందిస్తున్న ఆయన సమర్థతను గుర్తిస్తూ అధిష్ఠానం ఈ బాధ్యతలను అప్పగించింది. తన నియామకానికి సహకరించిన రాష్ట్ర అధ్యక్షులు రామచందర్ రావు, ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే ఎన్.వి.ఎస్.ఎస్. ప్రభాకర్, ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు ఆనంద్ గౌడ్, జిల్లా అధ్యక్షులు శేఖర్ యాదవ్ లకు ఆనంద్ గౌడ్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్టీ తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ బిసి సామాజిక వర్గాల బలోపేతానికి కృషి చేస్తానన్నారు. రాబోయే ఎన్నికల్లో నియోజకవర్గవ్యాప్తంగా కాషాయ జెండా ఎగురవేయడమే లక్ష్యంగా శ్రేణులను సమాయత్తం చేస్తామని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాదం, లక్ష్మణ్ గౌడ్, నర్సింగ్ రావు తదితరులు పాల్గొన్నారు.

# బీసీల సమస్యలను రాజ్యాంగ కోణంలో చూడాలి

**బషీర్ బాగ్ వెలుతురు 28 జులై :**

బీసీ సమస్యలను కేవలం సంక్షేమ పథకాలకే పరిమితం చేయకుండా రాజ్యాంగ హక్కులు, విధాన రూపకల్పన, పరిపాలనలో భాగస్వామ్యం అనే విస్తృత దృక్పథంతో చూడాల్సిన అవసరం ఉందని విశ్రాంత ఐఏఎస్ అధికారి టి. చిరంజీవులు అన్నారు. బీసీల హక్కుల సాధనకు యువత డిజిటల్ వేదికలను సమర్థవంతంగా వినియోగించి ప్రజా ఉద్యమాన్ని నిర్మించాలని ఆయన పిలుపునిచ్చారు. హైదరాబాద్ గన్ ఫౌండ్రిలోని బీసీ జేఏసీ కార్యాలయంలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షులు గుజ్జ సత్యం అధ్యక్షతన నిర్వహించిన కార్యాచరణ సమావేశంలో ఆయన మాట్లాడారు. సమాజంలో బీసీలకు సంబంధించిన అంశాలు జాతీయ స్థాయిలో చర్చకు వచ్చేలా ఉద్యమాలను విస్తరించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సందర్భంగా బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షులు గుజ్జ సత్యం మాట్లాడుతూ, నీట్ ఉద్యమం స్ఫూర్తిగా బీసీల రాజ్యాంగబద్ధమైన హక్కుల సాధన కోసం దేశవ్యాప్తంగా జెన్ జీ తరహాలో డిజిటల్



ప్రజా ఉద్యమాన్ని నిర్మించాల్సిన అవసరం ఉందన్నారు. సోషల్ మీడియాను వినోదానికి మాత్రమే కాకుండా బీసీ హక్కుల సాధనకు వినియోగించాలని సూచించారు. జెన్ జీ అంటే కేవలం ఒక వయో వర్గం కాదని, అన్యాయాన్ని ప్రశ్నించే ఆలోచనకు ప్రతీక అని పేర్కొన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఉద్యమాలు రోడ్లకే పరిమితం కాకుండా సోషల్ మీడియా వేదికలపైనా సమాన బలంతో కొనసాగాలని, నేటి యువత చేతిలో ఉన్న మొబైల్ ఫోన్ ప్రజాస్వామ్యంలో మార్పు తీసుకురాగల శక్తివంతమైన సాధనమని గుజ్జ సత్యం అన్నారు. బీసీ యువత డిజిటల్ ప్రపంచంలో తమ స్వరాన్ని బలంగా వినిపించి హక్కుల సాధనలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఏఐసీసీ నాయకులు కత్తి వెంకటస్వామి, బీసీ జేఏసీ వైస్ చైర్మన్ విజెఆర్ నారగోని, మన ఆలోచన సాధన సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు కటకం నర్సింగరావు, బీజేపీ రాష్ట్ర కన్వీనర్ కర్నాటి ధనుంజయ్, బీసీ సంఘం మహిళా విభాగం జాతీయ ఉపాధ్యక్షురాలు మట్ట జయంతి గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాత ఫీజు రీయంబర్స్మెంట్ బకాయిలన్నింటినీ వెంటనే విడుదల చేయాల్సిందే

- **బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగం గౌడ్ డిమాండ్**

**హైదరాబాద్ వెలుతురు జూలై 28:**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ రోజు ఢిల్లీలో మీడియాతో మాట్లాడుతూ గత ప్రభుత్వం ₹8,000 కోట్ల ఫీజు రీయంబర్స్మెంట్ బకాయిలను వదిలి వెళ్లిందని, వాటిపై విజిలెన్స్ నివేదిక తెప్పించుకుంటామని చెప్పడం బాధాకరమని బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగం గౌడ్ అన్నారు.ఒక ముఖ్యమంత్రిగా గత ప్రభుత్వాల కాలంలో ఉన్న పన్నులు, బకాయిలను ప్రభుత్వం వసూలు చేస్తుంది. అలాగే రాష్ట్రానికి చెల్లించాల్సిన బాధ్యతలైన ఫీజు రీయంబర్స్మెంట్ బకాయిలను కూడా ప్రభుత్వం తప్పనిసరిగా చెల్లించాల్సిందేనని ఆయన పేర్కొన్నారు.పాత ఫీజు రీయంబర్స్మెంట్ బకాయిలను విడుదల చేయకుండా వాటిని ఎగ్గొట్టే విధంగా వ్యాఖ్యలు చేయడం సమంజసం కాదన్నారు. విజిలెన్స్ పేరుతో విద్యార్థులను మరింత ఇబ్బందులకు గురిచేయకుండా,



పెండింగ్లో ఉన్న ఫీజు రీయంబర్స్మెంట్ బకాయిలన్నింటినీ వెంటనే విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు.విద్యార్థుల భవిష్యత్తు దృష్ట్యా రాజకీయాలకు అతీతంగా ప్రభుత్వం స్పందించి, పాత బకాయిలను చెల్లించిన అనంతరం ఇతర అంశాలపై నిర్ణయాలు తీసుకోవాలని బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగం గౌడ్ కోరారు.

# వర్షపు నీటిని ఒడిసిపట్టి భూగర్భ జలాలను పెంచడమే లక్ష్యం

- జలసిరి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి.
- ఇంకుడు గుంతల నిర్మాణానికి ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా ముందుకు రావాలి.
- రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క.





**ములుగు జిల్లా. వెలుతురు జూలై 28:**

వర్షపు నీటిని ఒడిసిపట్టి భూగర్భ జలాలను పెంపొందించడమే ముఖ్య లక్ష్యమని, రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన జలసిరి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని, ఇంకుడు గుంతల నిర్మాణానికి ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా ముందుకు రావాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క అన్నారు.మంగళవారం ములుగు ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన ములుగు మండల సర్వసభ్య సమావేశంతో పాటు జలసిరి అవగాహన సదస్సుకు రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా మంత్రి అనసూయ సీతక్క మాట్లాడుతూ, గ్రామాల సమస్యలను మండల స్థాయిలో చర్చించి వెంటనే పరిష్కరించేందుకు మండల సర్వసభ్య సమావేశాలు సమర్థవంతమైన వేదికగా నిలుస్తాయని అన్నారు. ప్రతి రెండు నెలలకు ఒకసారి మండల సర్వసభ్య సమావేశాలు నిర్వహించి గ్రామాల అభివృద్ధికి అవసరమైన అంశాలపై చర్చించి పరిష్కార మార్గాలను రూపొందిస్తామని తెలిపారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు, సర్పంచులు సమన్వయంతో పనిచేసి గ్రామాభివృద్ధికి తోడ్పాటు అందించాలని సూచించారు.ఎల్ నినో ప్రభావంతో ఏర్పడే వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని రాష్ట్ర ప్రభుత్వం జలసిరి కార్యక్రమాన్ని ప్రారంభించిందని తెలిపారు. "ఇంటింటికి ఇంకుడు గుంత – ఊరి కోసం ఊటకుంట – పంట కోసం పంటకుంట" అనే నినాదంతో ప్రతి గ్రామంలో వర్షపు నీటిని ఒడిసిపట్టి భూగర్భ జలాలను పెంపొందించేలా విస్తృతంగా పనులు చేపట్టాలని సూచించారు. నీటి ఎద్దడిని తగ్గించేందుకు జలసిరి కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ మన ఇంటి సిరిగా భావించి భాగస్వాములు కావాలని కోరారు.రాబోయే రెండు రోజుల్లో గ్రామసభలు నిర్వహించి, ఉపాధి హామీ పథకం కింద చేపట్టాల్సిన అభివృద్ధి పనులను గ్రామస్థాయిలోనే తీర్మానించుకోవాలని సూచించారు. గ్రామ పంచాయతీ భవనాలు, మహిళా సంఘాల భవనాలు, అంగన్‌వాడీ కేంద్రాలు, రైతుల పొలాల్లో వ్యక్తిగత ఆస్తుల అభివృద్ధి పనులు, పశువుల పాకలు, మిల్క్ షెడ్లు, పంటకుంటల నిర్మాణానికి ప్రాధాన్యం ఇవ్వాలని అన్నారు. మహిళా సంఘాల సభ్యులు, మహిళా రైతులు జలసిరి కార్యక్రమంలో స్వచ్ఛందంగా భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

గ్రామాల్లో నిర్మాణ దశలో ఉన్న మహిళా సంఘాల భవనాలు మహిళల ఆత్మగౌరవానికి ప్రతీకలుగా నిలుస్తాయని, వాటి నిర్మాణ పురోగతిపై స్థానిక సర్పంచులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు.ప్రస్తుత వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా రైతులు ఆరుతడి పంటల సాగుకు ప్రాధాన్యం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. అవసరానికి మించి నీటిని వినియోగించకుండా, అందుబాటులో ఉన్న నీటిని పొదుపుగా వినియోగించుకోవాలని సూచించారు. ప్రకృతి పరిస్థితులకు అనుగుణంగా పంటలను ఎంపిక చేసుకుంటే నష్టాలను నివారించవచ్చని అన్నారు. ఉపాధి హామీ పథకం ద్వారా జలసిరి పనులకు ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని తెలిపారు.అన్ని శాఖల అధికారులు ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ జవాబుదారీతనంతో పని చేయాలని ఆదేశించారు. గ్రామసభల ద్వారా ప్రజల అవసరాలను గుర్తించి అభివృద్ధి ప్రణాళికలు రూపొందించాలని, ప్రతి గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దేందుకు ప్రజాప్రతినిధులు, అధికారులు, మహిళా సంఘాలు, రైతులు సమిష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు.అనంతరం మంత్రి అనసూయ సీతక్క జలసిరి కార్యక్రమ పోస్టర్ ను ఆవిష్కరించారు.

అంతకుముందు మల్లంపల్లి మండలం ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన మల్లంపల్లి మండల సర్వసభ్య సమావేశానికి మంత్రి అనసూయ సీతక్క ముఖ్యఅతిథిగా హాజరయ్యారుఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు ఎం. సంపత్ రావు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోతు రవిచందర్, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ రేగ కళ్యాణి, పంచాయతీరాజ్ డైరెక్టర్ భగవాన్ రెడ్డి, ఆత్మ కమిటీ ఛైర్మన్ రవీందర్ రెడ్డి, మండల ప్రత్యేక అధికారి కొమురయ్య, ఎంపీడీవో సందీప్, రహీం వివిధ గ్రామాల సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, స్థానిక ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# 169 బూత్ లో కలిసి ఉన్న గుండ్లోరిగూడెం గ్రామ 54 ఓట్లను 172 బూత్ కు మార్చుతామని హామీ ఇచ్చిన ఎమ్మార్వో నరేష్

**మునుగోడు వెలుతురు జూలై 28:**




స్పెషల్ ఇంటెన్సీవ్ రివిజన్ (SIR) కార్యక్రమంలో భాగంగా మునుగోడు గ్రామ పంచాయతీ లోని 169 బూత్ లో కలిసి ఉన్న గుండ్లోరిగూడెం గ్రామ 54 ఓట్లను గుండ్లోరిగూడెం గ్రామ 172 బూత్ కు మార్చాలని బిఎల్ఓ రజినీతో కలిసి మునుగోడు ఎమ్మార్వో నరేష్ గారికి వినతి పత్రం అందజేసిన కాంగ్రెస్ మండల నాయకులు జంగిలి నాగరాజు, మార్చుతామని హామీ ఇచ్చిన ఎమ్మార్వో నరేష్ గారు.

# సాంకేతిక పరిశ్రమల ఏర్పాటుకు అనుకూలంగా తెలంగాణ ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి స్కైరూట్ ఏరోస్పేస్ వ్యవస్థాపకులకు అభినందనలు

**ఢిల్లీ వెలుతురు జూలై 28:**



అత్యాధునిక సాంకేతిక పరిశ్రమలు, స్టార్టప్‌ల ఏర్పాటుకు అనుకూల వాతావరణం కల్పించేందుకు తెలంగాణ ప్రభుత్వం కట్టుబడి ఉందని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అన్నారు. స్కైరూట్ ఏరోస్పేస్ సహ వ్యవస్థాపకుడు, ముఖ్య కార్యనిర్వహణ అధికారి (సీఈఓ) పవన్ కుమార్ చందన, సహ వ్యవస్థాపకుడు, ముఖ్య నిర్వహణ అధికారి (సీఓఓ) నాగ భరత్ డాకా ఢిల్లీలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. భారతదేశంలోనే ప్రైవేటు రంగం అభివృద్ధి చేసిన తొలి ఆర్బిటల్-క్లాస్ ప్రయోగ వాహనం విక్రమ్-1ను విజయవంతంగా ప్రయోగించిన తీరును వారు ముఖ్యమంత్రికి వివరించారు. ఈ విజయంతో అమెరికా, చైనా తర్వాత ప్రైవేటు రంగం ద్వారా ఆర్బిటల్ ప్రయోగ సామర్థ్యాన్ని సాధించిన ప్రపంచంలోని మూడో దేశంగా భారత్ నిలిచిందని తెలిపారు. సమావేశంలో తెలంగాణలో వేగంగా అభివృద్ధి చెందుతున్న ఏరోస్పేస్, అంతరిక్ష సాంకేతిక రంగాల పురోగతి, ఆవిష్కరణలు, అధునాతన తయారీ, పరిశోధన-అభివృద్ధి (ఆర్ అండ్ డీ), ప్రభుత్వం-ప్రైవేటు అంతరిక్ష పరిశ్రమల మధ్య సహకార అవకాశాలపై చర్చ జరిగింది. ఈ సందర్భంగా స్కైరూట్ ఏరోస్పేస్ వ్యవస్థాపకులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభినందించారు. వారు సాధించిన విజయం భారత దేశాన్ని ప్రపంచ అంతరిక్ష రంగంలో మరింత ఉన్నత స్థాయికి తీసుకెళుతుందని ప్రశంసించారు.

# ప్రభుత్వ ఆసుపత్రుల్లో అత్యాధునిక నేత్ర వైద్య సేవలు

- ప్రతి పౌరుడికి నాణ్యమైన కంటి వైద్య సేవలు
- ప్రభుత్వ ఆసుపత్రుల్లో నేత్ర వైద్య సేవల బలోపేతానికి ఎల్‌వీ ప్రసాద్ ఐ ఇన్‌స్టిట్యూట్‌తో భాగస్వామ్యం

**హైదరాబాద్ వెలుతురు జూలై 28:**



ప్రజలకు నాణ్యమైన కంటి వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి శ్రీ దామోదర్ రాజనర్సింహ. రాష్ట్రం లోని 35 ప్రభుత్వ వైద్య కళాశాలల్లో నేత్ర వైద్య విభాగాలు ప్రజలకు ప్రత్యేక వైద్య సేవలను అందిస్తున్నాయన్నారు. ప్రభుత్వ ఆసుపత్రులలో కంటి పరీక్షలు, ఆప్టోమెట్రీ సేవలు, శుక్లాల (క్యాటరాక్ట్) శస్త్రచికిత్సలు క్రమం తప్పకుండా నిర్వహిస్తున్నారు.హైదరాబాద్‌లోని సరోజిని దేవి కంటి ఆసుపత్రి రాష్ట్రంలో నేత్ర వైద్యానికి అత్యున్నత కేంద్రంగా సేవలందిస్తోందన్నారు. రెటీనా శస్త్రచికిత్సలు, లేజర్ చికిత్సలు, మెల్లకన్ను (స్క్వింట్) శస్త్రచికిత్సలు, కార్నియా మార్పిడి, కంటి క్యాన్సర్‌కు సంబంధించిన చికిత్సలు, ప్లాస్టిక్ సర్జరీలు, గ్లాకోమా చికిత్సలు వంటి అత్యాధునిక వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయన్నారు మంత్రి దామోదర్ రాజనర్సింహ.రాష్ట్రవ్యాప్తంగా కంటి వైద్య సేవల రిఫరల్ వ్యవస్థను మరింత బలోపేతం చేయాలనే లక్ష్యంతో జిల్లా స్థాయి ప్రభుత్వ బోధన ఆసుపత్రుల్లో ప్రత్యేక నేత్ర శస్త్రచికిత్స ఆపరేషన్ థియేటర్లు, అవసరమైన వైద్య పరికరాలను ఏర్పాటు చేయడానికి ఆరోగ్య, వైద్య మరియు కుటుంబ సంక్షేమ శాఖ ఇప్పటికే అవసరమైన ప్రణాళికలను (గ్యాప్ అసెస్‌మెంట్) రూపొందించామన్నారు. ఈ పనులను దశలవారీగా అమలు చేయడానికి వైద్య శాఖ సమాయత్తమైందన్నారు.ప్రభుత్వ ఆసుపత్రుల్లో నేత్ర వైద్య సేవల బలోపేతానికి ఎల్‌వీ ప్రసాద్ ఐ ఇన్‌స్టిట్యూట్ భాగస్వామ్యం తో భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఎల్‌వీ ప్రసాద్ ఐ ఇన్‌స్టిట్యూట్ సహకారంతో అమలు చేస్తున్న నవజాత శిశువుల కంటి పరీక్షల పైలట్ కార్యక్రమాన్ని దశలవారీగా ఇతర జిల్లాలకు విస్తరించడం పై చర్చించారు. ఈ సందర్భంగా ఆరోగ్య, వైద్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి శ్రీ దామోదర్ రాజనర్సింహ గారు ఎల్‌వీ ప్రసాద్ ఐ ఇన్‌స్టిట్యూట్ అందిస్తున్న సేవలను అభినందించారు.కార్నియా దానాలను ప్రోత్సహించేందుకు ప్రాంతీయ కార్నియా సేకరణ కేంద్రాలు (ఐ బ్యాంకులు) ఏర్పాటు చేసే అంశాన్ని ఎల్‌వీ ప్రసాద్ ఐ ఇన్‌స్టిట్యూట్‌తో కలిసి పరిశీలించడం.ఆర్‌బీఎస్‌కే (RBSK) సిబ్బందికి శిక్షణ అందించడం ద్వారా ప్రభుత్వ రెసిడెన్షియల్ పాఠశాలల విద్యార్థులకు మెరుగైన కంటి పరీక్షలు, ఆప్టోమెట్రీ సేవలు అందించడం.ప్రభుత్వ బోధన ఆసుపత్రులు మరియు ఎల్‌వీ ప్రసాద్ ఐ ఇన్‌స్టిట్యూట్ మధ్య భాగస్వామ్య అవకాశాలను గుర్తించేందుకు ఆగస్టు నెలలో ప్రత్యేక వర్క్‌షాప్ నిర్వహిస్తున్నట్లు మంత్రి దామోదర్ రాజనర్సింహ గారు వెల్లడించారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి డా క్రిస్టినా జెడ్ చొంగ్తు, DME డాక్టర్ నరేంద్ర కుమార్, డైరెక్టర్ పబ్లిక్ హెల్త్ డా రవీందర్ నాయక్, LV ప్రసాద్ కంటి ఆసుపత్రి ప్రతినిధులు పాల్గొన్నారు.

# విద్యార్థులను బడిబాట పట్టిస్తున్న ఉపాధ్యాయుడు గురిజ మహేష్

**నాంపల్లి వెలుతురు జూలై 28:**




నాంపల్లి మండలం దామెర గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయుడు గురిజ మహేష్ విద్యార్థుల హాజరు పెంపుపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. చిన్నచిన్న కారణాలతో పాఠశాలకు హాజరుకాని విద్యార్థుల ఇళ్లకు స్వయంగా వెళ్లి, వారి తల్లిదండ్రులతో మాట్లాడి విద్య ప్రాధాన్యాన్ని వివరిస్తున్నారు.ప్రతిరోజూ పాఠశాలకు హాజరుకావడం వల్ల విద్యార్థుల చదువులో పురోగతి, క్రమశిక్షణ, వ్యక్తిత్వ వికాసం మెరుగుపడతాయని ఆయన తల్లిదండ్రులకు తెలియజేస్తున్నారు. అలాగే తరచూ పాఠశాలకు గైర్హాజరవడం వల్ల చదువులో వెనుకబడే అవకాశం, పాఠ్యాంశాలపై పట్టు తగ్గిపోవడం వంటి నష్టాలను వివరించి అవగాహన కల్పిస్తున్నారు.తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రతిరోజూ తప్పనిసరిగా పాఠశాలకు పంపేలా ప్రోత్సహిస్తూ, విద్యార్థులను తిరిగి పాఠశాలకు తీసుకువస్తూ ఆదర్శ ఉపాధ్యాయుడిగా నిలుస్తున్నారు.

# 500 స్పెషలిస్ట్ డాక్టర్ పోస్టుల ఫలితాలు విడుదల

**హైదరాబాద్ వెలుతురు జూలై 28:**

డైరెక్టరేట్ ఆఫ్ సెకండరీ హెల్త్ కేర్ (తెలంగాణ వైద్య విధాన పరిషత్) పరిధిలోని ప్రభుత్వ హాస్పిటళ్లలో స్పెషలిస్ట్ డాక్టర్ పోస్టుల ఫలితాలు విడుదల అయ్యాయి. జనరల్ సర్జరీ, జనరల్ మెడిసిన్, ఆర్థోపెడిక్స్, రేడియాలజీ విభాగాల్లోని మొత్తం 500 పోస్టులకు సంబంధించిన ఫలితాలను మెడికల్ అండ్ హెల్త్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డు (MHSRB) మంగళవారం విడుదల చేసింది.డైరెక్టరేట్ ఆఫ్ సెకండరీ హెల్త్ కేర్ పరిధిలోని హాస్పిటళ్లలో స్పెషలిస్ట్ డాక్టర్ల కొరతను అధిగమించి, ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం మొత్తం 1,616 సివిల్ అసిస్టెంట్ సర్జన్ (స్పెషలిస్ట్) పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ జారీ చేసిన విషయం తెలిసిందే. ఇందులో అనస్థీషియా, గైనకాలజీ, పీడియాట్రిక్స్, ఆర్థోపెడిక్స్ విభాగాలకు సంబంధించిన 692 పోస్టుల భర్తీ ప్రక్రియ ఇప్పటికే పూర్తయింది. ఎంపికైన అభ్యర్థులకు ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ నియామక పత్రాలు అందజేయగా, అధికారులు ఇటీవలే వారికి పోస్టింగ్స్ కూడా ఇచ్చారు.తాజాగా జనరల్ సర్జరీ – 174, జనరల్ మెడిసిన్ – 166, ఆర్థోపెడిక్స్ – 89, రేడియాలజీ – 71 చొప్పున మొత్తం 500 పోస్టులకు సంబంధించిన ఫలితాలను ఎంహెచ్‌ఆర్‌బీ విడుదల చేసింది. ప్రొవిజనల్ మెరిట్ లిస్ట్ విడుదల అనంతరం అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన పూర్తి చేసి, తుది ఫలితాలను ప్రకటించింది.ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థుల వివరాలను ఎంహెచ్ఎస్ఆర్‌బీ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్లు అధికారులు తెలిపారు.ఈ పోస్టులకు ఎంపికైన డాక్టర్లకు ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అభినందనలు తెలిపారు. ప్రభుత్వ హాస్పిటళ్లకు వచ్చే పేద, మధ్యతరగతి ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడంలో నూతనంగా ఎంపికైన స్పెషలిస్ట్ డాక్టర్లు అంకితభావంతో పనిచేయాలని ఆకాంక్షించారు.ప్రభుత్వ హాస్పిటళ్లలో స్పెషలిస్ట్ డాక్టర్ల కొరత లేకుండా చూడాలన్న ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా, 24 విభాగాల్లో 1,616 స్పెషలిస్ట్ డాక్టర్ పోస్టులను భర్తీ చేస్తున్నామని మంత్రి గుర్తు చేశారు. నేటితో 1192 పోస్టుల భర్తీ ప్రక్రియ పూర్తయిందని తెలిపారు. మిగిలిన పోస్టుల భర్తీ ప్రక్రియను కూడా సాధ్యమైనంత త్వరగా పూర్తి చేయాలని రిక్రూట్‌మెంట్ బోర్డు అధికారులను మంత్రి ఆదేశించారు.

# కరీంనగర్ జిల్లా ఉపసర్పంచ్‌ల ఫోరం ఆధ్వర్యంలో అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పణ

**కరీంనగర్, వెలుతురు జూలై 28:**



కరీంనగర్ జిల్లా ఉపసర్పంచ్‌ల ఫోరం అధ్యక్షులు ఆకుబత్తిని విజయ్ కుమార్ అధ్యక్షతన ఈ రోజు కరీంనగర్ జిల్లా ఉపసర్పంచులు అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి గారిని కలిసి ఉపసర్పంచుల హక్కులు, బాధ్యతలు మరియు స్థానిక సంస్థల్లో వారి పాత్రను బలోపేతం చేయడానికి అవసరమైన పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని సమర్పించారు.

**ఈ సందర్భంగా వారు ప్రధానంగా క్రింది డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు:**

1. ఉపసర్పంచ్‌లకు నెలకు ₹5,000 గౌరవ వేతనం, వార్డ్ సభ్యులకు ₹3,000 గౌరవ వేతనం మంజూరు చేయాలి.
2. గ్రామపంచాయతీ అభివృద్ధి పనులకు సంబంధించిన శిలాఫలకాలపై ఉపసర్పంచ్‌లు మరియు సంబంధిత స్థానిక వార్డ్ సభ్యుల పేర్లు తప్పనిసరిగా ముద్రించాలి.
3. గ్రామపంచాయతీ స్టాండింగ్ కమిటీలలో ఉపసర్పంచ్‌లను వైస్ చైర్మన్‌లుగా ప్రకటించాలి.
4. గ్రామపంచాయతీ తీర్మానాలపై ఉపసర్పంచ్‌ల సంతకాలను తప్పనిసరి చేయాలి.

అదనంగా, ఉపసర్పంచ్‌లకు చట్టపరంగా కల్పించిన హక్కులను పరిరక్షిస్తూ, గ్రామాభివృద్ధిలో వారికి తగిన గుర్తింపు, అధికారాలు మరియు గౌరవం కల్పించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి దుస్స కుమార్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజిరెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షులు నవీన్ గౌడ్, అలాగే కరీంనగర్ జిల్లాకు చెందిన వివిధ మండలాల ఉపసర్పంచ్‌ల ఫోరం అధ్యక్షులు మరియు ఉపసర్పంచులు పాల్గొన్నారు.

# కరీంనగర్ నగరపాలక సంస్థ పరిధిలో ఘనంగా ప్రారంభమైన 'వన మహోత్సవం'

**కరీంనగర్ వెలుతురు జూలై 28:**





కరీంనగర్ నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో నగరాన్ని పచ్చదనంతో నింపే లక్ష్యంతో చేపట్టిన 'వన మహోత్సవం' కార్యక్రమాన్ని 53వ డివిజన్ సాయి నగర్‌లో నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ గారు ఘనంగా ప్రారంభించారు. నగరాన్ని కేవలం 'క్లీన్ సిటీ'గానే కాకుండా క్లీన్ అండ్ గ్రీన్ సిటీగా తీర్చిదిద్దడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని నగర మేయర్ తెలిపారు.వన మహోత్సవం ప్రారంభోత్సవంలో భాగంగా సాయి నగర్‌లో ఒకే రోజు సుమారు 500 మొక్కలను నాటారు. నగరవ్యాప్తంగా ప్రతి ఇంటికి రెండు చొప్పున పూల లేదా పండ్ల మొక్కలను పంపిణీ చేయాలని నిర్ణయించారు. ఈ కార్యక్రమం ద్వారా నగరంలోని గృహాలకు 3 లక్షల మొక్కలను పంపిణీ చేయడంతో పాటు, వివిధ డివిజన్లలో సుమారు లక్ష మొక్కలను నాటే లక్ష్యాన్ని నగరపాలక సంస్థ నిర్దేశించుకుంది.ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ, ఈ సంవత్సరం ఎల్‌నినో ప్రభావం కారణంగా వర్షపాతం తగ్గే అవకాశం ఉందని, భవిష్యత్తులో పర్యావరణ సమతుల్యతను కాపాడుకోవాలంటే ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని పిలుపునిచ్చారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్న అనుకూల సమయంలో మొక్కలు నాటితే అవి సులభంగా పెరిగే అవకాశముందని పేర్కొన్నారు.నగర ప్రజలందరూ స్వచ్ఛందంగా ముందుకు వచ్చి మొక్కలు నాటి వాటిని సంరక్షిస్తూ, కరీంనగర్‌ను 'క్లీన్ అండ్ గ్రీన్ సిటీ' గా తీర్చిదిద్దేందుకు నగరపాలక సంస్థకు సహకరించాలని మేయర్ విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు కొంపెల్లి శ్వేత రమన్, వంగల పవన్ కుమార్, కాలనీ అధ్యక్షులు, ప్రజాప్రతినిధులు,మహిళలు , స్థానికులు మరియు డివిజన్ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# జపాన్‌లో భారీ భూకంపం

- **తీర ప్రాంతాలకు సునామీ హెచ్చరికలు**
- **చైనాలోనూ ప్రకంపనలతో భయాందోళన**
- **క్యూషు ద్వీపంలో భూకంప కేంద్రం**
- **కుమామోటో ప్రాంతంలో 7.1 తీవ్రత**
- **అత్యవసర హెచ్చరికలు జారీ చేసిన జపాన్ ప్రభుత్వం**

**టోక్యో/బీజింగ్, వెలుతురు, జూలై 28:**



జపాన్ దక్షిణ భాగంలోని ప్రధాన ద్వీపమైన క్యూషులోని కుమామోటో ప్రాంతంలో మంగళవారం భారీ భూకంపం సంభవించి తీవ్ర భయాందోళనలు సృష్టించింది. ఈ భూకంప తీవ్రత రిక్టర్ స్కేలుపై 7.1గా నమోదైనట్లు జపాన్ వాతావరణ శాఖ అధికారులు అధికారికంగా వెల్లడించారు. సముద్ర ఉపరితలానికి కేవలం 10 కిలోమీటర్ల స్వల్ప లోతులోనే భూమి అంతర్భాగంలో ప్రకంపనలు ప్రారంభమవ్వడం వల్ల ప్రభావం తీవ్రంగా ఉందని తెలిపారు. ఈ ప్రమాదానికి సంబంధించి జరిగిన ఆస్తి, ప్రాణ నష్టాల వివరాలు ఇంకా పూర్తిస్థాయిలో వెల్లడి కావాల్సి ఉంది.భూకంప తీవ్రత దృష్ట్యా జపాన్ ప్రభుత్వం తక్షణమే స్పందించి నాగసాకి, కగోషిమా, సాగా, ఓయిటా, మియాజాకి ప్రాంతాలకు అత్యవసర భూకంప మరియు సునామీ హెచ్చరికలను జారీ చేసింది. సముద్ర తీర ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలు ఏమాత్రం ఆలస్యం చేయకుండా వెంటనే సురక్షిత ప్రాంతాలకు, ఎత్తైన ప్రదేశాలకు తరలివెళ్లాలని అధికారులు ఆదేశించారు. సముద్ర అలల ఉద్ధృతి పెరిగే అవకాశం ఉన్నందున తీర ప్రాంతవాసులు అప్రమత్తంగా ఉండాలని స్పష్టం చేశారు.సుమారు మూడు అడుగుల ఎత్తులో సునామీ అలలు వచ్చే అవకాశం ఉందని, ప్రజల ప్రాణరక్షణే తమకు అత్యంత ముఖ్యమని జపాన్ ప్రధాని సనాయే తకాయిచి సోషల్ మీడియా వేదికగా పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో పౌరుల భద్రత కోసం క్యూషు ప్రాంతంలో తిరిగే ప్రతిష్టాత్మక బుల్లెట్ రైళ్లతో పాటు స్థానిక రైలు సేవలను కూడా తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు ప్రకటించారు. పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించేందుకు, ప్రమాద ప్రాంతాల్లో రక్షణ, సహాయక చర్యలను వేగవంతం చేసేందుకు ప్రత్యేక టాస్క్ ఫోర్స్‌ను ఏర్పాటు చేసినట్లు ప్రధాని కార్యాలయం తెలిపింది.భూకంపం సంభవించిన ప్రాంతాల్లో ఎంతమేరకు నష్టం జరిగిందనే అంశాన్ని ఖచ్చితంగా అంచనా వేయాలని ప్రధాని కార్యాలయం ఉన్నతాధికారులను ఆదేశించింది. క్షేత్రస్థాయి పరిస్థితిని త్వరితగతిన పరిశీలించేందుకు జపాన్ రక్షణ మంత్రిత్వ శాఖ రంగంలోకి దిగి, ప్రభావిత ప్రాంతాలపైకి ప్రత్యేక విమానాలను పంపింది. వైమానిక సర్వే ద్వారా దెబ్బతిన్న భవనాలు, రోడ్లు, ఇతర మౌలిక వసతులను గుర్తించి సహాయక బృందాలను అక్కడికి తరలించే ఏర్పాట్లు చేస్తున్నారు.జపాన్‌ను గతంలో కూడా పలుమార్లు భూకంపాలు కోలుకోలేని దెబ్బతీశాయి. 2011లో సంభవించిన 9.0 తీవ్రతతో కూడిన అత్యంత విధ్వంసకర భూకంపం, ఆ తర్వాతి సునామీ వల్ల దాదాపు 18,500 మంది ప్రాణాలు కోల్పోయారు. అలాగే 2016లో కుమామోటో ప్రాంతంలో వచ్చిన భూకంపానికి 50 మందికి పైగా మరణించగా 1,800 మంది గాయపడ్డారు. ఈ ఏడాది ఏప్రిల్ 20న ఉత్తర జపాన్‌లో 7.7 తీవ్రతతో, జూన్ 25న 7.2 తీవ్రతతో బలమైన భూకంపాలు సంభవించిన విషయం తెలిసిందే.భౌగోళిక అమరిక రీత్యా ప్రపంచంలోనే అత్యధికంగా భూకంపాలు సంభవించే ప్రమాదకర ప్రాంతాల్లో జపాన్ ఒకటి. సుమారు 125 మిలియన్ల జనాభా ఉన్న ఈ ద్వీపసమూహ దేశంలో ప్రతి సంవత్సరం వందలాది చిన్న, పెద్ద భూకంపాలు సంభవిస్తుంటాయి. ప్రపంచ వ్యాప్తంగా నమోదయ్యే భూకంపాల్లో దాదాపు 18 శాతం జపాన్ పరిధిలోనే జరగడం గమనార్హం. వీటిలో ఎక్కువ భాగం తీవ్రత తక్కువగానే ఉన్నప్పటికీ, అవి సంభవించే లోతును బట్టి కొన్నిసార్లు తీవ్ర నష్టాన్ని కలిగిస్తుంటాయని నిపుణులు వివరిస్తున్నారు.జపాన్‌లో ప్రకంపనలు సంభవించిన సమయంలోనే చైనాలోని మారుమూల ప్రావిన్స్‌లోనూ వరుసగా భూకంపాలు కలకలం సృష్టించాయి. చైనాలోని కింఘై ప్రావిన్స్‌లో మంగళవారం ఉదయం కేవలం 18 నిమిషాల వ్యవధిలోనే రెండుసార్లు భూమి తీవ్రంగా కంపించిందని యునైటెడ్ స్టేట్స్ జియోలాజికల్ సర్వే ధృవీకరించింది. ఉదయం 11:16 గంటలకు 5.7 తీవ్రతతో, తిరిగి 11:34 గంటలకు 5.8 తీవ్రతతో ప్రకంపనలు వచ్చాయని, ఇవి కూడా 10 కిలోమీటర్ల స్వల్ప లోతులోనే చోటుచేసుకున్నాయని పేర్కొంది.జనాభా తక్కువగా ఉండే చైనా వాయువ్య కింఘై ప్రాంతంలో సంభవించిన ఈ భూకంపాలకు సంబంధించిన దృశ్యాలు సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అవుతున్నాయి. భూమి కంపించడంతో కొండచరియల నుంచి దుమ్ము మేఘాల్లా పైకి లేవడాన్ని ప్రజలు తమ కెమెరాల్లో బంధించారు. ఈ భూకంప ప్రభావం పొరుగున ఉన్న గాన్సు ప్రావిన్స్‌లోని ప్రధాన నగరమైన లాన్‌జౌపై కూడా పడింది.

# జార్ఖండ్‌లో మావోయిస్టులకు భారీ దెబ్బ



- **ఒకేసారి 16 మంది లొంగుబాటు**
- **హింసా మార్గానికి స్వస్తి చెప్పిన నేతలు**
- **పునరావాస పథకాలకు ఆకర్షితులైన సభ్యులు**
- **లొంగిపోయిన వారిలో ఆరుగురు కీలక నేతలు**
- **రూ. 39 లక్షల భారీ రివార్డు కలిగిన కేడర్లు**
- **ప్రభుత్వ నిబంధనల ప్రకారం పూర్తి పునరావాసం**
- **లొంగిపోయిన వారికి ఆర్థిక నిధి, సహకారం**
- **ఛత్తీస్‌గఢ్‌లోనూ మరో ఎనిమిది మంది లొంగుబాటు**

**రాంచీ, వెలుతురు, జూలై 28:**

జార్ఖండ్ రాజధాని రాంచీ వేదికగా మావోయిస్టుల నెట్‌వర్క్‌కు తీవ్ర విఘాతం కలిగింది. తీవ్రవాద, హింసాత్మక మార్గాన్ని వీడి, రాజ్యాంగంపై అలాగే ప్రజాస్వామ్య వ్యవస్థపై నమ్మకంతో ఏకంగా 16 మంది మావోయిస్టులు పోలీసు అధికారుల సమక్షంలో లొంగిపోయినట్లు ఉన్నతాధికారులు వెల్లడించారు. ఈ పరిణామం జార్ఖండ్ పోలీస్ శాఖకు మరియు భద్రతా బలగాలకు లభించిన అతిపెద్ద విజయంగా అధికారులు వర్ణించారు.రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఆకర్షణీయమైన పునరావాస పథకాలకు ఆకర్షితులై, శాంతియుత జీవనం గడపాలనే ఉద్దేశంతోనే మావోయిస్టులు ఈ నిర్ణయం తీసుకున్నట్లు పోలీసులు స్పష్టం చేశారు. భద్రతా బలగాలు నిరంతరం చేపడుతున్న వ్యూహాత్మక ఆపరేషన్లు, పెట్రోలింగ్, నిఘా చర్యల వల్ల ఒత్తిడి పెరిగి మావోయిస్టులు ఆయుధాలు వీడి జనజీవన స్రవంతిలోకి వస్తున్నారని అధికారులు తెలిపారు.ఇప్పుడు లొంగిపోయిన 16 మంది మావోయిస్టులలో ఆరుగురు అత్యంత కీలక స్థానాల్లో ఉన్న అగ్రనేతలు కావడం విశేషం. ఈ ఆరుగురిపై ప్రభుత్వం గతంలోనే రూ. 39 లక్షల మేర భారీ రివార్డులను ప్రకటించి ఉంది. తీవ్రమైన నేర విచారణలు, అనేక రకాల హింసాత్మక ఘటనలు మరియు దాడులలో వీరికి ప్రత్యక్ష ప్రమేయం ఉన్నట్లు పోలీసుల రికార్డులు వెల్లడిస్తున్నాయి.ప్రభుత్వ నిబంధనలు, లొంగివేత విధానాలకు అనుగుణంగా ఆయుధాలు త్యజించిన మావోయిస్టులందరికీ తగిన పునరావాస సదుపాయాలు కల్పిస్తామని సీనియర్ పోలీస్ అధికారులు ప్రకటించారు. వారికి తక్షణ ఆర్థిక సహాయం అందించడంతో పాటు సమాజంలో శాంతియుతంగా, గౌరవప్రదంగా జీవించేందుకు ప్రభుత్వం తరపున అన్ని విధాలా పూర్తి సహకారం అందిస్తామని స్పష్టం చేశారు.పొరుగు రాష్ట్రమైన ఛత్తీస్‌గఢ్‌లో కూడా మావోయిస్టులకు గట్టి ఎదురుదెబ్బ తగిలిందని, అక్కడ మరో ఎనిమిది మంది మావోయిస్టులు లొంగిపోయారని జార్ఖండ్ పోలీస్ ఐజీ (ఆపరేషన్స్) నరేంద్ర కుమార్ సింగ్ మీడియాకు వివరించారు. లొంగిపోయిన ఈ బృందంలో రూ. 15 లక్షల భారీ రివార్డు కలిగిన ఒక కీలకమైన కేంద్ర కమిటీ సభ్యుడు కూడా ఉన్నారని ఆయన వెల్లడించారు.తాజాగా లొంగిపోయిన వారి జాబితాలో ముగ్గురు జోనల్ కమిటీ సభ్యులు, ముగ్గురు సబ్-జోనల్ కమిటీ సభ్యులు మరియు ఆరుగురు ఏరియా కమిటీ సభ్యులు ఉన్నారని ఐజీ తెలిపారు. సంస్థలో కీలక బాధ్యతలు నిర్వహించే స్థానిక, ప్రాంతీయ నేతలు ఇలా పెద్ద సంఖ్యలో బయటకు రావడం వల్ల సాయుధ మావోయిస్టు నెట్‌వర్క్ ఆ ప్రాంతంలో దాదాపు కూలిపోయిందని విశ్లేషకులు భావిస్తున్నారు.ఈ రోజు జార్ఖండ్ పోలీసుల చరిత్రలోనే ఒక గుర్తుండిపోయే రోజు అని, ఇది పోలీసు శాఖ సాధించిన మహత్తర విజయమని ఐజీ నరేంద్ర కుమార్ సింగ్ కొనియాడారు. రాష్ట్రంలో మావోయిస్టుల కార్యకలాపాలు దాదాపుగా అంతమొందించబడ్డాయని ఆయన ధీమా వ్యక్తం చేశారు. నిరంతర ఆపరేషన్ల వల్ల విద్రోహ శక్తుల బలం పూర్తిగా క్షీణించిందని చెప్పారు.ఇంకా అక్కడక్కడా కొందరు మావోయిస్టులు చురుకుగా ఉంటూ అటవీ ప్రాంతాల్లో కదలికలు సాగిస్తున్నారని, వారి ఆచూకీ కోసం భద్రతా బలగాలు నిరంతర శోధన చర్యలు (కూంబింగ్) కొనసాగిస్తున్నాయని ఐజీ స్పష్టం చేశారు. అజ్ఞాతంలో ఉన్న మావోయిస్టులు ఏమాత్రం ఆలస్యం చేయకుండా తక్షణమే లొంగిపోవాలని ఆయన పిలుపునిచ్చారు. లొంగిపోని పక్షంలో పోలీసు ఎదురుకాల్పులు, వ్యూహాత్మక ఆపరేషన్ల సమయంలో ప్రాణాలు కోల్పోక తప్పదని హెచ్చరించారు.

# ఇరాన్‌పై దాడులకు విరామం

- **అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటన**
- **తెహ్రాన్ విజ్ఞప్తితో చర్చలకు ప్రణాళిక**
- **దౌత్యపరమైన చర్చలకు అవకాశం**
- **ఒప్పందం కుదరకపోతే మళ్లీ చర్యలు**
- **రెండు వారాల దాడుల తర్వాత విరామం**
- **అమెరికా ప్రభుత్వం అంతర్గత సమీక్ష**

**వాషింగ్టన్, వెలుతురు, జూలై 28:**

ఇరాన్‌పై చేపట్టిన సైనిక దాడులను తాత్కాలికంగా నిలిపివేయడానికి తెహ్రాన్ నుంచి వచ్చిన విజ్ఞప్తే ప్రధాన కారణమని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ స్పష్టం చేశారు. ఎయిర్‌ఫోర్స్ వన్ విమానంలో మీడియాతో మాట్లాడిన ఆయన, "దయచేసి దాడులు ఆపి సమావేశమై మాట్లాడుకుందాం" అని ఇరాన్ తమను కోరిందని వెల్లడించారు. తాము చేపట్టిన తీవ్రమైన వైమానిక దాడుల వల్లే ఇరాన్ దిగివచ్చి చర్చలకు ముందుకొచ్చిందని, తమ బలహీనత వల్ల ఈ విరామం రాలేదని ఆయన పేర్కొన్నారు.ప్రస్తుతం ఇరాన్‌తో చర్చలు సానుకూల వాతావరణంలో సాగుతున్నాయని, పరిస్థితులు మంచి దిశగా వెళ్లే అవకాశం ఉందని ట్రంప్ వ్యాఖ్యానించారు. అయితే, ప్రస్తుతం దౌత్యపరమైన పరిష్కారానికే ప్రాధాన్యం ఇస్తున్నప్పటికీ, ఒకవేళ ఈ చర్చలు విఫలమైతే లేదా ఒప్పందం కుదరకపోతే మళ్లీ మునుపటిలాగే తీవ్రమైన సైనిక చర్యలను ప్రారంభిస్తామని హెచ్చరించారు. చర్చల ఫలితాన్ని బట్టే అమెరికా తదుపరి వ్యూహం ఉంటుందని ఆయన తేల్చిచెప్పారు.దాదాపు రెండు వారాల పాటు ఇరాన్‌పై అమెరికా దళాలు శతాధిక వైమానిక దాడులను విరామం లేకుండా కొనసాగించాయి. దీని తర్వాత సైనిక చర్యలను మరింత విస్తరించాలా లేదా దౌత్య మార్గాన్ని ఎంచుకోవాలా అన్న అంశంపై అమెరికా ప్రభుత్వం అంతర్గతంగా తీవ్ర స్థాయిలో సమీక్ష నిర్వహించింది. ఈ సమీక్షా సమావేశం తర్వాతే దాడులకు తాత్కాలిక విరామం ప్రకటించాలని అమెరికా తుది నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం.సుదీర్ఘ పోరాటం వల్ల ఆయుధ నిల్వలు తగ్గుతాయన్న వార్తలను ట్రంప్ కొట్టిపారేశారు. అమెరికా వద్ద క్షిపణులు, రక్షణ సామగ్రి అత్యంత సమృద్ధిగా ఉన్నాయని స్పష్టం చేశారు. అవసరమైన దానికంటే ఎక్కువ పరిమాణంలోనే మందుగుండు సామగ్రి సిద్ధంగా ఉందన్నారు. ముఖ్యంగా అత్యంత శక్తివంతమైన పేట్రియాట్ క్షిపణి వ్యవస్థల ఉత్పత్తిని మరింత వేగవంతం చేస్తున్నామని, రక్షణ సన్నాహాల్లో ఎలాంటి లోటూ లేదని చెప్పారు.ఇదే సమయంలో పూర్వ అధ్యక్షుడు జో బైడెన్ హయాంలో అనుసరించిన సైనిక విధానాలను ట్రంప్ తీవ్రంగా తప్పుపట్టారు. గత ప్రభుత్వం ఉక్రెయిన్‌కు పెద్దఎత్తున అమెరికా ఆయుధ నిల్వలను పంపడం వల్ల దేశీయంగా కొన్ని ఇబ్బందులు తలెత్తాయని విమర్శించారు. ప్రస్తుత ప్రభుత్వం అమెరికా మిలిటరీ సమ్మర్థతకు, ఆయుధ నిల్వల భద్రతకే మొదటి ప్రాధాన్యం ఇస్తుందని ఆయన స్పష్టం చేశారు.యుద్ధం మరింత విస్తరించడం వల్ల తలెత్తే తీవ్రమైన పరిణామాలపై అమెరికా వైస్ ప్రెసిడెంట్ జేడీ వాన్స్, జాయింట్ చీఫ్స్ ఆఫ్ స్టాఫ్ ఛైర్మన్ జనరల్ డాన్ కేన్ ఆందోళన వ్యక్తం చేసినట్లు మీడియా కథనాలు పేర్కొన్నాయి. అంతేకాకుండా, హార్మూజ్ జలసంధి ప్రాంతంలో సైనిక చర్యలు ఇప్పటికే గరిష్ఠ ప్రభావ పరిమితికి చేరుకున్నాయని, అందుకే బాంబు దాడులను నిలిపివేయడం మంచిదని అమెరికా సెంట్రల్ కమాండ్ (సెంట్‌కామ్) అధిపతి అడ్మిరల్ బ్రాడ్ కూపర్ సూచించినట్లు తెలుస్తోంది. ఈ నివేదికలు ట్రంప్ నిర్ణయాన్ని ప్రభావితం చేశాయి.అమెరికా-ఇరాన్ మధ్య దౌత్యపరమైన చర్చలు విజయవంతం చేసేందుకు ఇరాన్, ఒమన్ దేశాలు ప్రధానంగా నాయకత్వం వహిస్తున్నాయి.



# విదేశాల్లోనే బతుకులు బుగ్గిపాలు

- **మూడేళ్లలో 1,900 మందికి పైగా భారతీయుల ఆత్మహత్యలు**
- **కుటుంబ పోషణ కోసం సరిహద్దులు దాటి బలవన్మరణాలు**
- **కలకలం రేపుతున్న కేంద్ర ప్రభుత్వ గణాంకాలు**
- **గల్ఫ్ దేశాల్లోనే అత్యధిక బలవన్మరణాలు**
- **మూడేళ్లలో ఏకంగా 1,340 మంది కార్మికుల ఆత్మహత్య**
- **యూఏఈ, సౌదీ అరేబియాల్లోనే అధిక మరణాలు**
- **లోక్‌సభలో విదేశాంగ శాఖ సహాయ మంత్రి కీర్తి వర్ధన్ సింగ్ వెల్లడి**

**న్యూఢిల్లీ, వెలుతురు, జూలై 28:**

రెక్కలు ముక్కలు చేసుకునైనా తమ కుటుంబాలకు మెరుగైన భవిష్యత్తును అందించాలని, నాలుగు రాళ్లు వెనుకేసుకోవాలని ఎన్నో ఆశలతో దేశాలు దాటి వెళ్తున్న మన భారతీయుల జీవితాలు విదేశాల్లోనే తెల్లారిపోతున్నాయి. భారీగా అప్పులు చేసి, ప్రాణసమానమైన కన్నవారిని, భార్యాపిల్లలను వదిలి సముద్రాలు దాటి వెళ్లిన అనేకమంది బతుకులు అక్కడే అర్ధాంతరంగా ముగిసిపోతున్నాయి. విదేశాల్లో నివసిస్తున్న భారతీయ పౌరుల ఆత్మహత్యల సంఖ్య రోజురోజుకూ పెరుగుతుండడం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. గత మూడేళ్ల కాలంలో (2023-2025) విదేశాల్లో సంభవించిన భారతీయ పౌరుల మరణాలపై కేంద్ర ప్రభుత్వం తాజాగా లోక్‌సభలో సమర్పించిన గణాంకాలు తీవ్ర షాక్‌కు గురిచేస్తున్నాయి.కేంద్ర ప్రభుత్వం సేకరించిన అధికారిక నివేదికల ప్రకారం.. గడిచిన మూడేళ్లలో ప్రపంచవ్యాప్తంగా 1,900 మందికి పైగా భారతీయులు విదేశాల్లో ఆత్మహత్య చేసుకుని తమ విలువైన ప్రాణాలను తీసుకున్నారు. అత్యంత విషాదకరమైన విషయమేమిటంటే, ఈ మొత్తం ఆత్మహత్యలలో ఏకంగా 70 శాతానికి పైగా మరణాలు కేవలం గల్ఫ్ దేశాల్లోనే నమోదయ్యాయి. గల్ఫ్ ప్రాంతంలో ఉపాధి పొందుతున్న భారతీయ కార్మికులు ఎదుర్కొంటున్న తీవ్ర మానసిక ఒత్తిడి, కఠినమైన పని పరిస్థితులు మరియు ఆర్థిక ఇబ్బందులే ఈ బలవన్మరణాలకు ప్రధాన కారణాలని విశ్లేషకులు భావిస్తున్నారు. మూడేళ్ల వ్యవధిలోనే 1,340 మంది భారతీయులు గల్ఫ్ దేశాల్లో బలవన్మరణానికి పాల్పడ్డారు.కాంగ్రెస్ పార్టీ ఎంపీలు సత్పాల్ బ్రహ్మచారి, జై ప్రకాశ్ లోక్‌సభలో అడిగిన ప్రశ్నకు విదేశాంగ శాఖ సహాయ మంత్రి కీర్తి వర్ధన్ సింగ్ లిఖిత పూర్వక సమాధానం ఇస్తూ ఈ వివరాలను సభకు సమర్పించారు. కేంద్రం అందించిన డేటా ప్రకారం.. గల్ఫ్ దేశాలైన యూఏఈలో అత్యధికంగా 511 మంది భారతీయులు ఆత్మహత్య చేసుకున్నారు. ఆ తర్వాత సౌదీ అరేబియాలో 354 మంది, కువైట్‌లో 162 మంది, ఒమన్ దేశంలో 146 మంది, బహ్రెయిన్‌లో 101 మంది మరియు ఖతార్‌లో 66 మంది భారతీయులు ప్రాణాలు తీసుకున్నట్లు విదేశాంగ శాఖ స్పష్టం చేసింది.కేవలం గల్ఫ్ దేశాలే కాకుండా ఇతర ఆసియా, పాశ్చాత్య దేశాల్లో కూడా భారతీయ పౌరుల ఆత్మహత్యల సంఖ్య ఆందోళనకరంగా ఉంది. గల్ఫ్ దేశాల తర్వాత ఆసియా ఖండంలోని మలేషియాలో అత్యధికంగా 131 ఆత్మహత్య కేసులు నమోదయ్యాయి. ఇక అగ్రరాజ్యం అమెరికాలో 62 మంది భారతీయులు ఆత్మహత్యకు పాల్పడగా.. ఐరోపా మరియు ఉత్తర అమెరికా దేశాలైన ఇటలీ, కెనడా, యునైటెడ్ కింగ్‌డమ్ (యూకే) లలో ఒక్కో దేశంలో 30కి పైగా భారతీయ ఆత్మహత్య కేసులు అధికారికంగా రికార్డయ్యాయి.గత చరిత్రతో పోలిస్తే విదేశాల్లో నివసిస్తున్న భారతీయుల ఆత్మహత్యల వార్షిక సగటు సంఖ్య ఇటీవలి కాలంలో గణనీయంగా పెరిగినట్లు సేకరించిన గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. అంతకుముందు 2014 నుండి 2022 వరకు ఉన్న ఎనిమిదేళ్ల సుదీర్ఘ కాలంలో మొత్తం 4,005 ఆత్మహత్యలు జరిగినట్లు విదేశాంగ శాఖ సభకు తెలిపింది. కానీ 2023 నుండి 2025 వరకు ఉన్న కేవలం మూడేళ్ల వ్యవధిలోనే 1,900 కి పైగా కేసులు నమోదు కావడం విదేశాల్లో మన కార్మికులు అనుభవిస్తున్న నరకయాతనకు అద్దం పడుతోంది.ఆత్మహత్యలే కాకుండా, విదేశాల్లో పని చేసే ప్రదేశాల్లో తగిన రక్షణ చర్యలు లేకపోవడం వల్ల జరుగుతున్న ప్రమాదాలలో కూడా అనేకమంది భారతీయ కార్మికులు తమ ప్రాణాలను వదులుతున్నారు. పని ప్రదేశాల్లో చోటు చేసుకున్న ప్రమాదాల వల్ల సంభవించిన మరణాల్లో సౌదీ అరేబియా మొదటి స్థానంలో ఉంది. ఈ దేశంలో 182 మంది భారతీయులు పని ప్రదేశాల్లో ప్రమాదాల వల్ల మరణించగా, యూఏఈలో 128 మంది, అమెరికాలో 46 మంది, కెనడాలో 40 మంది, సింగపూర్‌లో 32 మంది మరియు మాల్దీవులలో 13 మంది కార్మికులు ప్రమాదవశాత్తూ దుర్మరణం పాలయ్యారు.ఈ ఆత్మహత్యలు మరియు ప్రమాద మరణాలకు గల నిర్దిష్ట కారణాలను కేంద్ర ప్రభుత్వం స్పష్టంగా పేర్కొననప్పటికీ, విదేశాలకు వెళ్లే భారతీయ కార్మికుల సంక్షేమం మరియు భద్రత కోసం పలు రకాల పథకాలను అమలు చేస్తున్నట్లు విదేశాంగ సహాయ మంత్రి తెలిపారు. ఇందులో భాగంగా 'ఎమిగ్రేషన్ చెక్ రిక్వైర్డ్' (ఈసీఆర్) కేటగిరీ కింద విదేశాలకు వెళ్లే కార్మికుల కోసం 'ప్రవాసి భారతీయ బీమా యోజన'ను అమలు చేస్తున్నామని, దీనికింద రూ. 10 లక్షల ఉచిత ప్రమాద బీమా సదుపాయాన్ని బాధితులకు లేదా వారి కుటుంబాలకు అందిస్తున్నట్లు వివరించారు.విదేశాల్లో చిక్కుకున్న లేదా కష్టాల్లో ఉన్న భారతీయ పౌరులకు, కార్మికులకు ఎంబసీల ద్వారా నిరంతరం సాయం అందిస్తున్నామని కేంద్రం పేర్కొంది. అయితే కేవలం బీమా పరిహారం అందించడమే కాకుండా, విదేశాల్లో భారతీయులు ముఖ్యంగా గల్ఫ్ కార్మికులు ఆత్మహత్యలకు పాల్పడడానికి గల మానసిక, సామాజిక, ఆర్థిక కారణాలపై లోతైన అధ్యయనం జరగాలని నిపుణులు కోరుతున్నారు. విదేశీ రాయబార కార్యాలయాల్లో మానసిక నిపుణులతో కౌన్సెలింగ్ సెంటర్లు ఏర్పాటు చేసి, మన వారి ప్రాణాలను కాపాడాలని ప్రవాస సంఘాలు కోరుతున్నాయి.

# ఆదిలాబాద్ ఎయిర్‌పోర్ట్‌తో ఉత్తర తెలంగాణకు కొత్త ఊపు

- **హైదరాబాద్ తర్వాత భారీ ఇండస్ట్రియల్ పార్క్ లాజిస్టిక్స్, కార్గో హబ్‌గా ఆదిలాబాద్**
- **మోదీ చేతుల మీదుగా త్వరలో శంకుస్థాపన**
- **కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు పాయల్ శంకర్ కృతజ్ఞతలు**

**న్యూఢిల్లీ వెలుతురు జూలై 28:**



ఆదిలాబాద్‌లో ఎయిర్‌పోర్ట్ మంజూరు ఉమ్మడి ఉత్తర తెలంగాణ అభివృద్ధికి కీలక మలుపుగా మారనుందని బీజేపీ ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. బీజేపీ ఎమ్మెల్యే పాయల్ శంకర్ మాట్లాడుతూ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతోనే ఈ ప్రాజెక్టు సాధ్యమైందన్నారు.ఎయిర్‌పోర్ట్ నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.2,278 కోట్లు కేటాయించగా, రక్షణ శాఖ మరో రూ.3,000 కోట్లు వెచ్చించనున్నట్లు తెలిపారు. మొత్తం సుమారు రూ.5,500 కోట్ల వ్యయంతో రక్షణ శాఖ, ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా భాగస్వామ్యంలో జాయింట్ యూజర్ ఎయిర్‌పోర్ట్‌గా దీనిని అభివృద్ధి చేయనున్నట్లు చెప్పారు.హైదరాబాద్ తర్వాత రాష్ట్రంలోనే అతిపెద్ద ఇండస్ట్రియల్ పార్క్‌ను ఆదిలాబాద్‌లో ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. ఇప్పటికే 2,200 ఎకరాల భూసేకరణకు ప్రభుత్వం జీవో జారీ చేయగా, మరో 6 వేల ఎకరాల భూసేకరణ ప్రక్రియ కొనసాగుతోందన్నారు.ఎయిర్‌పోర్ట్, ఇండస్ట్రియల్ కారిడార్‌తో ఆదిలాబాద్ జాతీయ స్థాయి లాజిస్టిక్స్ హబ్‌గా, కార్గో కేంద్రంగా ఎదిగే అవకాశముందని పాయల్ శంకర్ పేర్కొన్నారు. దీంతో టెక్స్‌టైల్, ఆగ్రో ప్రాసెసింగ్, పర్యాటకం, గిరిజన నైపుణ్యాభివృద్ధి వంటి రంగాలకు ఊతం లభిస్తుందని అన్నారు.ఎయిర్‌పోర్ట్ మంజూరుకు సహకరించిన ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ కుమార్, రామ్మోహన్ నాయుడు, రాజ్‌నాథ్ సింగ్‌తో పాటు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. త్వరలో ప్రధాని మోదీ చేతుల మీదుగా ఎయిర్‌పోర్ట్ శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

# ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు, పోతురాజు విన్యాసాలు



లండన్, వెలుతురు జూలై 28:

తెలంగాణ అసోసియేషన్ అఫ్ యునైటెడ్ కింగ్‌డమ్ (టాక్) ఆధ్వర్యంలో లండన్‌లో బోనాల జాతరను ఘనంగా నిర్వహించారు. భక్తి శ్రద్ధలతో, ఉత్సాహభరిత వాతావరణంలో జరిగిన ఈ వేడుకలకు యూకే నలుమూలల నుండి సుమారు 2500కి పైగా ప్రవాస కుటుంబ సభ్యులు హాజరయ్యారు. టాక్ అధ్యక్షుడు రత్నాకర్ కడుదుల, ఉపాధ్యక్షులు శుష్మణ రెడ్డి అధ్యక్షతన ప్రారంభమైన వేడుకలకు, వ్యాఖ్యాతగా ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ జెల్లా, కమ్యూనిటీ అఫైర్స్ చైర్‌పర్సన్ గణేష్ కుప్పాల వ్యవహరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిలుగా ఎంపీ సీమా మల్హోత్రా, భారత హై కమీషన్ ప్రతినిధి వివేక్ కుమార్, మాజీ ఎంపీ వీరేంద్ర శర్మ, హౌంస్లో నగర మేయర్ రంజిత్ గిల్ లు పాల్గొన్నారు.

మహిళలు బోనాలను ఊరేగింపుగా తీసుకొచ్చి అమ్మవార్లకు నైవేద్యంగా సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. పోతరాజుల విన్యాసాలు చూపరులను ఆకట్టుకున్నాయి. స్వదేశంలో జరుపుకున్నట్టు సాంప్రదాయ బద్ధ పూజలు, తొట్టెల ఊరేగింపు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కుటుంబ సమేతంగా అంతా కలిసి ఇలా వేడుకలు చేసికొని రాబోయే తరాలకి తెలియజెప్పడం ఎంతో స్ఫూర్తినిస్తుందని ముఖ్య అతిథిలు అన్నారు. లండన్ నగరం భిన్న సంస్కృతుల ప్రజలు నివసించే నగరమని, మనమంతా ఐకమత్యంగా ఉండి పరస్పర సంప్రదాయాలని సంస్కృతిని గౌరవించుకుంటూ ముందుకు వెళ్లాలని తెలిపారు. బోనాల ఊరేగింపులో పోతరాజుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి.

టాక్ కన్వీనర్లు అశోక్ గౌడ్ దూసరి, నవీన్ రెడ్డి మాట్లాడుతూ నేడు ప్రపంచవ్యాప్తంగా ప్రవాస తెలంగాణ సంఘాలు ఏర్పడి తెలంగాణ సంస్కృతిని విశ్వవ్యాప్తం అయ్యేలా కృషి జరుగుతుందంటే ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటేనని, కాబట్టి అన్ని సందర్భాల్లో రాష్ట్ర ఏర్పాటు కొరకై ముందుండి నాయకత్వం వహించిన ఉద్యమశిఖరం రాష్ట్ర మొదటి ముఖ్యమంత్రి కెసిఆర్ గారిని మనం అన్ని సందర్భాల్లో గుర్తు చేసుకోవాలని తెలిపారు. అలాగే ఈ కార్యక్రమం విజయవంతం చేసిన కార్యవర్గాన్ని అభినందించారు. మన రాష్ట్ర పండగని రాజకీయాలకు అతీతంగా మరింత వైభవంగా తెలంగాణ రాష్ట్రంలో నిర్వహించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

టాక్ సంస్థ అధ్యక్షుడు రత్నాకర్ కడుదుల మాట్లాడుతూ ఆషాఢంలో జరిగే బోనాలు విశిష్టతను వివరించారు. తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీక ఆషాఢ బోనాల వేడుకలని, పండుగను ప్రజలంతా కలిసిమెలిసి సంతోషంగా జరుపుకోవాలని కోరారు. అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరూ చల్లగా జీవించాలని, ప్రవాస తెలంగాణ ప్రజలందిరికీ బోనాల పండుగ శుభాకాంక్షలు తెలిపారు. టాక్ సంస్థ కార్యక్రమాల గురించి వివరించి, అందరు ఇందులో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. టాక్ సంస్థని అన్ని సందర్భాల్లో సూచనలు సలహాలు ఇస్తూ ముందుకు నడిపిస్తున్న తెలంగాణ రాష్ట్ర ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మాజీ చైర్మన్, టాక్ వ్యవస్థాపకుడు అనిల్ కూర్మాచలంకు కృతజ్ఞతలు తెలిపారు.

టాక్ ఉపాధ్యక్షురాలు శుష్మణ రెడ్డి మాట్లాడుతూ విశిష్టమైన తెలంగాణ సంస్కృతికి బోనాలు వేడుకలు ప్రతీకలుగా నిలుస్తాయని, టాక్ సంస్థ ద్వారా జరుపుతున్న బోనాల వేడుకలకు విచ్చేసిన



అతిథులకు, స్థానిక ప్రవాసులకు కృతజ్ఞతలు తెలిపారు. ఆడబిడ్డలందరు బోనాలతో మన సంస్కృతిని విశ్వవ్యాప్తం చేస్తున్న తీరు నూతన ఉత్సాహాన్ని నింపిందని, 'ఇలాంటి పండుగ వేళ పిల్లలకు మన సాంప్రదాయాన్ని ప్రత్యక్షంగా చూపించడం సంతోషంగా ఉంది' అని అన్నారు. అనంతరం టాక్ చేస్తున్న కార్యక్రమాల గురించి అలాగే భవిష్యత్తులో చేయబోయే కార్యక్రమాల గురించి సభకు వివరించారు.

ప్రధాన కార్యదర్శి సుప్రజ పులుసు మాట్లాడుతూ తెలంగాణలో




బోనాల పండగకు ఉన్న ప్రత్యేకత ఎంతో గొప్పదని, గ్రామ దేవతలను ఆరాధిస్తూ జరిపే ఈ పండుగకు యూకే నలుమూలల నుండి విచ్చేసి కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ప్రతిఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. టాక్ వ్యవస్థాపకులు అనిల్ కూర్మాచలం సహకారం, సూచనలు, స్ఫూర్తి వల్లే జాతరను ఇంత ఘనంగా నిర్వహించుకుంటామని తెలిపారు.

టాక్ ఉపాధ్యక్షుడు సురేష్ బుడగం మాట్లాడుతూ తెలంగాణ ప్రజలందిరికీ బోనాల పండుగ శుభాకాంక్షలు తెలిపారు. లండన్ లో తెలంగాణ రాష్ట్ర పండుగను ఇంత ఘనంగా నిర్వహించుకోవడం గర్వాంగా ఉందని, ప్రవాస తెలంగాణ సంఘాలు ఏర్పడ్డాక బోనాలు – బతుకమ్మ వేడుకల్ని ప్రపంచవ్యాప్తంగా ఎంతో వైభవంగా నిర్వహిస్తున్నారని తెలిపారు.

టాక్ అడ్వైసరి చైర్మన్ మట్టా రెడ్డి మాటాడుతూ టాక్ సంస్థ చేపడుతున్న కార్యక్రమాలు ఎందరికో ఆదర్శంగా ఉన్నాయని, బోనాల జాతర వేడుకల విజయానికి కృషి చేసిన సహకరించిన స్థానిక ప్రభుత్వ యంత్రంగానికి, టాక్ కార్యవర్గానికి, స్థానికి సంస్థలకు, అతిధులకు, అలాగే హాజరై ప్రోత్సహించిన ఎన్నారై మిత్రులకు కృతజ్ఞతలు తెలిపారు.

అనంతరం కార్యక్రమంలో పాల్గొన్నఅతిథుల్ని ఇతర సంస్థల్ని ప్రతినిధులని, స్పాన్సర్స్, సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్ లను, సాంస్కృతిక కార్యక్రమంలో పాల్గొన్న ప్రతి ఒక్కరిని సంస్థ కార్యవర్గ సభ్యులు జ్ఞాపికలతో సత్కరించి, బహుమతులందజేశారు. టాక్ కార్యదర్శి క్రాంతి రేతినేని వందన సమర్పణతో కార్యక్రమం ముగించారు.

ఈ కార్యక్రమంలో కంది పవిత్ర, రాకేష్ పటేల్, సత్యం కంది, సత్యపాల్ రెడ్డి పింగిళి, సత్య చిలుముల, రవి రేతినేని , రవి ప్రదీప్ పులుసు, మల్లా రెడ్డి, గణేష్ పస్తం, నాగరాజు తౌటం, శ్రీధర్ రావు, శైలజ జెల్లా,స్నేహ, విజయ లక్ష్మి , శ్వేతా మహేందర్, స్వాతి, క్రాంతి, శ్రీ విద్య, దివ్య, ప్రవీణ్ వీర, మణితేజ, నిఖిల్ రెడ్డి, హరిగౌడ్ నవపేట్, రంజిత్, రాజేష్ వాక, మాధవ రెడ్డి, అంజన్, తరుణ్ లూణావత్, సందీప్, ఆనంద్, లతా కూర్మాచలం, పావని, కార్తీక్, స్నేహ, అమరేశ్వరి, సాయి రావు, జస్వంత్, ప్రశాంత్, వినోద్, నవ్య, ఉమా తదితరులు పాల్గొన్నారు.




# చారిత్రక వారసత్వ పరిరక్షణ అందరి బాధ్యత

- మంత్రి వాకిటి శ్రీహరి కీలక సూచనలు

(మొదటి పేజీ తరువాయి)

నారాయణపేట జిల్లా మక్తల్ నియోజకవర్గంలోని ముడుమాల్ గ్రామంలో ఉన్న అత్యంత పురాతన, చారిత్రక నిలువురాళ్ల పార్కు అభివృద్ధి పనులకు ఆయన మంగళవారం ఘనంగా శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో మంత్రి మాట్లాడుతూ చారిత్రక ప్రాంతాల రక్షణకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.రాష్ట్రంలో సాంస్కృతిక వారసత్వాన్ని కాపాడటంతో పాటు పర్యాటక కేంద్రాల అభివృద్ధికి తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి శ్రీహరి తెలిపారు. ముడుమాల్ నిలువురాళ్ల పార్కును మరింత ఆకర్షణీయంగా తీర్చిదిద్ది, ఇక్కడికి వచ్చే సందర్శకులకు అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలు కల్పించేలా అభివృద్ధి పనులు వేగవంతం చేస్తున్నామని చెప్పారు. ఈ పనులు పూర్తయితే పార్కుకు అంతర్జాతీయ గుర్తింపు రావడమే కాకుండా, పర్యాటకుల రాక పెరిగి స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు మెరుగవుతాయని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న దక్కన్ హెరిటేజ్ అకాడమీ ట్రస్ట్ చైర్మన్ వేద కుమార్ మాట్లాడుతూ.. ముడుమాల్ నిలువురాళ్లకు యునెస్కో ప్రపంచ వారసత్వ తాత్కాలిక జాబితాలో చోటు దక్కడమే ఒక గొప్ప చారిత్రక విజయమని, ఇది మొత్తం తెలంగాణ రాష్ట్రానికే గర్వకారణమని హర్షం వ్యక్తం చేశారు. ప్రస్తుతం యునెస్కో నుంచి శాశ్వత గుర్తింపు సాధించడం కోసం ప్రభుత్వం, పురాతత్వ శాఖల ఆధ్వర్యంలో గట్టి కృషి జరుగుతోందని వివరించారు.అరుదైన ఈ నిలువురాళ్ల ప్రాంతాన్ని భవిష్యత్ తరాల కోసం కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని వేద కుమార్ అభిప్రాయపడ్డారు. గతంలో పనిచేసిన జిల్లా కలెక్టర్లు కూడా ఈ ప్రాంత పరిరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకున్నారని గుర్తుచేశారు. యునెస్కో శాశ్వత గుర్తింపు పొందేందుకు కొన్ని ప్రత్యేక సూచనలు ఇచ్చిందని, వాటిని పాటిస్తూ ఇప్పటికే మంత్రి వాకిటి శ్రీహరి ద్వారా రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి తగిన ప్రతిపాదనలు పంపిందని, త్వరితగతిన వసతులు పూర్తి చేయాలని కోరారు.ఈ చారిత్రక ప్రదేశ ప్రాముఖ్యతను భావి తరాలకు అందించేందుకు జిల్లాలోని 400 పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు (హెడ్మాస్టర్లకు) ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. దీని ద్వారా సుమారు 60 వేల మంది విద్యార్థులు ముడుమాల్ నిలువురాళ్లను సందర్శించేలా ప్రణాళిక రూపొందిస్తున్నామని చెప్పారు. పాఠశాల స్థాయి నుంచే పిల్లల్లో స్థానిక చరిత్రపై అవగాహన, గౌరవం పెంచడమే ఈ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశమని వెల్లడించారు.పర్యాటకులకు ఇక్కడి విశేషాలను వివరించేందుకు వీలుగా 20 మంది స్థానిక యువకులకు శిక్షణ ఇచ్చి టూరిస్ట్ గైడ్లుగా నియమిస్తామన్నారు. అలాగే చుట్టుపక్కల గ్రామాల ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ప్రత్యేక రూట్ మ్యాప్, సమాచార కరపత్రాలను తయారు చేయనున్నట్లు వివరించారు. స్థానిక ప్రజలు కూడా ఈ ప్రక్రియలో భాగస్వాములై, ముడుమాల్ క్షేత్రం యొక్క విశిష్టతను ప్రపంచానికి చాటిచెప్పేలా ముందుకు రావాలని పిలుపునిచ్చారు.ఆధునిక శాస్త్ర విజ్ఞానం, సాంకేతికత అందుబాటులోకి రాకముందే.. దాదాపు 3,000 సంవత్సరాల క్రితమే ఇక్కడి ఆదిమానవులు నిలువురాళ్ల రూపంలో నక్షత్ర మండలాన్ని (ఖగోళ వ్యవస్థను) ఆనాడే ఆవిష్కరించారని వేద కుమార్ వివరించారు. ఇది మన పూర్వీకుల అపారమైన ఖగోళ జ్ఞానానికి ప్రతీక అని, ఇలాంటి పురాతన ఖగోళ పరిశోధనా స్థలాలు ప్రపంచంలోనే చాలా అరుదుగా ఉంటాయని స్పష్టం చేశారు.మనకు లభించిన ఈ అరుదైన చారిత్రక అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అధికారులు, నాయకులకు పిలుపునిచ్చారు. వివిధ ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పనిచేస్తూ, ముడుమాల్ నిలువురాళ్ల విశిష్టతను అంతర్జాతీయ పర్యాటక పటంలో ప్రముఖంగా నిలిపేలా చర్యలు తీసుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు మరియు గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# టెలివిజన్ అవార్డుల్లో తెలంగాణ ఆత్మ ప్రతిబింబించాలి

- అవార్డులకు మాజీ ప్రధాని పి.వి. నరసింహారావు పేరు
- - సీఎంతో చర్చించి తుది నిర్ణయం తీసుకుంటామన్న మంత్రి
- తెలంగాణ సంస్కృతిని చాటిచెప్పేలా లోగో
- మార్గదర్శకాలు: కమిటీకి కీలక ఆదేశాలు జారీ
- టీవీ రంగానికి మహిళలు, వృద్ధుల ఆదరణ
- నిష్పాక్షికంగా నిర్వహించాలని కమిటీకి సూచన

హైదరాబాద్, వెలుతురు, జూలై 28:

తెలంగాణ రాష్ట్రంలో అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించతలపెట్టిన టెలివిజన్ (టీవీ) అవార్డుల రూపకల్పన, అవసరమైన మార్గదర్శకాలు, లోగో మరియు అవార్డుల పేర్ల ఎంపికపై సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అధ్యక్షతన ప్రత్యేక సమీక్షా సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఎమ్మెల్సీ శంకర్ నాయక్, ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎఫ్‌డీసీ) మేనేజింగ్ డైరెక్టర్ ముకుంద రెడ్డి, టెలివిజన్ అవార్డుల కమిటీ చైర్మన్, సభ్యులు మరియు సంబంధిత ఉన్నతాధికారులు పాల్గొని వివిధ అంశాలపై విస్తృతంగా చర్చించారు.రాష్ట్ర ప్రభుత్వం తొలిసారిగా ఇవ్వనున్న ఈ టెలివిజన్ అవార్డులకు బహుభాషా కోవిదుడు, దేశ ఆర్థిక సంస్కరణల పితామహుడు, మాజీ ప్రధానమంత్రి స్వర్గీయ పి.వి. నరసింహారావు పేరును పెట్టాలని కమిటీ సభ్యులు ప్రతిపాదించారు. ఈ ప్రతిపాదనపై మంత్రి స్పందిస్తూ.. పి.వి. నరసింహారావు వంటి మహోన్నత వ్యక్తుల పేర్లను పరిశీలించడంలో ప్రభుత్వం సానుకూల దృక్పథంతో ఉందన్నారు. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి చర్చించిన తర్వాతే తుది నిర్ణయం తీసుకుంటామని ఆయన చెప్పారు.టెలివిజన్ అవార్డులకు సంబంధించిన విధివిధానాలు, నిబంధనలు, లోగో మరియు అవార్డుల పేర్ల నివేదికను వీలైనంత త్వరగా సిద్ధం చేసి ప్రభుత్వానికి సమర్పించాలని కమిటీని మంత్రి ఆదేశించారు. రూపొందించే అవార్డుల పేరు మరియు లోగో తెలంగాణ రాష్ట్ర ఆత్మను, స్థానిక సంస్కృతిని, ప్రాంతీయ విశిష్టతను మరియు ప్రత్యేకతను స్పష్టంగా ప్రతిబింబించేలా ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.సమీక్షా సమావేశంలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి మాట్లాడుతూ, ప్రస్తుత కాలంలో టెలివిజన్ రంగం ప్రజలకు అత్యధిక వినోదాన్ని అందించే




ప్రధాన మాధ్యమంగా మారిందన్నారు. ముఖ్యంగా గృహిణులు, మహిళలు మరియు వృద్ధులు ప్రతిరోజూ టెలివిజన్ కార్యక్రమాలు, సీరియళ్లు చూడటానికి విశేష ఆసక్తి చూపుతున్నారని పేర్కొన్నారు. సమాజంలో ప్రతి ఇంటా టీవీ రంగం భాగమైపోయిందని అభిప్రాయపడ్డారు.టెలివిజన్ రంగంలో తమ ప్రతిభను చాటుకుంటున్న నటీనటులు, ఇతర కళాకారులు మరియు వెనక ఉండి పనిచేసే సాంకేతిక నిపుణులను (టెక్నీషియన్లు) ప్రోత్సహించేందుకే ఈ అవార్డులను తీసుకువస్తున్నట్లు మంత్రి వెల్లడించారు. సమాజానికి మంచి సందేశాలను ఇచ్చే సీరియళ్లు, ప్రత్యేక కార్యక్రమాలు, నాణ్యమైన కంటెంట్‌తో పాటు బాలల చిత్రాలను రూపొందించే ప్రొడ్యూసర్లు, డైరెక్టర్లను గౌరవించేలా ఈ అవార్డులను తీర్చిదిద్దుతామన్నారు.రాష్ట్ర అవతరణ తర్వాత మొదటిసారిగా ప్రదానం చేయనున్న ఈ టెలివిజన్ అవార్డులను అత్యంత ప్రతిష్ఠాత్మకమైన రీతిలో నిర్వహించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. అవార్డు గ్రహీతల ఎంపిక ప్రక్రియ ఎలాంటి విమర్శలకు తావులేకుండా, అత్యంత పారదర్శకంగా మరియు నిష్పాక్షికంగా జరగాలని కమిటీ చైర్మన్ మరియు సభ్యులకు మంత్రి స్పష్టమైన సూచనలు చేశారు. అర్హులైన నిజమైన ప్రతిభావంతులకే పురస్కారాలు దక్కాలని ఆదేశించారు.ఈ అవార్డుల ఈవెంట్ నిర్వహణ బాధ్యతలను ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ ముకుంద రెడ్డి ప్రత్యేకంగా పర్యవేక్షించాలని మంత్రి ఆదేశించారు. వేడుకలను కన్నుల పండువగా జరిపేందుకు అనువుగా ఉండే రెండు లేదా మూడు ప్రధాన వేదికల (వెన్యూస్) జాబితాను ముందుగానే సిద్ధం చేసి ఉంచాలని చెప్పారు. ప్రదానోత్సవ కార్యక్రమం రాష్ట్రస్థాయిలో మైలురాయిగా నిలిచిపోయేలా ఏర్పాట్లు ఉండాలని పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో కమిటీ సభ్యులు మరియు అధికారులు అందించిన పలు రకాల ప్రతిపాదనలు, సూచనలపై సమగ్రంగా చర్చించామన్నారు. వీటన్నింటినీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి, ఆయనతో తుది విడత చర్చించిన అనంతరం అవార్డుల తేదీలు, లోగో మరియు పేరును అధికారికంగా ప్రకటిస్తామని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి వివరించారు.

# యాంటీ-పేపర్ లీక్ బిల్లు చరిత్రాత్మకం

- **లోక్‌సభలో కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ వ్యాఖ్యలు**
- **పార్లమెంట్ చరిత్రలోనే చారిత్రక బిల్లు**
- **యువత భవిష్యత్తుపై కేంద్రం చిత్తశుద్ధికి నిదర్శనం**

**లోక్‌సభలో యాంటీ-పేపర్ లీక్ బిల్లుపై ముమ్మర చర్చ**

- **గత ప్రభుత్వాల హయాంలో జరిగిన లీకేజీల లెక్కింపు**
- **వ్యవస్థాగత నేరాలుగా మారిన లీకేజీలు**
- **గతంలో జరిగిన అరకొర ప్రయత్నాలపై కేంద్ర మంత్రి నిలదీత**
- **నిందితులను కఠినంగా శిక్షించేలా కొత్త నిబంధనల రూపకల్పన**

**న్యూఢిల్లీ, వెలుతురు, జూలై 28:**

తన ప్రభుత్వం లోక్‌సభలో ప్రవేశపెట్టిన యాంటీ–పేపర్ లీక్ బిల్లు భారత పార్లమెంట్ చరిత్రలోనే నిలిచిపోయే ఒక మైలురాయి లాంటిదని కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ వ్యాఖ్యానించారు. దేశంలోని కోట్లాది మంది విద్యార్థులు, యువత భవిష్యత్తు పట్ల తమ ప్రభుత్వానికి ఉన్న అమితమైన ప్రేమ, చిత్తశుద్ధికి ఈ బిల్లు స్పష్టమైన నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. పోటీ పరీక్షల్లో పారదర్శకతను పెంచేందుకు ఈ చట్టం ఎంతో దోహదపడుతుందని ధీమా వ్యక్తం చేశారు.లోక్‌సభలో ప్రవేశపెట్టిన ఈ యాంటీ–పేపర్ లీక్ బిల్లుపై సభలో నిబంధనల ప్రకారం విస్తృత స్థాయిలో చర్చ ప్రారంభమైంది. ఈ చర్చ సందర్భంగా కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ మాట్లాడుతూ, గతంలో యునైటెడ్ ప్రోగ్రెసివ్ అలయన్స్ (యుపిఎ) పాలనా కాలంలో పలుమార్లు వివిధ పరీక్షల పేపర్లు లీక్ అయ్యాయని గుర్తుచేశారు. 2012లో ఎయిమ్స్ ఎంట్రన్స్ పరీక్ష, 2010లో ఉత్తరప్రదేశ్ బి.ఇడి పరీక్ష, అలాగే తమిళనాడు పబ్లిక్ సర్వీస్ కమిషన్ (పిఎస్సి) నిర్వహించిన ఉద్యోగ పరీక్షల పేపర్లు లీక్ అయి వేలాది మంది అభ్యర్థుల భవిష్యత్తు దెబ్బతిన్నదని గణాంకాలతో సహా వివరించారు.

దేశంలో ప్రవేశ పరీక్షలు, ప్రభుత్వ ఉద్యోగ నియామక పరీక్షల పేపర్లు తరచూ బయటకు రావడం వల్ల పేపర్ లీకేజీలు కాలక్రమేణా పెద్ద వ్యవస్థాగత నేరాలుగా (ఆర్గనైజ్డ్ క్రైమ్స్) మారాయని జితేంద్ర సింగ్ ఆందోళన వ్యక్తం చేశారు. ఈ లీకేజీ వ్యవస్థను అరికట్టేందుకు 1992, 2010 లలో కూడా కొన్ని ప్రయత్నాలు జరిగాయని, అయితే ఆ ప్రయత్నాలు ఎందుకు అర్థాంతరంగా ఆగిపోయాయో, ఎందుకు పూర్తిస్థాయిలో విజయవంతం కాలేదో ఆనాటి పాలకులు సమాధానం చెప్పాలని సభ వేదికగా నిలదీశారు.లక్షలాది మంది విద్యార్థుల కష్టాన్ని దోచుకునే నేరస్థులను, ఈ దందా వెనుక ఉన్న సూత్రధారులను అత్యంత కఠినంగా శిక్షించేలా కొత్త బిల్లులో సమగ్రమైన నిబంధనలను రూపొందించినట్లు మంత్రి ప్రకటించారు. పేపర్ లీకేజీలకు పాల్పడే నిందితులకు విధించే జైలు శిక్ష కాలాన్ని ఏకంగా పదేళ్లకు పెంచినట్లు తెలిపారు. ఈ కఠిన నిబంధనల వల్ల నేరాలు చేయాలనుకునే వారికి భయం



పుడుతుందని అభిప్రాయపడ్డారు.

పరీక్షల అక్రమాలకు పాల్పడుతూ అభ్యర్థుల నుంచి కోట్లాది రూపాయలు దండుకునే లీకేజీ ముఠాలపై (మాఫియా) ఆర్థికంగా తీవ్రమైన దెబ్బ కొట్టేందుకు ఈ బిల్లులో నిబంధనలు చేర్చారు. లీకేజీ గ్యాంగ్‌లు, ఏజెన్సీలకు విధించే జరిమానా మొత్తాన్ని ఇదివరకు ఉన్న రూ. కోటి నుండి గరిష్ఠంగా రూ. 10 కోట్లకు పెంచినట్లు మంత్రి వివరించారు. ఈ నిర్ణయం వల్ల వ్యాపారంగా మారిన పేపర్ లీకేజీ వ్యవహారాలకు స్వస్తి పడుతుందన్నారు.ఈ కొత్త చట్టం పరిధిలోకి వచ్చే పేపర్ లీకేజీ కేసుల విచారణను వేగవంతం చేసేందుకు మరియు బాధితులకు త్వరితగతిన న్యాయం అందించేందుకు ప్రత్యేకంగా ఫాస్ట్ ట్రాక్ కోర్టులను ఏర్పాటు చేయనున్నట్లు కేంద్ర మంత్రి తెలిపారు. ఏళ్ల తరబడి విచారణలు సాగకుండా, నిర్దేశిత కాలవ్యవధిలోనే నిందితులకు శిక్ష పడేలా ఈ ఫాస్ట్ ట్రాక్ కోర్టులు పనిచేస్తాయని, దీనిద్వారా బాధితులకు సత్వర న్యాయం జరుగుతుందని స్పష్టం చేశారు.

పరీక్షల నిర్వహణలో భద్రతా వ్యవస్థలను పటిష్టం చేసేందుకు, సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి లీకేజీలను అరికట్టేందుకు ప్రముఖ సాంకేతిక నిపుణుడు నందన్ నీలేకని ఆధ్వర్యంలో ఒక ఉన్నత స్థాయి టాస్క్ ఫోర్స్‌ను ఏర్పాటు చేసినట్లు మంత్రి సభకు వెల్లడించారు. ఈ టాస్క్ ఫోర్స్ అందించే సూచనలు, సాంకేతిక పరిష్కారాల ఆధారంగా రాబోయే రోజుల్లో ఎలాంటి లోపాలు లేని పరీక్షా వ్యవస్థను రూపొందిస్తామన్నారు.దేశంలోని యువత, విద్యార్థుల ప్రయోజనాలను కాపాడటమే నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని జితేంద్ర సింగ్ పునరుద్ఘాటించారు. దేశ భవిష్యత్తు అయిన యువతకు నష్టం జరగకుండా, అర్హులైన ప్రతి ఒక్కరికీ న్యాయం జరిగేలా ప్రధాని మోదీ ఎంతో శ్రమిస్తున్నారని కొనియాడారు. ఈ చారిత్రాత్మక బిల్లుకు సభలోని సభ్యులందరూ మద్దతు తెలపాలని ఆయన విజ్ఞప్తి చేశారు.






Edited, Printed, Published and Owner by BAKKA YADAIAH, Published & Printed at SRI SHANTHI PUBLICATIONS H.No. 7-2-31/221/2, S.V. Colony, Bairamalaguda, Saroornagar, Mdl.R.R. DIST, Telangana-79. EDITORG BAKKA YADAIAH, R.N.I. TEL TEL /2019 / 78609. Cell:91773 87328, Email: velthurunewspaper@gmail.com